# నినాదం

నిఖార్సైన జర్నలిజం

మంగళవారం, జూన్ 17, 2025 | సంపుటి - 20 | సంచిక 156 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ట్రంప్‌ను అంతమొందించే కుట్ర


### ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రధాని సంచలన వ్యాఖ్యలు



జెరూసలెం : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇరాన్ చంపాలని చూస్తున్నదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సంచ లన వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ టార్గెట్ ట్రంపేనని, ఆ దేశానికి ప్రథమ శత్రువు అమెరికా అధ్యక్షుడేనని చెప్పారు. అణు ఒప్పందాన్ని రద్దు చేసినందుకే ట్రంప్‌ను లేకుండా చేయాలని ఇరాన్ భావిస్తున్నదని ఆరోపించారు. 2024లో రెండుసార్లు ఆయనను అంతమొందించడానికి ఇరాన్ ప్రయత్నించిందన్నారు. ఇజ్రాయెల్-ఇరాన్ పరస్పర దాడుల నేపథ్యంలో నెతన్యాహూ మాట్లాడుతూ.. ట్రంప్‌ను చంపాలని ఇరాన్ చూస్తున్నది.

2లో

## ఇరాన్‌పై అణుదాడికి ఇజ్రాయెల్ కుట్ర



2

- అదే జరిగితే పాక్ రంగలోకి దగుతుంది
- ఐఆర్‌జీసీ జనరల్ మొహసిన్ రెజాయి వ్యాఖ్యలు
- రెజాయ్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన పాక్ రక్షణ మంత్రి

## స్కిల్ వర్సిటీ అభివృద్ధికి సహకరించండి

### కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి విజ్ఞప్తి

#### నైపుణ్యాభివృద్ధికి కేంద్రంతో కలిసి పని చేసేందుకు సిద్ధం

#### "మెగా జాబ్/స్కిల్ & లోన్" మేళా ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు







**తెలంగాణను "స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబల్"గా మార్చాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరిని మంత్రి శ్రీధర్ బాబు కోరారు. సోమవారం మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్రెన్యూర్షిప్(గవర్నమెంట్ ఆఫ్ ఇండియా), డిప్టారెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్(తెలంగాణ) సంయుక్తాధ్వర్యంలో బషీర్ బాగ్ లోని పీజీ లా కళాశాలలో ఏర్పాటు చేసిన "మెగా జాబ్/స్కిల్ &లోన్ మేళా"ను కేంద్రమంత్రి జయంత్ చౌదరితో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు.**

హైదరాబాద్ : "తెలంగాణ యువత ప్రతిభే మా రాష్ట్రానికి ఉన్న అతి పెద్ద ఆస్తి. కానీ.. చాలా మందిలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలు ఉంటడం లేదు. పరిశ్రమలు, విద్యా సంస్థలు మధ్య నెలకొన్న అంతరాన్ని రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మా ప్రభుత్వం గుర్తించింది" అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. "అందర్నీ కలుపుకొని పోయే ప్రభుత్వం మాది. నైపుణ్యాభివృద్ధిలోనూ పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తున్నాం. వారి సహకారంతోనే స్కిల్ యూనివర్సిటీలో కోర్సులకు రూపకల్పన చేస్తున్నాం.

మిగతా 2లో



### సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ : పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా వాకిటి శ్రీహరి సోమవారం డా.బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఉదయం సచివాలయానికి చేరుకున్న మంత్రి వాకిటి శ్రీహరికి వేదమంత్రోచ్ఛారణలతో పండితులు స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్ లో వాకిటి ప్రత్యేక పూజలు చేసి, బాధ్యతలు చేపట్టారు. పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. ఆయనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

## రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు

- కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయండి
- అవపరాలు, నిధులపై నివేదిక ఇవ్వాలని సిఎం రేవంత్ ఆదేశం

మిగతాది 2లో



2

## మోడీకి అత్యుత్తమ పురస్కారం

### 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3 ప్రధానం

న్యూఢిల్లీ : సైప్రస్ పర్యటనలో ఉన్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3ను ప్రధానం చేశారు. ప్రధాని ఈ గౌరవాన్ని స్వీకరిస్తూ ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నట్టు ప్రకటించారు.

## 9 రోజుల్లోనే అందరికీ రైతుభరోసా పూర్తి చేస్తాం



- నేటి నుంచే రైతుభరోసా అందచేత
- రైతు ఖాతాల్లో నేరుగా నగదు జమ
- ఎకరాలతో సంబంధం లేకుండా అందరికీ వర్తింపు
- సిఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- రైతులకు కాంగ్రెస్‌తో విడదీయరాని బంధం ఉందన్న భట్టి

తెలంగాణ రైతులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రైతు భరోసాకు సంబంధించిన నగదు.. రైతుల ఖాతాల్లో వేస్తున్నట్లు వెల్లడించారు. జూన్ 16వ తేదీ హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంలో జరిగిన మంత్రుల సమావేశంలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. జూన్ 17వ తేదీ.. మంగళవారం నుంచి రైతు బ్యాంక్ ఖాతాల్లో.. రైతు భరోసా డబ్బులు జమ చేయనున్నట్లు చెప్పారాయన. ఎకరాలతో సంబంధం లేకుండా.. అంటే ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు రైతు భరోసా డబ్బులు వేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేశారు సీఎం.

**గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంట నష్టపోతే రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఐదేళ్లలో రైతుల కోసం మూడున్నర లక్షల కోట్లు ఖర్చు చేస్తాం. ఆర్థిక పరమైన ఇబ్బందులున్నా ఒక్క పథకాన్ని ఆపలేదు. సీఎం రేవంత్ రైతు భరోసా నిధులు ఇక్కడి నుంచే రిలీజ్ చేస్తారు. ఎన్ని ఎకరాలున్నా వ్యవసాయ యోగ్యమైన భూములకు పూర్తి స్థాయిలో రైతు భరోసా ఇస్తామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. 9 రోజుల్లో ప్రతి రైతులందరి ఖాతాలో డబ్బులు పడతాయని చెప్పారు.**



రంగారెడ్డి : రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రైతు వేదికల్లో 'రైతునేస్తం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రగనర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 1500 మంది రైతులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఆడిటోరియం నుంచి మరో 1034 రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రైతులతో ముచ్చటించారు.

మిగతా 2లో

## కాళేశ్వరంతో ఏమాత్రం ఉపయోగం లేదు

- ఎంతమాత్రం ఇది పనికి వచ్చే ప్రాజెక్ట్ కాదు
- గతంలోనే దీనిపై బిజెపి స్పష్టత ఇచ్చింది
- నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక కూడా తెలిపింది
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



2

## స్థానిక ఎన్నికలపై త్వరలోనే స్పష్టత

### జైలుకు పోవాలన్న తొందరలో కెటిఆర్ మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు



ములుగు : స్థానిక ఎన్నికల నిర్వహణపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సోమవారం నిర్వహించిన కార్యకర్తల మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల విషయంలో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నాలుగు నుంచి ఐదు రోజుల్లో పూర్తి వివరాలు బయటకు వస్తాయి.

2లో

## ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు

### ఇప్పటికే 14 కేసులు..మరో 1400 కేసులు పెట్టుకో

- ఆనాడు తెలంగాణ కోసం జైలుకెళ్లాం
- నీ ఉడుత ఊపులకు ఎట్టి పరిస్థితుల్లో భయపడం
- తెలంగాణ భవన్‌లో మీడియాతో కెటిఆర్



హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు పెట్టుకునేలా ... స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఫుట్ బాల్ ఆడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఫార్ములా ఈ కేసులో ఏసీబీ విచారణ అనంతరం ఆయన తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. ఇలాంటి కేసులు పెట్టి ఏదో సాధిస్తానని రేవంత్‌రెడ్డి అనుకుంటున్నడు. రేవంత్‌రెడ్డికి చెప్పేది ఒక్కటే. నాపై ఇప్పటి వరకు 14 కేసులు పెట్టారు. ఇంకో 1400 కేసులు పెట్టుకో.. అవసరమైతే జైలులో పెట్టుకో. ఏమన్న చేసుకో. భయపడేది లేదన్నారు. తెలంగాణ కోసం ఆనాడు జైలుకు పోయినం. తెలంగాణ ప్రతిష్టను పెంచేందుకు తీసుకున్న నిర్ణయం వల్ల జైలుకు వెళ్లాల్సి వస్తే భయపడేటోడు ఎవడూ లేడు. నీ ఉడుత ఊపులకు ఎట్టి పరిస్థితుల్లో భయపడమని అన్నారు. చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలు తప్పా ఏం విషయం లేదని కెటిఆర్ విమర్శించారు.

2లో

## విచారణకు వెళితే ఇంత హంగామానా?



- ఎసిబి విచారణ ఆధారంగానే చర్యలు
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

ఖమ్మం : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఏసీబీ విచారణకు వెళ్లిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ విచారణకు అంత హంగామా అవసరమా?. ఏసీబీ విచారణలో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. విచారణ తర్వాత నివేదికల ప్రకారమే చర్యలు ఉంటాయని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'కాంగ్రెస్ ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవు. పేదోళ్ల సొమ్ము అక్రమ దారి పట్టింది.. అందుకే విచారణ జరుగుతోంది. కేటీఆర్ ఏదో జరగబోతున్నట్టుగా హల్‌చల్ చేస్తున్నారు. ఏసీబీ విచారణలో ప్రభుత్వ ప్రమేయం ఉండదు. విచారణ తర్వాత నివేదికల ప్రకారమే చర్యలు ఉంటాయి.

మిగతా 2లో

## ట్రంప్‌ను అంతమొందించే కుట్ర

ఆయనే ఇరాన్‌కు నంబర్‌వన్ శత్రువు. ట్రంప్ నిర్ణయాత్మక నాయకుడు. బలహీనమైన రీతిలో బేరసారాలు చేయడానికి ఆయన ఎప్పుడూ ఇష్టపడరు. ప్రత్యర్థికి లొంగిపోరు. గతంలో జరిగిన నకిలీ అణుఒప్పందాన్ని రద్దుచేసి.. ఖాసిమ్ సులేమానీని మట్టుబెట్టారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండకూడదని చాలా స్పష్టంగా చెప్పారు. అంటే వారు యురేనియంను శుద్ధి చేయకూడదు. ఈ నేపథ్యంలో ట్రంప్ కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ ప్రధాన శత్రువుగా మారారు. అందుకే ఆయనను చంపాలని చూస్తున్నదని చెప్పారు. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనే ఉద్దేశంతోనే ఇరాన్ అణు కార్యక్రమాలు చేపడుతున్నదని నెతన్యాహూ అన్నారు. తమ దాడులు ఇరాన్ అణు కార్యక్రమాన్ని చాలావరకు వెనక్కి నెట్టాయని చెప్పారు. ప్రపంచ దేశాలన్నింటికీ ఇరాన్ పెనుముప్పుగా మారుతున్నదని వెల్లడించారు. అందుకే, దాడులు చేయడం తప్ప తమకు మరో అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ముప్పును సమూలంగా తొలగించేంతవరకు తమ పోరాటం ఆగదని, ఇజ్రాయెల్ తనను తానే కాకుండా ప్రపంచాన్ని కూడా రక్షిస్తున్నదని చెప్పారు. కాగా, తమ దాడుల్లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ కజేమీ, ఆయన డిప్యూటీ జనరల్ హసన్ మహాకిక్ చనిపోయారని నెతన్యాహూ వెల్లడించారు. ఐఆర్‌జీసీ నిఘా విభాగానికి చెందిన మరో కీలక అధికారిని కూడా మట్టుబెట్టినట్లు తెలిపారు. ఐడీఎఫ్ వైమానిక దాడుల్లో ఇప్పటికే రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధిపతి కూడా మరణించిన విషయం తెలిసిందే.

## మోడీకి అత్యుత్తమ పురస్కారం

సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ చేతుల మీదుగా మోదీ ఈ పురస్కారం అందుకున్నారు. రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ తొలి అధ్యక్షుడు మకరియోస్ 3 పేరుతో ఈ అత్యున్నత పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. సైప్రస్ ప్రభుత్వ అవార్డు 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ప్రధాని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇరుదేశాల సంస్కృతి, సోదరభావం, వసుదైవ కుటుంబ భావనకు ప్రతీక అని చెప్పారు. రెండు దేశాల మధ్య క్రియాశీల భాగస్వామ్యం కొత్త శిఖరాలకు చేరుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని ఒకరు పర్యటించడం ఇదే ప్రథమం. అవార్డు ప్రదానానికి సంబంధించిన వీడియోను ప్రధాని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సైప్రస్ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇరుదేశాల మధ్య స్నేహానికి ఈ అవార్డును అంకితం చేస్తున్నామని చెప్పారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్న ప్రధానికి నికోస్ క్రిస్టోడౌలిడెస్ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. సైప్రస్ పర్యటన అనంతరం కెనడాకు మోదీ పయనమవుతారు. అక్కడ జరుగనున్న జీ-7 సదస్సులో పాల్గొంటారు. చివరిగా క్రొయేషియాలో అధికారిక పర్యటన జరుపుతారు.

## కాళేశ్వరంతో ఏమాత్రం ఉపయోగం లేదు

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి ఉపయోగం కన్నా నష్టం ఎక్కువగా కలిగించిందని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలంగాణలోని పాలక పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దీనిపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మేరకు నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ఫీజిబిలిటీ లేనిదిగా బీజేపీ గతంలోనే చెప్పిందని, ఇప్పుడు కూడా సీబీఐ విచారణ కోరుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సీబీఐ విచారణపై మొహం మార్చుకుందని వ్యాఖ్యానించారు. అలాగే బీసీ గణనపై మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం తర్వాత తొలిసారి బీసీ జనాభా సేకరణ జరుగుతోందని పేర్కొన్నారు. జనగణనలో వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంటుందని స్పష్టం చేశారు. మోదీ 11 ఏళ్ల పాలనపై బీజేపీ చేపట్టిన కార్యక్రమాలకు ప్రజలు విశేషంగా స్పందిస్తున్నారని తెలిపారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం సమయం తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే ఎన్నికలు ఆలస్యం అయ్యాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరగాలే కానీ తూతూ మంత్రంగా కాకూడదని హితవు పలికారు. అన్ని స్థానాల్లో బీజేపీ స్వతంత్రంగా పోటీ చేస్తుందని చెప్పారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై హైకోర్టులో బీజేపీ పిటిషన్ వేసిందని, అది పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం సీబీఐకి కేసు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తమ ఫోన్లను ట్యాప్ చేశారన్నది హైకోర్టుకు ఇచ్చిన ప్రభుత్వ నివేదికలో కూడా ఉందని వెల్లడించారు. అలాగే గోదావరి జలాల విషయంపై రాష్ట్రాల మధ్య సంప్రదింపులు జరిపి పరిష్కారం వెతుకుతామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రెండు ప్రభుత్వాలు కలిసి చర్చించుకోవాలన్నది ఆయన అభిప్రాయం. రెండు రాష్ట్రాల ప్రజలు 'మనవారే' అనే భావనతో కలిసి పనిచేయాలన్నారు. కేసీఆర్ గతంలో 'బేసిన్లు లేవు, భేషజాలు లేవు' అని అన్నారని, ఇప్పుడు మాత్రం ఆయనే మౌనంగా ఉన్నారని విమర్శించారు. మూడు టీఎంసీలు పోతున్నా, కేసీఆర్ తన ఫార్మ్‌హౌస్‌లో నిద్రిస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు ఆడుతున్నాయని, ప్రజలు ఈ రెండు పార్టీలను తిరస్కరించారని అన్నారు. ఇక కేసీఆర్ ప్రభుత్వం గతంలో మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేయలేదని, మౌలిక వసతుల లోపం కారణంగా కేంద్ర ప్రభుత్వం తిరస్కరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. కొత్త ప్రభుత్వంపైనా ఇదే పరిస్థితి కొనసాగుతోందని విమర్శించారు. ఇక తాజాగా రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆయన పార్టీ కార్యకర్త. పార్టీ కోసం త్యాగాలు చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. అయినా, ఆయన చెప్పిన మాటలపై పార్టీ లోపల చర్చిస్తామని చెప్పారు. చివరిగా హింస ద్వారా మార్పు రాదని, ఆయుధాలను వదిలి పెట్టి శాంతి మార్గాన్ని అనుసరించాలని మావోలను కోరారు. ప్రజాస్వామ్యంలో మార్పు హింసతో కాదు, చర్చతో సాధ్యమవుతుందని అన్నారు.

## స్థానిక ఎన్నికలపై త్వరలోనే స్పష్టత

నోటిఫికేషన్ గురించి ఇప్పటివరకు ఎవరూ అధికారికంగా ప్రకటన చేయలేదు. అలాగే తాను కూడా ఎటువంటి తప్పుడు ప్రకటన ఇవ్వలేదు.. నా మాటల్లో మార్పు లేదని స్పష్టతనిచ్చారు. ఈ అంశంపై పూర్తి అవగాహన వచ్చే అవకాశముందని మంత్రి తెలిపారు. ఎన్నికలపై పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగుతామని, అన్ని వర్గాలను ప్రతినిధ్యం కలిగించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఇది ఇలా ఉండగా.. మంత్రి సీతక్క మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. కేటీఆర్ జైలుకు పోవాలని కుతూహలంగా ఉన్నారు.. వీలైనంత త్వరగా జైలుకు పంపించాలని మా సీఎంను రెచ్చగొడుతున్నారు. కేటీఆర్, కవిత మధ్య పోటీ ఉంది.. కవిత జైలుకు పోయివచ్చి బీసీ ఎజెండా ఎత్తుకుంది.. నేను వెనకబడ్డా అని కేటీఆర్ కూడా జైలుకు వెళ్లే పథకం రచించాలని అనుకుంటున్నాడు. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నాడు. ఏదో ఆశించి కేటీఆర్ జైలుకు పోవాలను కుంటున్నాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. కేటీఆర్‌కు జైలుకు పోవాలని కుతూహలంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. వీలైనంత త్వరగా జైలుకు పంపించాలని సీఎం రేవంత్ రెడ్డిని రెచ్చగొడుతున్నారని అన్నారు. కేటీఆర్, కవిత మధ్య పోటీ ఉందని తెలిపారు. కవిత జైలుకు పోయివచ్చి బీసీ ఎజెండా ఎత్తుకున్నారని.. తాను వెనకబడ్డానని భావించి కేటీఆర్ కూడా జైలుకు పోయి పథకం రచించాలని అనుకుంటున్నారని సెటైర్ విసిరారు. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏదో ఆశించి కేటీఆర్ జైలుకు పోవాలని అనుకుంటున్నారన్నారు. తోడేళ్ళలా దోచుకుని... ఇప్పుడు వినయం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. 'కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నారు .. మా సీఎం పౌరుషంతో మాట్లాడుతున్నారు' అని అన్నారు. కేటీఆర్ వ్యవహారాన్ని దర్యాప్తు సంస్థలే చూసుకుంటాయని తెలిపారు. ఈరోజు ముఖ్యమంత్రి అధ్యక్షతన ఐసీసీసీలో జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో పంచాయతీ ఎన్నికలపై స్పష్టత వస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కాగా.. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు మాజీ మంత్రి కేటీఆర్. విచారణకు ముందు కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఇప్పటికి మూడు సార్లు విచారణకు పిలిచారని, ముప్పైసార్లు విచారణకు పిలిచినా హాజరవుతానన్నారు. తనను ఏసీబీ విచారణకు పిలిచి రాక్షసానందం పొందుతున్నారని, అవసరమైతే తనను అరెస్ట్ కూడా చేయొచ్చంటూ వ్యాఖ్యలు చేశారు. అయినప్పటికీ తనకు జైలు, కేసులు కొత్తేమీ కాదని తెలంగాణ ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లి వచ్చానంటూ మాజీ మంత్రి ట్వీట్ చేశారు. జైలు గురించి కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలపైనే మంత్రి సీతక్క సెటైరికల్ కామెంట్స్ చేశారు.

# స్కిల్ వర్సిటీ అభివృద్ధికి సహకరించండి

ఇక్కడ శిక్షణ తీసుకున్న యువతలో 80 శాతం మందికి ఉద్యోగాలు లభించాయి" అని వివరించారు. "మీలో ఎంతో ప్రతిభ ఉంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మీరు మారాలి. టెక్నాలజీ సాయంతో కొత్త నైపుణ్యాలను నేర్చుకునేందుకు ప్రయత్నించండి. ఓటమికి నిరుత్సాహం చెందకుండా ప్రయత్నం చేస్తూనే ఉండండి. తప్పకుండా మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు" అని యువతకు సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరిని ఆహ్వానించారు. నైపుణ్యాభివృద్ధికి కేంద్రంతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ అనిల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 9 రోజుల్లోనే అందరికీ రైతుభరోసా పూర్తి చేస్తాం

ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఎకరాలకు సీలింగ్ అంటూ ఏమీ లేదని.. ఎన్ని ఎకరాలు ఉంటే అన్ని ఎకరాలకు రైతు భరోసా డబ్బులు వేయనున్నట్లు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా రైతులందరికీ ఒకే విడుతలో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని చెప్పారు. మంత్రులంతా గ్రామాల బాట పట్టాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ బలంగా ఉన్న జిల్లాల్లో స్థానిక మంత్రులు, ఇన్ చార్జి మంత్రులు కోఆర్డినేట్ చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఈ నెల చివరి వరకు ప్రభుత్వ పథకాల పై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1600 రైతువేదికల్లో సీఎం కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ చేసిన విధ్వంసం వందేళ్లు కోలుకోలేనిదన్నారు వాళ్లు చేసిన తప్పులు సరి చేయడానికి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని చెప్పారు. రైతులను కాదనుకున్న వారు అధికారంలోకి రాలేరని చెప్పారు. రైతుల ఆశీర్వాదం ఉంటేనే పాలకుల కుర్చీలు పదిలంగా ఉంటాయన్నారు. సర్పంచ్ నుంచి సీఎం వరకు ఏ పదవి రావాలన్నా రైతులకు అండగా నిలవాల్సిందేనని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులే రాజులని అన్నారు. 18 నెలలుగా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వీధి నాటకాలు ఆడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. బీఆర్ఎస్ చేసిన విధ్వంసం వందేల్లు కోలుకోలేనిది. రైతు రుణమాఫీపై మాట నిలబెట్టుకున్నాం. గత పాలకులు వరి వేస్తే ఉరి అన్నారు. మేం వడ్లు పండించిన రైతులకు 500 బోనస్ ఇస్తున్నాం. రైతును రాజును చేయడమే కాదు..వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తున్నాం. మద్దతు ధరతో ధాన్యం కొంటున్నాం. సన్న వడ్లతో పేదల కడుపు నింపుతున్నాం. దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. సర్పంచ్ లకు గత ప్రభుత్వమే బకాయి పడింది. గత ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తున్నాం . రైతుల కోసం ఇప్పటి వరకు లక్ష కోట్లు ఖర్చు చేశామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రైతు భరోసా,రుణమాఫీ, రైతుల సమస్యలు,సన్నవడ్ల బోనస్ పై రైతులను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా సన్న బియ్యం,రైతు భరోసా,బోనస్ పై ఆనందం వ్యక్తం చేశారు. ఇవాళే రైతు భరోసా నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎకరాల వారీగా కాకుండా అర్హులైన వారందరికీ ఒకేసారి రైతుభరోసా ఇస్తామన్నారు. ' 1 కోటి 49 లక్షల 35 వేల ఎకరాలకు రైతు భరోసా నిధులు వేస్తాం. పరిమితి లేకుండా అర్హులైన ప్రతిరైతుకు రైతుభరోసా ఇస్తున్నాం. ఎన్నికరాలు ఉన్నా అన్ని భూములకు సాయం అందజేస్తాం. 9 రోజుల్లోనే అందరికీ రైతుభరోసా పూర్తి చేస్తాం' అని భట్టి తెలిపారు. కాంగ్రెస్‌కు వ్యవసాయానికి విడదీయరాని సంబంధం ఉందన్నారు. రైతుల కోసం కాంగ్రెస్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నాను. హైదరాబాద్ రాజేంద్రనగర్ లోని అగ్రి వర్సిటీలో రైతు నేస్తం ప్రారంభం సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే రుణమాఫీ,మద్దతు ధర, బోనస్,. కాంగ్రెస్ అంటేనే ఉచిత కరెంట్. కాంగ్రెస్ కు రైతులకు విడదీయరాని సంబంధం ఉంది. 1034 వేదికల్లో రైతు నేస్తం ప్రోగ్రాం. రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేశాం. అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీ చేశాం. రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నాం.

## రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలల్లో పూర్తి స్థాయి వసతులు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని.. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి. ఎంత మేర నిధులు కావాలి, తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు, ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి ఎన్ఎంసీ రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## కోర్టులో నలుగురు ఎమ్మెల్యేలు పిల్

### ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని వివరణ

### విచారణ వాయిదా వేసిన కోర్టు

హైదరాబాద్, జూన్16 : తెలంగాణ హైకోర్టులో నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి, మురళినాయక్‌లు పిల్ దాఖలు చేశారు. శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటూ ఎమ్మెల్యేలు పిల్ వేశారు. ఈ పిటీషన్‌పై సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఖాజాగూడలోని సర్వే నెం.119, 122లో ఉన్న 27.18 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని న్యాయవాది కోర్టుకు వివరించారు. సర్వే నెంబర్‌ని మార్చి పోరంబోకు భూమిని ఆక్రమించారని పిల్‌లో ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. 2023లో రంగారెడ్డి కలెక్టర్ నిరభ్యంతర పత్రం జారీ చేయడంతో జీహెచ్ఎంసీ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని న్యాయవాది తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలో 8 టవర్లలో ఒక్కో దాంట్లో 47 అంతస్థులు నిర్మిస్తున్నారని న్యాయవాది చెప్పారు. ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు ఉన్నాయని చిక్కుడు ప్రభాకర్ న్యాయస్థానానికి వివరించారు. ఓ ప్రైవేట్ పాఠశాలకు 150మీటర్ల పరిధిలోనే రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేశారని న్యాయవాది తెలిపారు. దీనివల్ల పర్యావరణం కాలుష్యమై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకునేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని ఎమ్మెల్యేలు కోరారు. ఈ భూమికి సంబంధించి సీఎస్, ప్రతివాదులకు మరోసారి వినతిపత్రం ఇవ్వాలని పిటీషనర్లను సీజే ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు హైకోర్టు వాయిదా వేసింది.

## ఇరాన్‌పై అణుదాడికి ఇజ్రాయెల్ కుట్ర


టెహ్రాన్ : ఇజ్రాయెల్-ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడులతో ప్రస్తుతం పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ జనరల్ మొహసిన్ రెజాయి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ తమపై అణుబాంబును ప్రయోగిస్తే.. పాకిస్థాన్ రంగంలోకి దిగి దానిపై న్యూక్లియర్ అటాక్ చేస్తుందని వ్యాఖ్యానించారు. రెజాయి వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ తాజాగా స్పందించింది. రెజాయి వ్యాఖ్యలను పాక్ కొట్టిపారేసింది. ఈ మేరకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పష్టతనిచ్చారు. అణు దాడికి సంబంధించి ఇరాన్‌కు ఎలాంటి హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ.. ఇజ్రాయెల్‌తో జరుగుతున్న విస్తృత వివాదంలో ఇరాన్‌కు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. 'ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌కు మా మద్దతు తెలిపాం. అణుదాడి మామీ ఇవ్వలేదు. అణు ఆయుధాలను కేవలం మా ప్రజలు, మా దేశ రక్షణ కోసం మాత్రమే ఉపయోగిస్తాం' అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ అప్రకటిత అణ్వాయుధాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విస్తృత ప్రాంతీయ సంఘర్షణను మరింత పెంచుతుందని వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రభుత్వం అధీనంలోని ఓ టెలివిజన్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రెజాయి మాట్లాడుతూ.. 'ఇజ్రాయెల్ మాపై అణుదాడి చేస్తే.. పాకిస్థాన్ ఇజ్రాయెల్‌పై అణుబాంబును ప్రయోగిస్తుంది. ఈ మేరకు పాకిస్థాన్ నుంచి మాకు హామీ ఉంది' అని మొహసిన్ వ్యాఖ్యానించారు. టర్కీ, సౌదీ అరేబియా, పాకిస్థాన్ తదితర దేశాలతో కలిసి ఇస్లామిక్ ఆర్మీని ఏర్పాటు చేయాలని మొహసిన్ ప్రతిపాదించారు. కానీ ఆయా దేశాలు ఇరాన్ యూనిఫామ్ వేసుకోవడానికి సిద్ధంగా లేవని వ్యాఖ్యానించారు. ఒక్క ఇస్లామిక్ దేశమైనా ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే రాత్రికి రాత్రే ప్రాంతీయ బలాబలాలు మారిపోతాయన్నారు. కాగా ప్రపంచంలో ప్రస్తుతం అణ్వాయుధాలున్న దేశాల జాబితాలో ఇజ్రాయెల్, పాకిస్థాన్ దేశాలు స్థానం దక్కించుకొన్నాయి. ఈ జాబితాలో ఇప్పటికే అమెరికా, రష్యా, ఫ్రాన్స్, భారత్, ఉత్తర కొరియా ఉన్నాయి.

## ఎన్ని కేసులు పెట్టిన భయపడేది లేదు

ఫార్ములా ఈ రేసులో ఆయన ఏసీబీ విచారణకు హాజరయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌కు వచ్చిన నేతలతో మాట్లాడారు. 'ఈ ఫార్ములా కార్ రేస్‌పై చర్చ పెట్టాలని అడిగితే రేవంత్‌రెడ్డి పారిపోయిండు. ఫార్ములా-ఈ రేస్‌పై నేనేదో తప్పు చేసిన.. కేసీఆర్ ప్రభుత్వం ఏదో తప్పు చేసిందని అంటున్నవ్ కదా.. దమ్ముంటే చర్చపెట్టు అసెంబ్లీలో పట్టుపడితే పారిపోయిండు. నాలుగు గోడల మధ్యల ఎందుకు.. నాలుగు కోట్ల మంది ముందు మాట్లాడుదామంటే పారిపోయిండు. పోనీ ఇట్ల కాదు బద్నాం క్యాంపెయిన్ ఎన్ని రోజులు నడుపుతవ్..? ఈ దేశంలో ఏ రాజకీయ నాయకుడు అడగని విధంగా నేను అంటున్నా.. నువ్వు ముందుకు రా నేను తప్పు చేయలేదు. నిజాయితీకి ధైర్యం ఎక్కువ కాబట్టి.. అవసరమైతే లై డిటెక్టర్ పరీక్ష చేయించుకుంటా.. నువ్వు కూడా రా అంటే పత్తా లేదు' మండిపడ్డారు. అయినా, మళ్లీ విచారణకు వెళ్లాను. న్యాయస్థానాలపై నమ్మకం ఉన్న వ్యక్తులుగా ఎన్నిసార్లు పిలిచినా వస్తా అని చెప్పినా. పొద్దున నుంచి తొమ్మిది గంటలు ఒకటే ప్రశ్న.. అటు తిప్పి.. ఇటు తిప్పి అడుగుడు. ఇక్కడి నుంచి ఎట్టి పరిస్థితుల్లో ఫార్ములా ఈ రేస్ పోవద్దని.. మొదటి సంవత్సరం విజయవంతంగా నిర్వహించిన తర్వాత.. రెండో సంవత్సరం కూడా ఇక్కడే ఉండాలని.. ప్రభుత్వపరంగా విధానపరమైన నిర్ణయం తీసుకున్నాం. తీసుకొని మరి కొంత డబ్బులు చెల్లించాం. ఒక్క రూపాయి కాదు పైసా అవినీతి జరుగలేదు. ఇక్కడి నుంచి పైసా పోయింది అక్కడ ఉన్నది. ఇందులో అవినీతి ఎక్కడ ఉందని ఏసీబీ అధికారులను అడిగితే సమాధానం లేదు. ఏందంటే.. ÷ల్ ఇటు పోయిందా.. ఇటుకేలి పోయిందా.. కుడిచేతిలో నుంచి ఇచ్చిన పైసలు.. ఎడమ చేతిలో నుంచి పైసలు ఇచ్చినవా.. అంటూ పనికి మాలిన ప్రశ్నలు తప్పా.. చిట్టినాయుడు రాసిచ్చిన ప్రశ్నలు తప్పా ఏం లేదు విషయం. మొన్న చెప్పినా ఇవాళ చెప్పిన.. ఇది లొట్టపీసు కేసు. ఈయన లొట్టపీసు ముఖ్యమంత్రి. వీళ్లతోని ఏది కాదు. పరిపాలన చేతకాదు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ధైర్యం లేదు. దద్దమ్మ రాజకీయంతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. మొన్న తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ కమిషన్ ముందుకు పిలిచారు. అంతకు ముందు హరీశ్‌రావును కమిషన్ ముందుకు పిలిచారని గుర్తు చేశారు కేటీఆర్. మిమ్మల్ని అందరినీ కోరేది ఒకటే.. ఇది డైలీ సీరియల్‌లా అయిపోయింది. ఒక రోజు పిలుచుడు. ఎట్లాంటే ఒక రోజు పిలుచుడు.. తొమ్మిది గంటలు కూర్చుండబెట్టి.. చాయి తాగిపించి.. ఏం చేస్తాం సర్.. మాకు పై నుంచి ఆదేశాలు ఉన్నయ్.. ఏం చేయాలంటూ అడిగిందే అడుగుతున్నరు' అన్నారు. మనమందరం పార్టీగా దృష్టి సారించాల్సింది రెండు పనులపై. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బరి గీసి, లైన్ గీసి.. ఒక్కో కాంగ్రెస్ నాయకుడిని ఫుట్‌బాల్ ఆడుదెట్లా? ఎట్లా కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడగొట్టాలనే దానిపై దృష్టి పెడుతాం. ఈ నెల 21న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి ఆరు సంవత్సరాలు కాబోతున్నది. 2019 జూన్ 21న కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసిన రోజు. ఆ రోజును సార్‌ని అడిగి పార్టీగా కాళేశ్వరం గొప్పదనం ప్రజలకు చెబుదాం అనే ఆలోచన చేయాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కొంత కార్యక్రమాలు చేయాల్సి ఉంది. మనకు నోటీసులు వచ్చుడు పోవుడు రోటీన్. పాత చింతకాయపచ్చడి. దీని గురించి పట్టించుకోవాల్సిన అవసరం.. ఆందోళన పడాల్సిన అవసరం లేదు. పెడితే 15 రోజులు జైలులో పెడుతడు. చేసేది ఏమీ లేదు. లొట్టపీస్ ముచ్చట. రేవంత్‌రెడ్డి భయపడేటోడు ఎవడూ లేడు రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకో.. నీలాగా లుచ్చా పనులు చేసి.. రూ.50లక్షల బ్యాగులతో దొరికిన దొంగలు ఎవరూ మా పార్టీలో ఎవరు లేరు. నీలాగా లుచ్చా పనులు చేసి.. అడ్డదారిలో పదవులు కొనుక్కొని ముఖ్యమంత్రి, పీసీసీ ప్రెసిడెంట్ అయ్యే లుచ్చా పనులు చేసినోడు ఎవడూ లేడు' అంటూ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యి ఉండి.. జై తెలంగాణ అనకపోతే నిన్ను ఏం పేరుతో పిలవాలి. ముఖ్యమంత్రిగా ఉండి.. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రతిరోజూ కించపరిస్తే నిన్న ఏమని పిలవాలే. తెలంగాణ రాష్ట్రాన్ని దివాళా తీసిన రాష్ట్రం అన్నవారిని ఏం అనాలి. తెలంగాణ సీఎంగా ఉండి.. ఢిల్లీకి పోతే అపాయింట్‌మెంట్ ఇస్తలేరు.. దొంగను చూసినట్లు చూస్తున్నరని అంటే ఏమని అనాలని అన్నారు. ఆయనకు ఒకటే షోకు. నేను నెల రోజులు జైలులో ఉన్న లుచ్చా పని చేసి.. వీళ్లను కూడా కొన్నిరోజులు జైలుపెట్టాలి అన్నదే ఆయనకున్న షోకు, పైశాచిక ఆనందం ఒక్కటే. శాడిస్టులు కొందరు ఉన్నట్లు.. నాకు దక్కనిది ఎవరికీ దక్కద్దు అన్నట్టు.. నాకు జరిగింది నీకు జరగాలి అన్నట్లుగా జైలులో పెట్టాలన్నదే షోకు. అందుకే ఇవాళ అధికారులకు నేను చెప్పిన.. మీకు పై నుంచి ఆదేశాలు రావొచ్చు ఇప్పటికే.. వస్తే పెడితే జైలులో పెట్టుకొమ్మని చెప్పాను. పదిహేను రోజులు రెస్ట్ తీసుకొని వస్తానని చెప్పాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నా.. తప్పు చేయలేదు.. తలదించుకునే పని ఎంతమాత్రం చేయలేదు. తెలంగాణ ప్రతిష్టను పెంచే పని చేశాం. తెలంగాణ ప్రతిష్టను ఆకాశం స్థాయికి తీసుకెళ్లాం తప్పా తప్పు చేయలేదు. అది కాళేశ్వరం ప్రాజెక్టు కావొచ్చు.. ఫార్ములా ఈ కావొచ్చు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం. చేయని తప్పుకు ఇవాళ కేసీఆర్, హరీశ్‌రావును పిలిచి ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మన కార్యకర్తల, నేతల ఆత్మస్థయిర్యం దెబ్బతీసే ప్రయత్నం కమిషన్ ముందు చేస్తున్నారు. ఇక్కడ ఏసీబీ అని పెట్టి.. ఎలాంటి అవినీతి జరగని కేసులో.. అవినీతి నిరోధకశాఖను ఇన్వాల్వ్ చేశారు. మా ఆర్ఎస్ ప్రవీణ్ అన్న చెప్పిండు.. నా చరిత్రలో ఇంత తుఫేల్ కేసు ఎప్పుడూ చూడలేదు.. 26 సంవత్సరాలు ఐపీఎస్ అధికారిగా పని చేసినా.. ఇలాంటి కేసు చూడలేదన్నారు' అన్నారని కేటీఆర్ తెలిపారు.

## విచారణకు వెళితే ఇంత హంగామానా?

కాళేశ్వరం, ఫార్ములా రేసుపై ఏసీబీ విచారణపై నివేదికల ఆధారంగానే చర్యలుంటాయి. దీనిపై బీఆర్ఎస్ నేతలకు అంత హంగామా అవసరమా అనని ప్రశ్నించారు. త్వరలోనే తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు ఉంటాయి. బీసీ రిజర్వేషన్‌లకు కట్టబడి ఉన్నాం. పెంచిన రిజర్వేషన్లను అమలు చేసి తీరుతాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు రాలేదని ఎవరూ బాధపడొద్దు. ఏడాదిన్నర కాలంలోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాం. విడతల వారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు ఇప్పించే బాధ్యత నాది' అంటూ వ్యాఖ్యలు చేశారు.



# వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే కెటిఆర్‌పై కేసులు

**కెటిఆర్ ఓ వ్యక్తి కాదు...ప్రజల పక్షాన శక్తి**

**18 నెలల్లో 14 కేసులు పెట్టిన ఘనత రేవంత్‌ది**

**కెటిఆర్‌పై కేసులపై మండిపడ్డ హరీష్ రావు**

**స్వల్ప అస్వస్థతో ఆసుపత్రిలో చేరిన హరీష్**



హైదరాబాద్,జూన్16 : రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి 18 నెలల పాలనలో కేటీఆర్‌పై 14 కేసులు పెట్టారని ఆరోపించారు. కేటీఆర్ ఏసీబీ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని.. మాట తప్పినందుకు రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టాలన్నారు. దేవుళ్లపై ఒట్టు పెట్టి మాట తప్పిన నిన్ను ఏం చేయాలి రేవంత్ రెడ్డి అని నిలదీశారు. కేటీఆర్ ఈ రాష్ట్ర గౌరవాన్ని పెంచే విధంగా.. భారతదేశంలో అనేక రాష్ట్రాలు ఈ ఫార్ములా రేసింగ్ కోసం పోటీపడుతుంటే తన శక్తియుక్తులను ఉపయోగించి హైదరాబాద్‌కు ఫార్ములా-ఈ రేసును తీసుకువచ్చారన్నారు. రేవంత్ రెడ్డి మాత్రం ఏ రాష్ట్రం కూడా అందాల పోటీలు నిర్వహించమని తేల్చిచెబితే.. తెలంగాణలో నిర్వహించి ఈ దేశ పరువు, రాష్ట్ర పరువు తీశాడని విమర్శించారు. అందరూ కావాలన్న ఈ కార్ రేసింగ్‌ను తెచ్చి రాష్ట్ర గౌరవం పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమని.. ఎవరూ ముందుకు రాని అందాల పోటీలు నిర్వహించి పరువు తీసింది రేవంత్ రెడ్డి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలి కాబట్టి కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పాలనలో తుమ్మినా, దగ్గినా కేసులు పెడుతున్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కమిషన్లను ఎత్తిచూపితే కేసులు, లఘుచర్ల రైతులకు బేడీలేస్తే కేసులు, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు పెట్టినా కేటీఆర్ ఒక వ్యక్తి కాదు శక్తి అని.. లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అండ ఉన్న కేటీఆర్‌ని ముట్టుకుంటే భస్మం అయిపోతారు తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. ఇదిలావుంటే మాజీ మంత్రి హరీష్ రావు అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్యం కారణంగా బేగంపేట సన్ షైన్ కిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైరల్ ఫీవర్ వలన ఆయన ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. కేటీఆర్ ఏసీబీ విచారణ నేపథ్యంలో హరీష్ ఉదయం నుంచి సాయంత్రం వరకు తెలంగాణ భవన్‌లోనే ఉన్నారు. అక్కడే అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# దేశంలో 15 ఏళ్ల తర్వాత జన గణనకు

**నోటిఫికేషన్ విడుదల చేసిన హోంశాఖ**

న్యూఢిల్లీ,జూన్16 : దేశంలో 15 ఏళ్ల తర్వాత చేపట్టబోయే జన గణనకు సంబంధించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జనాభా లెక్కింపు పక్రియ సోమవారం నుంచి అధికారికంగా ప్రారంభమైనట్లయ్యింది. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరిసారి 2011లో దీన్ని చేపట్టారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ పక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఈ క్రమంలోనే జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని దేశవ్యాప్తంగా డిమాండ్ పెరగడం, కొన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి చేయడంతో కుల గణనకూ కేంద్రం సిద్ధమైంది. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కి పైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మొత్తంగా రెండుదశల్లో జనాభాను లెక్కించనున్నారు. 2027 మార్చి 1వ తేదీ నాటికి జనగణన పూర్తి కానుంది. మంచు ఎక్కువగా ఉండే 'కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌తో సహా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నాం. ఇవి కాకుండా దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటి లో 2027 మార్చి 1 నాటికి జనాభా లెక్కను పూర్తి చేయనున్నాం' అని హోంమంత్రిత్వ శాఖ ఆ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ఇది మొత్తంగా 16వ, స్వాతంత్య్రానంతరం చేపట్టబోయే 8వ జన గణన. ఈసారి జన గణనతోపాటు కుల గణననూ చేపడుతున్నారు. ఇందుకోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదుచేసే వెసులుబాటునూ కల్పిస్తున్నారు. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు తెలిపింది.

# జూలైలో పక్కాగా స్థానిక ఎన్నికలు?

**మంత్రుల సమావేశం కీలక నిర్ణయం**

**ఎన్నికలను జరిపే విషయంలో మల్లగుల్లాలు**

హైదరాబాద్,జూన్16 : ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు ఒక అడుగు ముందుకు పడింది. సోమవారం నిర్వహించిన మంత్రుల సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. జులైలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలా..? లేదా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్ పెట్టి తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలా..? అన్నదానిపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇవాళ కీలక అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా రైతుభరోసా, స్థానిక సంస్థల ఎన్నికలపైనే డిస్కషన్ జరిగింది. ఇవాల్టి సమావేశంలో స్థానిక ఎన్నికలపై కీలక నిర్ణయం వెలువడనుందని అంతా భావించారు. అనుకున్నట్టుగానే నిర్ణయం వెలువడినా ఏ ఎన్నికలు ముందుగా నిర్వహిస్తారనేది కేబినెట్ సమావేశంలోనే తేల్చే అవకాశం ఉంది. ఎన్నికల సన్నద్ధతను సీఈవో కు తెలియజేస్తే రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేస్తుంది. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. ఎంపీటీసీలను, జెడ్పీటీసీలను ఓటర్లు ఎన్నుకుంటారు. ఎన్నికైన ఎంపీటీసీలు మండల పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అలాగే జెడ్పీటీసీలు జిల్లా పరిషత్ ఛైర్మన్ ను ఎన్నుకుంటారు. పంచాయతీ ఎన్నికల విషయానికి వస్తే.. ఓటర్లు వార్డు సభ్యులకు, సర్పంచ్ కు నేరుగా ఓటు వేస్తారు. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. ఇండిపెండెంట్ గుర్తులపైనే ఎన్నికలు జరుగుతాయి. వార్డు సభ్యులు ఉపసర్పంచ్ ను ఎన్నుకుంటారు. దీంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కనుంది.

# బండిపై ఎన్నికల కేసు కొట్టివేత

హైదరాబాద్,జూన్16 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు హైకోర్టులో ఊరట కలిగింది. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం కొట్టివేసింది. 2021 నవంబర్ 15న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ర్యాలీ నిర్వహించారు. అనుమతి లేకుండా భారీ వాహనాలతో కాన్వాయ్ నిర్వహించారని ఎన్నికల అధికారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హైకోర్టు కొట్టివేసింది.

# అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం

**రమేశ్ బయటపడ్డ ఘటనపై తాజాగా మరో వీడియో**

**విమాన ప్రమాదం నుంచి లేచి నడచుకుంటూ వస్తున్న దృశ్యం**

న్యూఢిల్లీ,జూన్16 : ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదం ఘటనలో మరో కొత్త వీడియో బయటకొచ్చింది. జూన్ 12న జరిగిన ఈ విమాన ప్రమాదంలో బతికి బయటపడ్డ ఏకైక వ్యక్తి విశ్వాస్ కుమార్ రమేష్ క్రాష్ సైట్ నుంచి బయటకు నడుస్తున్నట్లు మరో కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. మెడికల్ కాలేజీ హాస్టల్ ఆవరణ నుంచి బయటకు వెళుతుండగా అతని వెనుక ఉన్న క్రాష్ సైట్ నుంచి దట్టమైన పొగలు ఎగిసిపడుతున్నాయి. రమేష్ వైట్ టీ షర్టులో నడుస్తూ ఎడమ చేతిలో ఫోన్ పట్టుకుని ఉన్నట్లు ఈ వీడియోలో కనిపిస్తోంది. అతడి వెనకాల అగ్ని పర్వతంలా మండుతోన్న విమాన ప్రమాద దృశ్యాలు కనిపిస్తున్నాయి. దట్టమైన నల్లటి పొగ కమ్ముకోవడంతో పాటు చాలా మంది గందరగోళంతో పరుగెడుతూ కనిపిస్తున్నారు. ఇంతకు ముందు విమాన ప్రమాదం జరిగిన 33 సెకన్లకే ఓ వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ వీడియోలో రమేష్ గాయాలతో రక్తం కారుతూ నడుస్తూ కనిపించాడు. జూన్ 12న అహ్మదాబాద్ సర్దార్ వల్లభభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలోని మేఘాని ప్రాంతంలో చెట్టును ఢీకొని ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన సంగతి తెలిసిందే. 230 మంది ప్రయాణికులు, ఇద్దరు పైలెట్లు, 10 సిబ్బంది మొత్తం 242 మందితో గురువారం మధ్యాహ్నం ఎయిర్ ఇండియా బోయింగ్ విమానం అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరింది. ఎయిర్ పోర్టు నుంచి టేకాఫ్ అయిన ఐదు నిమిషాల్లోనే విమానాశ్రయం సమీపంలోని చెట్టును ఢీకొని జనవాసాల్లో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 241 మంది చనిపోయారు. పైలెట్లు, విమాన సిబ్బంది, ప్రయాణికులు అంతా సజీవ దహనమయ్యారు. అయితే మెడికల్ కాజేసీ హాస్టల్ పై పడటంతో మరింత మంది మృతి చెందారు. లండన్‌కు బయలుదేరిన కొద్దిసేపటికే విమానం కూలిపోవడంతో 242 మందిలో 241 మంది మరణించారు. విమానంలోని 11ఎ సీటులో కూర్చున్న రమేష్ ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడు. అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం నుంచి అనూహ్య రీతిలో ప్రాణాలతో బయటపడ్డారు విశ్వాస్‌కుమార్ రమేశ్. ప్రమాదం అనంతరం ఆయన నడచుకుంటూ అంబులెన్స్ ఎక్కిన దృశ్యాలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయనకు సంబంధించి మరో వీడియో బయటికొచ్చింది. అందులో ఆయన ప్రమాద స్థలం నుంచి నడుచుకుంటూ వస్తోన్న దృశ్యాలు ఉన్నాయి. విమానం నివాస సముదాయాల మధ్య బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనంపై కూలగానే స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు ప్రమాదం గురించి పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో తెలుపు రంగు టీషర్ట్ ధరించిన ఓ వ్యక్తి చేతిలో మొబైల్ ఫోన్ పట్టుకుని ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి రోడ్డుపైకి రావడం గమనించారు. ఆయనను చూసి తొలుత వారు షాక్ అయ్యారు. ఆ తర్వాత శరీరంపై గాయాలు చూసి వెంటనే అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం ఆ వ్యక్తి.. ప్రమాదానికి గురైన విమానంలోని ప్రయాణికుడు విశ్వాస్ కుమార్ రమేశ్ అని తెలిసింది. ఘటనాస్థలం నుంచి ఆయన బయటకు వస్తుండగా వెనుక విమానం కాలిపోయిన దృశ్యాలు ఈ వీడియోలో కన్పించగా.. ప్రమాదం కారణంగా అక్కడ భారీ ఎత్తున పొగ అలుముకుంది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్‌కుమార్..గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన ఎయిరిండియా విమానంలోని 11-ఏ సీటులో ఆయన కూర్చున్నారు. విమానం కూలగానే తన సీటు విరిగి కింద పడిపోయిందని.. అందుకే విమానంలో చెలరేగిన మంటలు తనకు అంటుకోలేదని ఇటీవల తెలిపారు. కళ్లు తెరిచి చూసేసరికి హాస్టల్ భవనం శిథిలాల్లో ఉన్నట్టు.. శిథిలాల నుంచి మెల్లగా నడుచు కుంటూ బయటకు వచ్చానని అన్నారు. విశ్వాస్ ఒక్కరే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. ఇక, విమానం భవనంపై కూలడంతో అందులోని 33 మంది మృతిచెందిన సంగతి తెలిసిందే.

# బిజపి కార్యాలయం ముందు ధర్నా చేయండి

**నిధుల కోసం కిషన్ రెడ్డిని నిలదీయండి**

**బిజెపి కార్పోరేటర్ల ధర్నాపై మంత్రి పొన్నం విమర్శలు**




హైదరాబాద్,జూన్16 : బిజెపి కార్పోరేటర్లు సమస్య పరిస్కారం కోసం వెళ్లి బిజెపి కార్యాలయం వద్ద ధర్నా చేయాలని హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నిర్వహించిన ధర్నాపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. నిధులను కూడా కిషన్ రెడ్డి వద్ద నిలదీయాలని అన్నారు. జీహెచ్ఎంసీ అభివృద్ధిపై బీజేపీ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. ఈ విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ధర్నా చేయాల్సింది జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు కాదు.. హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని మండిపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తెచ్చేందుకు ప్రయత్నించకుండా బీజేపీ నాయకులు రాజకీయ స్టంట్లు వేయడం సరికాదని విమర్శించారు. నగర అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వం మారిందని, దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వైఫల్యమే కారణమని తెలిపారు. జీహెచ్ఎంసీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఈ విధమైన రాజకీయాలు చేయడం కన్నా, కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తే మేము కూడా వస్తాం అని మంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి అందరం కలిసి నిధులు తీసుకురావాలన్న మంత్రి, ఈ విషయాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు. నగర అభివృద్ధి మా బాధ్యత. రాజకీయాలు దానికి అడ్డుకావద్దు అని హెచ్చరించారు. మొత్తంగా కేంద్రం నుండి నిధులు తీసుకురావడానికి బీజేపీ నాయకులు తమ సొంత నేత కిషన్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

# కన్నడనాట వరుస ఎటిఎంల చోరీ

**ఎటిఎంలు పగులగొట్టి నగదు దోపిడీ**

బెంగళూరు,జూన్16 : కర్ణాటక రాష్ట్రంలో వరుసగా ఏటీఎమ్ సెంటర్లలో చోరీలు జరుగుతున్నాయి. దొంగలు ఏటీఎమ్‌లను బద్ధలు కొట్టి డబ్బులు దోచుకెళ్లిపోతున్నారు. ఎస్‌బీఐ ఏటీఎమ్‌లను టార్గెట్ చేసి మరీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా, కోలార్‌లోని ఓ ఎస్‌బీఐ సెంటర్‌లో దొంగతనం జరిగింది. దొంగలు ఏటీఎమ్‌ను బద్దలు కొట్టి డబ్బులు దోచుకెళ్లిపోయారు. దొంగతనం జరిగిన సమయంలో ఏటీఎమ్‌లో 27 లక్షల రూపాయలు ఉన్నట్లు తెలుస్తోంది. గాల్పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేపట్టారు. నెల రోజుల క్రితం కలబురిగిలోని రామనగర్ ఎస్‌బీఐ సెంటర్‌లో దొంగతనం జరిగింది. దొంగలు పక్కాప÷-లాన్‌తో ఏటీఎమ్‌లోని డబ్బుల్ని దోచుకెళ్లిపోయారు. ఏటీఎమ్‌లో డబ్బులు నింపిన మరుసటి రోజు రాత్రి చోరీకి పాల్పడ్డారు. దొంగలు మొదటగా సీసీటీవీ కెమెరాలను పని చేయకుండా చేశారు. తర్వాత గ్యాస్ కట్టర్‌కు పని చెప్పారు. ఏటీఎమ్‌ను గ్యాస్ కట్టర్ సాయంతో కోసి అందులోని డబ్బుల్ని దోచేశారు. దొంగతనం జరిగిన సమయంలో ఏటీఎమ్‌లో 18 లక్షల రూపాయలు ఉన్నాయి. గత కొన్ని నెలల నుంచి జరుగుతున్న ఏటీఎమ్ సెంటర్ల లూటీని పరిశీలిస్తే.. దొంగలు సెక్యూరిటీ లేని ఏటీఎమ్ సెంటర్లను టా÷-గ్గ÷ట్ చేస్తున్నారు. అర్ధరాత్రి తర్వాత వచ్చి దొంగతనాలు చేస్తున్నారు.

# జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద హైటెన్షన్

**సమస్యలపై అధికారులను నిలదీసేందుకు వచ్చిన బీజేపీ నేతలు**

హైదరాబాద్, జూన్16 : నగరంలోని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బల్దియా కార్యాలయం ముందు బీజేపి ఆందోళనకు దిగింది. నగర సమస్యలపై అధికారులను నిలదీసేందుకు కమలం నేతలు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ ఆఫీస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. వీధిదీపాలు, రోడ్ల సమస్యతో పాటు డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలంటూ బీజేపీ నిరసనకు దిగింది. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. కమిషనర్ ఛాంబర్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్పొరేటర్లు, బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, బీజేపీ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం చెలరేగింది. రామ్‌నగర్ కార్పోరేటర్లు గోడలు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు , బీజేపీ నేతలకు మధ్య తోపులాట జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసేందుకు వచ్చిన బీజేపీ కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జీహెచ్ఎంసీ ఆఫీస్ గేట్ ముందు కూర్చుని బీజేపీ నేతలు ఆందోళన చేస్తున్నారు. హైదరాబాద్‌లో వీధి దీపాలు, రోడ్లు సరిగా లేకపోవడం, నాలాల పూడిక తీయకపోవడం వంటి అనేక సమస్యలు నగర వాసులను వెంటాడుతున్నాయని, తక్షణమే ఆ సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున బీజేపీ నేతలు జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను చెప్పేందుకు వస్తే గేట్లు మూసేసి రాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తున్నారు. విశ్వనగరంగా చెబుతున్న హైదరాబాద్ ఇప్పుడు వీధి దీపాలు లేక అంధకారంలో ఉందన్నారు. వీధిదీపాలు లేని కారణంగా గల్లీల్లో, కాలనీల్లో గంజాయికి అడ్డాలుగా మారాయని తెలిపారు. యువత పక్కదారి పడుతోందని, మద్యం సేవించి మహిళలను ఇబ్బందిపెట్టే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లోనే ఇలా ఉంటే తెలంగాణ వ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉందో అంటూ ఆ పార్టీ నేతలు నిలదీశారు. తప్పకుండా బల్దియా కమిషనర్‌ను కలుస్తామని.. తమను లోపలికి పంపించకపోతే కమిషనర్ బయటకు వచ్చే వరకు ఇక్కడే ఉండి ఆందోళన చేస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.

# కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కైవసం

ఎన్టీఆర్ జిల్లా, జూన్16 : ఎన్టీఆర్ జిల్లాలో మరో మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. ఛైర్మన్‌గా టీడీపీకి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్మన్‌గా చుట్టుకుదురు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే వైస్ ఛైర్‌పర్సన్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థి కరిమికొండ శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. అయితే కొండపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఫలితంపై తీవ్ర ఉత్కంఠం నెలకొంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దగ్గరుండి మరీ అక్కడి పరిస్థితులను పర్యవేక్షించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీల్డ్ కవర్లో తీర్పు ఫలితం అధికారుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో భారీ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్‌ను తెరిచి.. ఫలితాలను ప్రకటించారు అధికారులు. కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను టీడీపీ దక్కించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరికాసేపట్లో కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్‌గా చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్ పర్సన్‌లుగా కరిమికొండ శ్రీలక్ష్మి, చుట్టుకుదురు శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే ఒక ఇండిపెండెంట్ గెలుపొందారు. ఈ క్రమంలో ఇండిపెండెంట్ అభ్యర్థి టీడీపీకి మద్దతు ఇవ్వడం తెలుగుదేశం పార్టీ సీట్లు 15కు చేరాయి. దీంతో కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ సొంతమైంది. మరోవైపు 14 మంది వైసీపీ కౌన్సిలర్లకు గాను కేవలం 8 మంది సభ్యులు మాత్రమే హాజరవగా.. మిగిలిన వారు గైర్హాజరయ్యారు.

# కాళేశ్వరం అవినీతి జగమెరిగిన సత్యం

**మెదక్ ఎంపి రఘునందన్ రావు**

సిద్దిపేట,జూన్16 : తప్పుచేసిన వారు ఎవరైనా ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా కేసులు ఎదుర్కోవాల్సిందే.. శిక్ష అనుభవించాల్సిందేనని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీహెచ్ఆర్ నగర్‌లో హాస్టల్ ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడారు. విచారణ నిజాయితీగా జరగాలని కోరారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందనేది అందరూ చెబుతున్న మాట అని చెప్పారు ఎంపీ రఘునందన్‌రావు. కాళేశ్వరం అవినీతికి గత ముఖ్యమంత్రి కేసీఆర్, గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులు, అధికారులు బాధ్యత వహించాలని, విచారణ త్వరగా పూర్తి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. 18 నెలలుగా కాళేశ్వరం విచారణ కమిషన్ సమయాన్ని రేవంత్ ప్రభుత్వం రెండేసి నెలలుగా పెంచుకుంటూ పోవడంతో ప్రజల్లో కక్ష సాధింపు చర్యలనే అనుమానం కలుగుతోందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు తెలంగాణలో ఎదుగుతున్న బీజేపీని కనపడనీయకుండా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఎంపీ రఘునందన్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవితలది ఇంటి సమస్య, పైసల పంచాయితీ, రాజకీయ వారసత్వ పంచాయితీ అని ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. కవిత ఏం మాట్లాడుతుందో ఆమెకే తెల్వదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు తాము అధిక ప్రాధాన్యం ఇస్తామని.. పోటీ చేసే వారిని తప్పకుండా గెలిపించుకుంటామని ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి వర్గంలో నూటికి 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు పోవాలని కోరారు. బీసీల పక్షాన బరాబర్ బీజేపీ ప్రశ్నిస్తోందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కొట్లాడుతామని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఇరాన్ యుద్ధంతో చమురు ధరలపై ప్రభావం

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య మొదలైన యుద్ధం తీవ్ర రూపం దాలుస్తుండటంతో చమురు ధరలకు రెక్కలొచ్చాయి. ఇక ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకు కూడా వ్యాపిస్తే మాత్రం ప్రపంచ ఇంధనానికి జీవనాడి లాంటి హర్మూజ్ జలసంధి మూతపడే ప్రమాదం ఉంది. కేవలం కొన్ని కిలోమీటర్ల వెడల్పున్న ఈ ప్రదేశం నుంచి ప్రపంచం వాడే చమురులో ఐదో వంతు రవాణా అవుతుందంటే దాని ప్రాముఖ్యత అర్థం చేసుకోవచ్చు. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఇరు దేశాలు ఇందులో అత్యధిక భాగం తమదే అని చెబుతున్నాయి. దీనిలో రెండు షిప్పింగ్ లేన్లు ఉన్నాయి.ఇందులో వెరీలార్జ్ క్రూడ్ క్యారియర్లు సులువుగా ప్రయాణించగలుగుతాయి. దీనిలో ఒమన్ తీరం నుంచి నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోకి ప్రవేశిస్తాయి. చమురును నింపుకొని ఇరాన్ సమీపం నుంచి హర్మూజ్‌ను దాటి బయటకు వస్తాయి. పశ్చిమాసియాలో ఈ యుద్ధం వల్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య సంక్షోభం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగు తున్నాయి. ఈ ప్రభావం భారత చమురు మార్కెట్‌తో పాటు గ్యాస్ కంపెనీలపై ఆర్థికంగా ఒత్తిడి పడే అవకాశం ఉన్నది. ఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్‌కు 73 డాలర్ల నుంచి 74 డాలర్ల వరకు ఉన్నది. అయినప్పటికీ.. చమురు మార్కెట్ కంపెనీల ఆదాయంపై ప్రభావితమవుతున్నది. అదే సమయంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నది. అప్‌స్ట్రీమ్ కంపెనీలు చమురు, గ్యాస్ పరిశ్రమ ప్రారంభ భాగంలో పని చేస్తుంటాయి. భూమి నుంచి చమురు, గ్యాస్‌ను వెలికితీసే పక్రియ. ఇది గ్యాస్ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. ఎల్ఎన్‌జీ ముడి చమురుకు సంబంధించింది. ముడి చమురు ధర పెరిగితే.. ఎల్ఎన్‌జీ ధర సైతం పెరుగు తుంది. చమురు ధరల్లో ఈ పెరుగుదల ఇప్పటికీ 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పెరుగుదల కంటే తక్కువగా ఉందని పేర్కొంది. ప్రస్తుత పెరుగుదల గత నాలుగు సంవత్సరాల సగటు కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రస్తుతం, బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 75 డాలర్లుగా ఉన్నది. ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి విశ్లేషకుల అంచనా 68 డాలర్ల కంటే కంటే దాదాపు 6–7 డాలర్లు ఎక్కువ. అయినప్పటికీ, ముడి చమురు ధరలు 2022–25 సగటు కంటే 9డాలర్లు తక్కువగా.. 25 ఆర్థిక సంవత్సరం సగటు కంటే 4డాలర్లు తక్కువగా ఉన్నది. డిమాండ్ లేకపోవడం మార్కెట్‌ను ఆధిపత్యం చేస్తుంది. అయితే, ఇంధన కంపెనీ స్టాక్స్ హెచ్చుతగ్గులను చూస్తున్నాయి. ఇది ప్రపంచ అనిశ్చితుల మధ్య మార్కెట్ ఆందోళనలను ప్రతిబింబిస్తున్నది. దీని వెనుక కారణం హోర్ముజ్ జలసంధిలో తీవ్రమవుతున్న సంక్షోభం కారణం. హోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటి. ఎందుకంటే ఇది పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలుపుతుంది. ప్రపంచంలోని చమురు రవాణాలో ఎక్కువ భాగం ఈ మార్గం గుండా వెళుతుంది. భారతదేశం చమురు దిగుమతుల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ, ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో సగానికిపైగా హోర్ముజ్ జలసంధి గుండా వెళతాయి. ఈ మార్గంలో ఏదైనా ఆటంకాలు ఎదురైతే.. భారత్ ఇతర వనరులు, మార్గాల కోసం వెతకాల్సిన అవసరం ఏర్పడుతుంది. భారత్ అవసరాలకు వాడే చమురులో 40 శాతం ఈ మార్గం నుంచే రవాణా అవుతోంది. ఇరాక్, సౌదీ, యూఏఈ, కువైట్, ఖతార్ నుంచి మనం దిగుమతి చేసుకొంటున్నాం. మన దేశం వినియోగించే ఇంధనంలో 90 శాతం వివిధ మార్కెట్ల నుంచి దిగుమతి చేసుకొంటున్నాం. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధి మూసుకుపోతే.. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవడంతోపాటు.. రవాణా, బీమా ఖర్చులు గణనీయంగా పెరుగుతాయి. దీంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎల్ఎన్‌జీ ధరలకు రెక్కలు రావడం ఖాయం. దీంతో భారత ప్రభుత్వ రంగంలోని చమురు సంస్థల ఆర్థిక పరిస్థితి మళ్లీ దారుణంగా మారుతుంది. ఈ నేపథ్యంలో జూన్ 13న కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి మాట్లాడుతూ దేశీయ అవసరాలకు సరిపడా చమురు సరఫరా అవుతుందని భరోసా ఇచ్చారు. ఇప్పటికే వివిధ దేశాలతో మనకు ఉన్న చమురు ఒప్పందాలకు తోడు.. మనకు ఉన్న వ్యూహాత్మక నిల్వలు 74 రోజులకు సరిపోతాయి. ఇరాన్ ఎన్నడూ హర్మూజ్ జలసంధిని మూయలేదు. వాస్తవానికి టెహ్రాన్ ఉత్పత్తి చేసే చమురులో 80శాతం చైనా కొనుగోలు చేస్తుంది. ఈ నేపథ్యంలో హర్మూజ్‌ను మూస్తే.. దాని ఆర్థిక వ్యవస్థ మరింత దిగజారుతుంది. గతంలో ఇరాన్–ఇరాక్ యుద్ధం సమయంలో కూడా ఈ జలసంధి తెరిచే ఉంది. 1973లో ఈజిప్ట్–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమదేశాలపై నాడు సౌదీ అరేబియా, దాని మద్దతుదారులు చమురు వ్యాపారం నిలిపేశారు. కాకపోతే ఇప్పుడు అలాంటి నిర్ణయాలు పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. కొంతకాలం కిందట వరకు అమెరికా అత్యధికంగా ఇంధనం దిగుమతి చేసుకొనేది.. ఇప్పుడు అది కూడా భారీ ఎత్తున చమురును ఎగుమతి చేస్తోంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. ఇది మొత్తం ప్రపంచం వినియోగించే దానిలో ఐదో వంతుకు సమానం. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. దీనిలో అత్యధికం ఖతార్ ఎగుమతి చేస్తుంది. ఈ జలసంధిలో ఏర్పడే ఏ అంతరాయమైనా ప్రపంచ వాణిజ్యాన్ని గజగజలాడిస్తుంది. దీన్ని గుర్తించిన అమెరికా బహ్రెయిన్‌లో తన ఫిఫ్త్ ఫ్లీట్ స్థావరాన్ని ఏర్పాటు చేసుకొంది. ఇక ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీ అత్యధికంగా భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్ దేశాలకు ఎగుమతి అవుతోంది. 1980–88 వరకు జరిగిన ఇరాన్–ఇరాక్ యుద్ధం ప్రభావం జలసంధిపై పడింది. నాడు ఇరు దేశాలు పరస్పర ఎగుమతులను దెబ్బతీసేందుకు.. ట్యాంకర్లపై దాడులు చేసుకొన్నాయి. దీనిని ట్యాంకర్ వార్ అని కూడా అంటారు. ఆ సమయంలో వివిధ దేశాల పతాకాలపై ప్రయాణించిన దాదాపు 450కు పైగా నౌకలపై ఇరు దేశాలు దాడులు చేశాయి. తాజా యుద్ధం వల్ల ఈ జలసంధి మూసేస్తే పరిస్థితి దారుణంగా ఉండనుంది. ప్రధానంగా భారత్‌పై తీవ్ర ప్రభావం పడనుంది.

# ఖొమేనీ హత్యకు యత్నాలు



### బంకర్‌కు తరలించిన ఇరాన్ అధికారులు

టెహ్రాన్ : ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మరింత ముదురుతున్నది. క్షిపణులు, డ్రోన్లతో ఇరు దేశాలు దాడులు ప్రతిదాడులకు పాల్పడుతున్నాయి. ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. దీంతో టెహ్రాన్ సైన్యానికి చెందిన అత్యున్నత అధికారుల తోపాటు పదుల సంఖ్యలో అణు శాస్త్రవేత్తలు మృతిచెందారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని కూడా లక్ష్యంగా చేసుకొని ఐడీఎఫ్ దళాలు దాడులు చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత వారు ఈశాన్య టెహ్రాన్‌లోని అండర్‌గ్రౌండ్ బంకర్‌లో తలదాచుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. ఇక ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ కూడా అదేరీతిలో ప్రతిస్పదిస్తున్నది. ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తున్నది. ఈ బాలిస్టిక్ క్షిపణుల దాడిని ఇజ్రాయెల్ గొప్పగా చెప్పుకునే ఐరన్ డోమ్ కూడా అడ్డుకోలేకపోయింది. శత్రుదుర్భేధ్య రక్షణ వ్యవస్థగా చెప్పుకునే దానిని ఇరాన్ క్షిపణులు చీల్చుకుంటూ వెళ్లి ఇజ్రాయెల్ భూభాగంలో పడుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలైన టెల్ అవీవ్, జెరూసలెంలో భారీ నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఇరాన్ క్షిపణి దాడులతో జెరూసలెంలో సరైన్ మోతలు వినిపించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అదేవిధంగా జెరూసలెం, టెల్ అవీవ్ మీదుగా క్షిపణులు దూసుకొచ్చాయని వెల్లడించింది. వాటిలో కొన్ని క్షిపణులను మధ్యలోనే తాము కూల్చివేశామని పేర్కొంది. సౌత్‌వెస్ట్ రీజియన్‌లో ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యాక్టివేట్ చేశామని ప్రకటించింది. అయితే హైఫా పట్టణంలో భారీగా మంటలు ఎగసిపడటం కనిపించిందని అంతర్జాతీయ మీడియా ఆర్టీ ఇంర్నేషనల్ వెల్లడించింది. ఈ దాడుల్లో నలుగురు గాయపడ్డారని తెలిపింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నట్టు మీడియా కథనాలు వెలువరించాయి. తమ తదుపరి లక్ష్యంగా ఆయన మారవచ్చునని ఒక సీనియర్ అధికారి వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు తెలిపారు. ఇరాన్ స్వచ్ఛందంగా తన అణు కార్యక్రమాన్ని తొలగించుకునే వరకు లేదా దానిని ఇరాన్ పునర్‌నిర్మించుకోవడం అసాధ్యంగా మారినప్పుడు మాత్రమే ఈ సంక్షోభానికి తెర పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హత్య చేయాలనే ఇజ్రాయెల్ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వీటో చేశారని ఇద్దరు అమెరికా అధికారులు తెలిపారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును ప్రశ్నించగా తాను దానిలోకి వెళ్లబోవడం లేదని తెలిపారు. ఇరాన్‌పై దాడుల గురించి అమెరికాకు ముందస్తు సమాచారం అందజేసినట్టు ఆయన తెలిపారు.

## ఇరాన్ దాడుల్లో ధ్వంసమైన యూఎస్ ఎంబసీ

### టెలిఅవివ్ యూస్ కార్యాలయం మూసివేత

టెల్ అవివ్,జూన్16 : ఇరాన్ ఆదివారంనాడు జరిపిన క్షిపణి దాడుల్లో టెల్ అవివ్ లోని అమెరికా రాయబార కార్యాలయం భవంతి దెబ్బతినడంతో తాత్కాలికంగా మూసివేశారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారి మైక్ మకబి సోమవారంనాడు ధ్రువీకరించారు. ఈ దాడిలో యూఎస్ దౌత్య సిబ్బంది మృతి చెందడం కానీ, గాయపడటం కానీ జరగలేదు. అయితే, పేలుడు ధాటికి యూఎస్ ఎంబసీ భవంతి దెబ్బతినట్టు సోషల్ వీడియోలో పోస్ట్ చేసిన వీడియోల్లో కనిపిస్తోంది. ఎంబసీ బ్రాంచ్ సమీపంలో ఇరాన్ క్షిపణి దాడితో స్వల్పమైన డ్యామేజ్ జరిగిందని, సిబ్బందికి అసౌకర్యం కలుగకుండా సోమవారంనాడు కార్యాలయానికి మూసివేశామని మకబి తెలిపారు. కాగా, భవంతి సమీపంలో క్షిపణి దాడితో యూఎస్ కార్యాలయ భవంతి విండో గ్లాసులు దెబ్బతిన్నాయి. ఎమ్జర్గ÷న్సీ ప్రోటాకాల్‌కు అనుగుణంగా ఎంబసీ సిబ్బందిని సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు కోరారు.

## రిపోర్టర్లను బెదిరించిన ఝాన్సీరెడ్డి

### మేం పిలిస్తే తప్ప రావొద్దని హెచ్చరిక..

మహబూబాబాద్ జూన్16 : ఎన్నికల సమయంలో కాంగెస్ర్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రజలు అధికార పార్టీ నేతలను ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. అయితే దీనిపై కవర్ చేసేందుకు వెళ్లిన రిపోర్టులు కవర్ చేస్తుండగా, సదరు నాయకులు మాత్రం ఇదంతా ఎందుకు కవర్ చేస్తున్నారనంటూ ఫైర్ అవుతున్నారు. ఈకమ్రంలోనే మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అత్తగారు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి రెచ్చిపోయారు. రిపోర్టర్లకు ఆమె స్వయంగా కాల్స్ చేసి.. ” మా పార్టీ మీటింగ్‌లకు మీరు రావద్దు.. మా పార్టీ కార్యక్రమాలకు మేం పిలిచినప్పుడు మాత్రమే రావాలి. లేకపోతే మా కార్యకర్తలతో కొట్టిస్తాం. పోలీసులతో అరెస్టు చేయిస్తాం” అంటూ హెచ్చరించారు. ఇటీవల పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. వారిని మొహం పట్టుకుని హామీలు ఎప్పుడు అమలు చేస్తారని నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు తిరగబడుతున్న దృశ్యాన్ని కవర్ చేస్తున్న నేపథ్యంలో రిపోర్టలకు కాల్స్ చేసి బెదిరింపులకు దిగారు. దీనిపై మీడియా వర్గాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధుల అధికారిక కార్యక్రమాలను కవర్ చేసేందుకు రిపోర్టర్లకు పూర్తి హక్కు ఉంటుందని.. అలాంటి సమయంలో ప్రెస్ ప్రతినిధులను బెదిరించడమేంటని ప్రశ్నిస్తున్నాయి.

## పబ్‌లపై ఎస్‌వోటీ పోలీసుల దాడులు



### ఇద్దరికి గంజాయి పాజిటివ్

హైదరాబాద్, జూన్16 : తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. తాజాగా కోకాపేట్‌లోని పబ్‌లో అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు ఎస్వోటీ పోలీసులు. డ్రగ్స్, గంజాయి వాడుతున్నట్లు సమాచారంతో ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా పబ్‌లలో దాడులు నిర్వహించారు. కోకాపేటలోని రాబిట్ హోల్, మై క్యాప్స్, గండిపేటలోని టస్కా పబ్‌లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమానితులకు డ్రగ్స్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో నార్సింగ్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల గచ్చిబౌలిలోని పలు పబ్బులపై కూడా ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఎల్ఎన్ టెర్మినల్ మాల్‌లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. క్లబ్ రోగ్, ఫ్రాట్ హౌస్ పబ్‌లో దాడులు జరిపిన ఎస్‌వోటీ పోలీసులు.. డ్రగ్స్ టెస్టులు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం నలుగురికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. గంజాయి పాజిటివ్ వచ్చిన వారిలో ఫ్రాట్ హౌస్ పబ్ డీజే ప్లేయర్ శివ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మాదాపూర్, కొండాపూర్‌లో పలు పబ్‌లపై జరిపిన దాడుల్లోనూ డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా.. ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని తేలింది. మాదాపూర్ అఖాన్ పబ్‌లో ఒకరికి, కొండాపూర్ ఏ19 పబ్‌లో మరొకరికి గంజాయ్ పాజిటివ్ అని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక.. తెలంగాణను డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తోంది. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ యువత మాత్రం డ్రగ్స్ బారి నుంచి బయటకురాని పరిస్థితి. డ్రగ్స్ ఊబిలో చిక్కుకుని విలువైన జీవితాన్ని, భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తోంది యువత. మరోవైపు విద్యార్థులు, యువతే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా ఈ దందాను నిర్వహిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు కూడా డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడుతున్న సందర్భాలు ఎన్నో. సెలబ్రెటీలను కూడా వదలకుండా పోలీసులు పట్టుకుంటున్నారు. అంతేకాకుండా రెస్టారెంట్లు, పబ్‌లు, హోటల్స్‌లలో తరచూ దాడులు చేస్తూ డ్రగ్స్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట డ్రగ్స్, గంజాయి సరఫరా కొనసాగుతూనే ఉంది.


## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ఫలితాలు వచ్చేసాయ్..

హైదరాబాద్, జూన్16 : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను అధికారులు సోమవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ఫస్టియర్ 67.4శాతం, సెకండియర్‌లో 50.82శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఫస్టియర్‌లో బాలికలు 73.88శాతం, బాలురు 61.75శాతం మంది పాసయ్యారు. ఇక సెకండియర్‌లో బాలికలు 54.47శాతం, బాలురు 48.54శాతం మంది పాసయ్యారు. మే 22 నుంచి 29 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలను నిర్వహించగా, 4,13,880 మంది మంది పరీక్షలు రాశారు. ఈ సారి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణత పెరిగింది. ఫస్టియర్, సెకండియర్ రెండింటిలోనూ ఉత్తీర్ణత శాతం పెరగడం గమనార్హం. ఈ సారి ఫస్టియర్లో 67.4శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. 2024లో 63.86శాతం, 2023లో 62.58శాతం విద్యార్థులు పాసయ్యారు. సెకండియర్‌లో ఈ సారి 50.82 శాతం పాసైతే.. 2024లో 43.77 శాతం, 2023లో 46.06 శాతం పాసయ్యారు. కోర్సుల వారిగా ఉత్తీర్ణత వివరాలను పరిశీలిస్తే ఎంపీసీలోనే అత్యధికులు పాసయ్యారు.

## బంధన కారణాలను గుర్తించాలి..

### త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
### కామఃక్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్!

‘అర్జునా! కామక్రోధ లోభాలనే మూడు నరకానికి ద్వారాలు. అవి ఆత్మనాశన హేతువులు. అంటే మానవుని అధోగతి పాలుచేసేవి. కాబట్టి ఆ మూడింటిని త్యజించాలి’ అంటున్నాడు కృష్ణపరమాత్మ. మానవులకు కామం (కోరికలు) సహజం. అవసరాలు పరిమితాలు, కోరికలు అపరిమితాలు. కోరికలు తీరకపోతే క్రోధం, దానినుంచి లోభం, లోభం నుంచి మోహం, మోహం నుంచి మదం, దాన్నుంచి మాత్సర్యం వెలుగుచూస్తాయి. వీటిని ఆసురీ ప్రవృత్తులుగా చెబుతారు. నిరంతర వేదనామయ జీవితానికి ఇవి మూలకారకాలు. కాబట్టి వీటిని నరక ద్వారాలని అంటారు. భాగవతంలో గజేంద్రమోక్షణ గాథ ఉన్నది. గజరాజు తన భార్యలతో ఒక సరోవరంలో జలక్రీడలు ఆడుతుండగా మొసలి దానిని పట్టుకుంటుంది. తన భౌతిక శక్తిసామర్థ్యాలతో మొసలిని జయించలేని గజరాజు విష్ణువును ప్రార్థించగా.. విష్ణువు మొసలిని సంహరించి గజరాజును రక్షిస్తాడు. గజరాజు అనేది మనసును ఆవరించిన కోరికలకు ప్రతీక. అపరిమితమైన కోరికలు ఒకదాని వెంట మరొకటి చెలరేగగా వాటిని సంతృప్తి పరచలేక/ జయించలేక, నిస్సహాయత, కోపంలాంటి నకారాత్మక భావనలు అశాంతికి గురిచేయగా.. ఆ సమస్య పరిష్కారానికై తీవ్రంగా ప్రయత్నించాడు. తీవ్రమైన కోరికల ఉధృతివల్ల ‘మొసలి’ అనే బంధనాలలో చిక్కాడు. కోరికల వలయంలో చిక్కిన తాను వాటిని జయించలేనన్న సత్యాన్ని అవగతం చేసుకున్న గజరాజు, సంఘర్షణ పరిష్కారాన్ని చూపదనే ‘యెఱుకను’ పొంది మరొకరి సహాయానికై ప్రార్థించాడు. సంఘర్షణ పరిష్కారాన్నివ్వదు. విశ్వాసంతో కూడిన సంస్కారం, శక్తిసామర్థ్యాల సంపూర్ణ వినియోగం మాత్రమే సమస్యలను పరిష్కరిస్తుంది. విశ్వాసం విష్ణువుకు ప్రతీక.



ఆధ్యాత్మికం

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

◆ నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేశాం ◆ అదనంగా 1000 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం
◆ అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం ◆ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు





**పెద్దపల్లి ప్రతినిధి :** పేద ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూస్తామని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని పెద్దపల్లి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని అదనంగా మరో 1000 ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. సోమవారం పెద్దపల్లి మండలంలోని నిట్టూర్, తుర్కలమద్దికుంట గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఆనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేసి ఇండ్లకు ముగ్గు పోసి ఇంటి నిర్మాణాల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పార్టీలకు, రాజకీయాలకతీతంగా పేదల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణ రావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల 500 కోట్లతో మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసిందని, రాబోయే 3 సంవత్సరాలలో మొత్తం 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిరు పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేశామని, రాబోయే 3 సంవత్సరాలలో మరో మూడు విడతలుగా ఇండ్లు ఇస్తామని అన్నారు. కక్ష్య సాధింపు చర్యలకు తమ ప్రభుత్వం దూరంగా ఉంటుందని గత ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లు మార్చకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను రూ 6 కోట్లకు పైగా ఖర్చు పెట్టి వసతులు కల్పించి అందించామని అన్నారు. రైతన్నలకు 21 వేలకోట్ల రుణమాఫీ ఏకకాలంలో చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సన్న వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ అందిస్తుందని, గతం కంటే ఎక్కువగా పెట్టుబడి సహాయం రైతు భరోసా క్రింద రూ. 12000 ఎకరానికి అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకు గ్యాస్ సిలిండర్, సన్న రకం బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నికల ముందు హడావుడిగా పూర్తికాని ఇండ్లకు, కరెంట్ స్ట్రీట్ లైట్ రోడ్లు, త్రాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌళిక సదుపాయాలు లేకుండానే లబ్ధిదారులను ఎంపిక చేశారని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులు కల్పించి 466 ఇండ్లు పంపిణీ చేశామని అన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాకు రూ. 38 కోట్లు సన్న వడ్లకు బోనస్ ఇస్తే, కేవలం పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు రూ. 31 కోట్లు బోనస్ చెల్లించామని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తున్నామని అన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం తుర్కమద్దికుంట గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విజయ రమణారావు స్కూల్ పిల్లలకు దుస్తువులు అందజేసి పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పాఠశాల యాజమాన్యం తదితరులు ఎమ్మెల్యే ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యాల నరేష్, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యాశాఖ అధికారుల తనిఖీలు లేకనే ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాల అమ్మకాలు

**- పాఠశాల ఆవరణలోనే దర్జాగా పుస్తకాల అమ్మకం - పుస్తకాలు అమ్ముతున్న శ్రీ చైతన్య హై స్కూల్ గ్లోబల్ ఎడ్జ్ క్యాంపస్ పైన చర్యలు తీసుకోవాలి - డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్**

**గోదావరి ఖని టౌన్ :** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణ కేంద్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలు కొత్త దందాకు తెరలేపాయి. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులను చాలా రకాలుగా దోచుకుంటున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇప్పుడు సొంత ముద్రతో పుస్తకాల అమ్మకం పేరిట అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నాయి. కొన్ని కార్పొరేట్ పాఠశాలలు ఏకంగా పుస్తకాల దుకాణాలు తెరుస్తుంటే కొన్ని ప్రైవేటు పాఠశాలలు బుక్ స్టోర్లు, క్లాత్ స్టోర్లను కేంద్రంగా చేసి కమిషన్లు దండుకుంటున్నాయి విద్యార్థుల తల్లిదండ్రులకు యాజమాన్యం చెప్పిన షాపుల్లోనే పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫామ్ లు, ఇతర సామాగ్రిని వారు కొనుగోలు చేయాలని షరతులు పెడుతున్నారు ఇలా ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలి గోదావరిఖని పట్టణంలో సంజయ్ గాంధీనగర్ లోని శ్రీ చైతన్య హై స్కూల్ గ్లోబల్ ఎడ్జ్ క్యాంపస్ ప్రైవేట్ పాఠశాల, తమ పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నది. అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య అని ప్రకటనలు చేస్తూనే పాఠ్యపుస్తకాల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేయడం తల్లిదండ్రులందరూ ఇతర పాఠశాలలకు ఈ పాఠశాలలకు తేడా ఏముంది అనే విమర్శలు లేకపోలేదు ఇంత దర్జాగా గోదావరిఖని పట్టణ కేంద్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలు అమ్ముతుంటే రామగుండం ఎంఈఓ మాత్రం స్పందించడం లేదు గతంలో ఇదే బిల్డింగ్ లో గ్లోబల్ ఎడ్జ్ స్కూల్ పేరుతో ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేదని చెప్పిన ఎంఈఓ ప్రస్తుతం ఇదే బిల్డింగ్‌లో నూతనంగా ప్రారంభించి కొనసాగుతున్న శ్రీ చైతన్య హై స్కూల్ కు మాత్రం గత పది సంవత్సరాల ముందు నుండే ప్రభుత్వం నుండి అన్ని రకాల అనుమతులు ఉన్నాయని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది. శ్రీ చైతన్య హై స్కూల్ ఆవరణలో పుస్తకాలు అమ్ముతున్నారు. కాబట్టి వెంటనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు అమ్ముతున్న శ్రీ చైతన్య హై స్కూల్ పైన తక్షణమే చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోకుంటే ఉన్నత






స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని డివైఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి అట్లా శివకుమార్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు

# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న కారు

**ముత్తారం.జూన్.16.:** ముత్తారం మండలంలోని మచ్చుపేటలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోతారం గ్రామానికి చెందిన కట్ల పవన్ తన ద్విచక్ర వాహనంపై బగుళ్ల గుట్ట వైపు నుండి ఇంటికి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు చింతచెట్టు మూలమలుపు వద్ద ఢీ కొట్టింది. దీంతో పవన్‌కు తల, చాతి భాగాలలో తీవ్రంగా గాయాలయ్యాయి. గాయాలైన పవను వెంటనే ఆసుపత్రికి తరలించారు.



# ఆత్మీయ సన్మానం

**మంథని, : జూన్ 16:** జిల్లా జర్నలిస్ట్ సంఘం టీయూడబ్ల్యూ జే (ఐ జే యూ ) ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమితులైన మెట్రో దిన పత్రిక జర్నలిస్ట్ మల్యాల రమేష్ గౌడ్‌కు రాష్ట్ర గౌడ్ సంఘం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ పాల్గొని శాలువ కప్పి సత్కారం చేశారు. ఈ కార్యక్రమం లోసీనియర్ జర్నలిస్ట్ లు పీవీ రావు, బుర్ర తిరుపతి గౌడ్, జిల్లా జర్నలిస్ట్ యూనియన్ ఉపాధ్యక్షుడు పొన్నం శ్రీనివాస్ గౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శి జ్యోతుల ప్రవీణ్, ఈ సీ మెంబర్ చింతం కిరణ్ సభ్యులు చిందం రమేష్, గుర్రాల రవి. మంతిని రఘు. కాపర్తి వెంకటేష్, పోలు మధుకర్, సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# "యోగా ఆసనాలు" సంపూర్ణ ఆరోగ్యానికి సంకేతాలు

**- సింగరేణి ఏరియా జీఎం వెంకటయ్య**



**యైటింక్లయిన్ కాలని. :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, సోమవారం సింగరేణి రామగుండం రెండవ ఏరియా యాజమాన్యం సోమవారం యోగా సాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం ఏరియా జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, ఉద్యోగులతో కలిసి యోగా సాధన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జూన్ 16 నుండి 20 2025 వరకు అన్నీ గనులు, డిపార్ట్మెంట్లలో యోగా సాధన, బూట్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా ఆసనాలు సంపూర్ణ ఆరోగ్యానికి సంకేతాలన్నారు. ప్రతీ ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగా ఆసనాలకు వెచ్చించాలని సూచించారు. యోగా ఆసనాలు వేయడంవల్ల శారీరక, మానసిక, ఆరోగ్యంతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమములో ఏఐటియుసి ఏరియా కార్యదర్శి జి. జిగురు రవీందర్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు, ఎస్ఓ టు జిఎం ఏం.రాముడు, డిజిఎం ఐఇ మురళీకృష్ణ, డిజిఎం పర్సనెల్ అధికార ప్రతినిధి పి.అరవింద్ రావ్, డీజీఎం ఫైనాన్స్ వెంకట రామచంద్ర, ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బందోపాధ్యాయ, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, డిప్యూటి పర్సనల్ మేనేజర్ వేణుగోపాల్, స్థానిక ఉద్యోగులు పాల్గొన్నారు.

## వికెపి గనిలో పని స్థలాలను పరిశీలించిన సేఫ్టీ జీఎం



**యైటింక్లయిన్ కాలని. :** సింగరేణి రామగుండం రెండవ ఏరియా వకిల్ పల్లి గని ని, సోమవారం రామగుండం రీజియన్ సేఫ్టీ జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదన్ సందర్శించారు. ఉదయం గనికి వచ్చిన ఆయన ముందుగా సర్వే ప్లాన్ ద్వారా గనిలో నడుస్తున్న కంటిన్యూస్ మైనర్, ఎల్.హెచ్.డి (లోడ్ హోల్ డంపర్లు) లు నడిచే పని స్థలాలను, పరిస్థితులను, గనిలో జరుగుతున్న ఉత్పత్తి ప్రమాణాలను గూర్చి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం ఆయన గని అధికారులతో కలిసి, గని లోనికి దిగి కంటిన్యూస్ మైనర్, ఎల్.హెచ్.డి ల పని స్థలాలను పరిశీలించి, ఉద్యోగులు పనులు చేస్తున్నప్పుడు ఎస్ఓపి, ఎస్ఎంపి రక్షణ సూత్రాలు పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇక ఆయన వెంట గని ఏజెంట్ ఎ.నెహ్రూ, ఏరియా రక్షణ అధికారి ఎస్.సంతోష్ కుమార్, గని మేనేజర్ రవికిరణ్, సేఫ్టీ అధికారి రామ్ కుమార్, సర్వే అధికారి రహమత్ అలీ ఉన్నారు.

# ఓడేడులో డిపిఓ సందర్శన





**ముత్తారం.జూన్.16.:** ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామాన్ని డిపిఓ వీర బుచ్చయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా నర్సరీ, స్మశాన వాటిక, పారిశుధ్ధ్య పనులను, గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం డిపిఓ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు శానిటైజేషన్ చేపించాలని, మురుగు నీరు నిలవకుండా చూసుకోవాలని కార్యదర్శి రాజేందర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓగోవర్ధన్,కార్యదర్శిరాజేందర్,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టిజన్స్ హైదరాబాద్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

**- పెద్దపల్లి జిల్లా జేఏసీ కో చైర్మన్ విశ్వనాథ్**



**పెద్దపల్లి ప్రతినిధి :** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సమస్య సాధన కొరకు ఈనెల 18న జరుగనున్న చలో హైదరాబాద్ బహిరంగ సభకు పెద్దపల్లి జిల్లాలోని ఆర్టిజన్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని టివిఎసి జెఎసి పెద్దపల్లి జిల్లా కో చైర్మన్ దుర్గం విశ్వనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలు బట్టి కన్వర్షన్ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం, యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్ల ఆర్టిజన్ కార్మికులు కుటుంబసభ్యులతో కలిసి బహిరంగ సభనిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు సంస్థలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టిజన్ కార్మికులు కుటుంబాలతో తరలిరావాలని కోరారు.

# ఎఫ్‌టీఎల్ పై ఎమ్మెల్యే మాట నిలబెట్టుకునేనా ?





**లక్షెట్టిపేట, జూన్ 16, :** మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నవంబర్ లో స్థానిక ఐబీ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో " చెరువు చెరువులాగే ఉండాలి, రోడ్డు రోడ్డు లాగే ఉండాలన్నారు. అంతేకాకుండా చెరువు ఆక్రమణలో తన స్వంత పార్టీ వారు ఉంటే కూడా సహించేది లేదని చెప్పుకొచ్చారు కానీ ఇంతవరకు ఎమ్మెల్యే ఇటిక్యాల చెరువు కబ్జాలపై నోరు విప్పకపోవడం ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఇటిక్యాల చెరువు ఎఫ్ టీ ఎల్ విషయంలో కొందరి ద్వారా డబ్బులు ముట్టాయని ప్రెస్ మీట్ లో వెల్లడించడం గమనార్హం". కొందరు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల భూ కబ్జాల నిర్వాకంతో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు చెరువు విషయంలో సంకట పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం. ముఖ్యంగా అసెంబ్లీ ఎలక్షన్స్ కు ముందు, ఎమ్మెల్యే గా గెలిచిన తర్వాత చేరిన కొందరు నాయకుల వలన ఎమ్మెల్యే చెరువు పరిరక్షణ విషయంలో సంధిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు పేర్లు బయటకు చెప్పని ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. ఎఫ్ టీ ఎల్, బఫర్ పరిధిలోని భూములకు ఇరిగేషన్, మున్సిపల్ శాఖ ల నుంచి ఎన్ ఓ సీ లు ఎలా వచ్చాయో, వాటిని అధికారులు బహిర్గతం చేయడానికి ఎందుకు భయపడుతున్నారో ఆ వాస్తవాలు వెల్లడించాలని మత్స్యకారులు, చెరువు పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. "మేం నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నాం, ఎటువంటి తప్పిదాలకు తావివ్వం, చెరువును కంటికి రెప్పలా కాపాడుతాం, లంచం అనే మాటలు మాకు తెలియవు" అని ప్రగాల్భాలు పలికే ఇరిగేషన్ శాఖ అధికారులకు ఇటిక్యాల చెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరపడుతున్న కూడా కనిపించడం లేదనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు కట్టుబడి ఉంటే అధికారులు మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రలోభాలకు అమ్ముడుపోతున్నారని మత్స్యకారులు, చెరువు పరిరక్షణ సమితి సభ్యులు మండిపడుతున్నారు. ఎన్నో ఆందోళనలు, వివాదాల మధ్య ఇటీవల చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ హద్దులు నిర్ధారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సీరియస్ గా ఇరిగేషన్ అధికారులను ఆదేశించినప్పటికీ "మాకేం పని, మేం చేసేది మేం చేస్తాం" అంటూ ఇరిగేషన్ శాఖ మామూళ్ళ మత్తులో జోగుతోందని, చెరువును పరిరక్షించకుండా ఏండ్లకు ఏండ్లు పలు సాకులు చెప్తూ కబ్జా దారులకు అండగా నిలుస్తోందని అర్థమవుతోంది. గత సెప్టెంబర్ లో ఎఫ్ టీ ఎల్ పరిధిలోని పట్టాదారులకు నోటీసులివ్వాలని స్వయంగా ఇరిగేషన్ డీ ఈ కుమార్ లక్షెట్టిపేట తహసీల్దార్ దిలీప్ కుమార్ కు లెటర్ రాయడం ఇందులో మాకు సరైన అధికారులు లేవు ఆక్రమణ ఉంటే తొలగించండి మేం సహకరిస్తాం అని రెవెన్యూ శాఖపై నెట్టేయడం ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం ధోరణిని స్పష్టం చేస్తోంది. హద్దులు పెట్టడం మా పని, మ్యాప్ వేసి ఆక్రమణలు తొలగించడం మీ పని అంటూ తప్పించుకోవడంపై జిల్లా కలెక్టర్ సీరియస్ అయినట్టు విశ్వసనీయ సమాచారం

**ఇటుక బట్టీల పేరుతో రియల్ ఎస్టేట్‌కు అండ**

గత నెలలో నామమాత్రపు సీనరేజ్ టాక్స్ చెల్లించి మంచిర్యాలలోని ఇటుక బట్టీలకు చెరువు నల్లమట్టిని తరలించాలని అనుమతి తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఎక్కువ లోతులో మట్టిని తవ్వి కొంతభాగాన్ని మంచిర్యాలకు తరలించారు. ఇక్కడే అసలు కథ ప్రారంభం అయ్యింది. ఇటుక బట్టీలకు తరలించాల్సిన నల్ల మట్టిని తడి పేరుతో ఇదే చెరువులో నిల్వ ఉంచి నెల రోజులు పూర్తయినప్పటికి నేటికీ ఆ మట్టిని తొలగించలేదు.మట్టి తవ్వకాలు, చెరువులో నిల్వ ఉంచడంపై అప్పట్లోనే ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, కలెక్టర్ లను సీ పీ ఐ ఏం ఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు దొండ ప్రభాకర్, మత్స్య కారులతో కలిసి ప్రశ్నించగా, మట్టి తడి ఆరిన తర్వాత తొలగిస్తారని ఎమ్మెల్యే, కలెక్టర్ లు సముదాయించారు కానీ పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు మట్టి నిల్వలు అలాగే ఉండటం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇరిగేషన్ శాఖ వంత పాడుతోందని చెరువు పరిరక్షణ సమితి సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల పలు ఫిర్యాదులు కలెక్టర్ దృష్టికి వెళ్లగా, స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో కొంత మట్టిని అక్కడి నుంచి పాక్షికంగా తొలగించారు. మట్టి నిల్వలను తొలిగించాల్సిన ఇరిగేషన్ శాఖకు బదులుగా రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్ దిలీప్ కుమార్ విధులు నిర్వర్తించడం ఇక్కడ గమనార్హం.

**ఉన్నత అధికారుల పాపమేనా?** నల్ల మట్టి తరలింపులో నిర్లక్ష్యం, కాలువలు కబ్జా అవుతున్నప్పటికీ ఇరిగేషన్ ఏ ఈ ప్రణీత్ పట్టించుకోవడం లేదని చెరువు పరిరక్షణ సమితి కన్వీనర్ సప్ప రవి మండిపడ్డారు. బెల్లంపల్లి నుంచి ఇంచార్జ్ ఏ ఈ ఈ గా ఇటిక్యాల చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ లను నిర్ధారించాల్సిన ప్రణీత్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తుండటంతో చెరువు ఆక్రమణ పాపం ఏ ఈ ప్రణీత్ దే నని, అదేవిధంగా డీ ఈ కుమార్ కూడా తప్పుడు నివేదికలు ఇస్తున్నట్లు వీటిపై లోకాయుక్త కోర్ట్ కు వెళ్తున్నట్లు మత్స్యకారులు పేర్కొన్నారు. ఇటిక్యాల చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ ల నిర్ధారణ విషయంలో ఇప్పటికే డీ ఈ కుమార్ రాసిన సర్వే నంబర్స్ లెటర్ ను ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ ఈ ) వ్యతిరేకించడం, నిబంధనలకు ఆ లెటర్ విరుద్ధమని మీడియా కు తెలపడం గమనార్హం. రెవెన్యూ సర్వేయర్ సర్వే చేయకుండానే పలు పట్టాదారుల నంబర్స్ ను ఎలా ఇరిగేషన్ శాఖ అధికారులు ఆ లెటర్ లో పేర్కొన్నారో డీ ఈ కుమార్, ఏ ఈ ప్రణీత్ లకే తెలియాలన్నారు.ఇదిలా ఉండగా, అసలు రహస్యం ఇక్కడే బయట పడింది. ఇప్పటికే ఇటిక్యాల చెరువు ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్ ల హద్దులను అప్పటి ఏ ఈ గౌతమ్, డీ ఈ సత్యనారాయణ లు నిర్ధారించినప్పటికీ వాటిని పేపర్ వర్క్ మాత్రం చేయకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అడ్డుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. దాంతో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య అవగాహనా నేటి చెరువు కబ్జాకు ఆజ్యం పోసినట్టు అయ్యింది. గతంలో జరిగిన విషయాలు తెలియకుండా ఇటీవల ప్రస్తుత ఇరిగేషన్ డీ ఈ కుమార్ గతంలో నిర్ధారించిన ఎఫ్ టీ ఎల్ పరిధిలోకి వచ్చిన పట్టాదారులకు నోటీసులివ్వాలని, ఆక్రమణలు ఉంటే తొలగించాలని ప్రస్తుత తహసీల్దార్ దిలీప్ కుమార్ లెటర్ రాయడంతో ఇది వరకే హద్దులు నిర్ధారించినట్లు రహస్యం బయట పడింది.

**గతంలోని సర్వే నంబర్స్ ఎఫ్ టీ ఎల్ లో ఇప్పుడు లేవంటున్న ఇరిగేషన్!**

గతంలో ఎఫ్ టీ ఎల్ నిర్ధారణలో వచ్చిన పలు సర్వే నంబర్స్ నేడు ఎఫ్ టీ ఎల్ పరిధిలోకి రాకుండా హద్దులను మార్చే ప్రయత్నం ఇరిగేషన్ అధికారులు చేస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.చెరువు ఆక్రమణపై ఇటీవల మీడియా పెద్ద ఎత్తున దృష్టి సారించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖలను ప్రభావితం చేస్తున్నట్లు సమాచారం. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీ ఆర్ ఎస్, బీజేపీ లకు చెందిన పలువురి భూములు ఎఫ్ టీ ఎల్ లో పరిధిలో ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. అన్నీ పార్టీల నాయకులు ఈ చెరువులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పెట్టుబడులు పెట్టడంతో ఏ పార్టీ వారు కూడా ఈ చెరువు ఆక్రమణలపై నోరుమెదపడం లేదు. చెరువు కబ్జా పై పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలు అసలే చేయడం లేదు.ఏదైనా అంశం దొరికితే వెంటనే రాజకీయ లబ్ధి కోసం గొంతు చించుకునే నాయకులు ఈ విషయంలో మిన్నకుండి పోవడం చెరువు కబ్జాలో వారి రాజనీతినికి అద్దం పడుతోంది. రాజకీయ నాయకులు స్వయంగా మత్స్యకారులు, రైతుల గొంతు నొక్కుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

**ఎన్ ఓ సీల కోసమేనా సర్వే నంబర్స్‌ను తొలగించడం?**

ఎన్ ఓ సీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)ల కోసమే చెరువు ఎఫ్ టీ ఎల్ పరిధిలోకి వస్తున్న కొన్ని సర్వే నంబర్స్ ను ప్రణాళిక బద్ధంగా తొలగిస్తున్నట్లు అంటే ఎఫ్ టీ ఎల్ హద్దులు చెరువు లోపలికి ఉన్నాయని ఫలానా సర్వే నంబర్స్ దాని పరిధిలోకి రావడంలేదని ఇరిగేషన్ శాఖ ఎఫ్ టీ ఎల్ ను ఫిక్స్ చేస్తోందని మత్స్యకారులు, చెరువు పరిరక్షణ సమితి సభ్యులు అప్పట్లోనే ప్రెస్ మీట్ లో వెల్లడించారు. ఒకసారి ఎన్ ఓ సీ వస్తే ఆ తర్వాత భూములను నిరభ్యంతరంగా అమ్ముకోవచ్చు అనేది రియల్ ఎస్టేట్ వ్యాపారుల పథకం

**ఎఫ్ టీ ఎల్ హద్దులపై అనుమానాలున్నాయి.**
**- సప్ప రవి, చెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్**

ఇటీవల ఇరిగేషన్ అధికారులు నిర్ధారించిన ఎఫ్ టీ ఎల్ హద్దులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూరేలా ఉన్నాయి. గతంలో ఇరిగేషన్ అధికారులు ఎఫ్ టీ ఎల్ పరిధిలోని భూముల సర్వే నంబర్స్ ను ప్రకటించి ఇప్పుడు వాటిలో కొన్ని సర్వే నంబర్స్ ఎఫ్ టీ ఎల్ పరిధిలో లేవని ఎలా రెండు రకాల మాటలు మాట్లాడుతారు? మత్స్యకారులను, రైతులను ఇరిగేషన్ అధికారులు మోసం చేస్తున్నారు. వంద ఎకరాల చెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కబ్జా చేస్తున్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ న్యాయం ఎందుకు న్యాయం చేయడం లేదో వారికే తెలియాలి.

**సర్వే నంబర్స్‌కు ఎన్ ఓ సీ లు ఎలా ఇస్తున్నారు?**
**ధర్మాజీ శ్రీకాంత్, మత్స్యకారుడు**

ఎఫ్ టీ ఎల్ పరిధిలోని సర్వే నంబర్స్ కు ఇరిగేషన్, మున్సిపల్ శాఖల నుంచి ఎన్ ఓ సీ లు ఎలా ఇస్తున్నారు? అధికారులు లంచాలకు మరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అండగా నిలుస్తున్నారు. ఎఫ్ టీ ఎల్ హద్దులు సక్రమంగా నిర్ధారిస్తే ఎన్నో అవకతవకలు బయట పడుతాయి. ఎమ్మెల్యే, కలెక్టర్ లు చెప్పిన కూడా మట్టిని ఇప్పటికీ ఎందుకు తొలగిస్తాలేరో అధికారులు లంచగొండులని అర్థం అవుతుంది.





# మైనార్టీ కళాశాలను మంథనికి తరలించకండి

## ◆ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినసముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ



**పెద్దపల్లి ప్రతినిధి :** మంథనిలో ఏర్పాటుచేసిన గురుకుల ఇంటర్మీడియట్ కళాశాలను పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడు ఆ కళాశాలను తిరిగి మంథని కి తరలించడంతో ఇక్కడ చదివే విద్యార్థినులకు అసౌకర్యం కలుగుతుందని, ఆ కళాశాలను పెద్దపల్లి జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలని పెద్దపల్లి ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సోమవారం రోజున ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బాలుర, బాలికల కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, మంథనిలో ఏర్పాటుచేసిన బాలికల జూనియర్ కళాశాలను అక్కడ సరైన సదుపాయాలు లేకపోవడంతో పెద్దపల్లి జిల్లాలోని రాఘవపూర్ గ్రామంలో ఏర్పాటు చేశారని, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కూడా ఒక కళాశాల ఏర్పాటు చేశారని కానీ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గురుకుల కళాశాలలో సిఇసి, ఎం ఈ సి, సబ్జెక్టులు పెట్టారని, మంథని కళాశాలలో బైపిసి, ఎంపీసీ సబ్జెక్టులు పెట్టారని పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ఉన్న పలు మండలాల్లో ఉన్న నిరుపేద ముస్లిం అమ్మాయిలు ఎక్కువగా బైపిసి, ఎంపీసీ సీట్లలో భర్తీ అయ్యారని, ఆ కళాశాలను మంథని కి తరలిస్తే ఎక్కువ శాతం అమ్మాయిలు మంథని కి వెళ్లే పరిస్థితి లేదని, ప్రభుత్వ అధికారులు, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయ రమణారావు ఈ విషయమై చొరవ తీసుకొని మైనార్టీ కళాశాలను పెద్దపల్లి జిల్లా కేంద్రం లోనే కొనసాగిచ్చేటట్టు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కళాశాలను మంథనికు తరలిస్తే ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎ మోహిద్, అబ్దుల్ హై జావిద్, ఏ ఆర్ షాకీర్, మహమ్మద్ రహీం, మొహమ్మద్ జహెద్, తబ్రేజ్ ఖాన్ ,మహమ్మద్ షహబాజ్, సయ్యద్ యాకూబ్, తదితరులు పాల్గొన్నారు. మైనార్టీ కళాశాల తరలిస్తే ఆందోళన తప్పదు –బీటిడిపి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి రాఘవపూర్ లో ఏర్పాటు చేసిన మైనార్టీ కళాశాలను మంథని కి తరలిస్తే ఆందోళన కార్యక్రమాలు తప్పవని టిడిపి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి తెలిపారు. స్థానిక ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని మైనార్టీల పట్ల కాంగ్రెస్ వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, మైనార్టీ కళాశాలను మంతనికి తరలిస్తే బడుగు బలహీన వర్గాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమంలో నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## వంతడుపుల పాఠశాలలో స్వాగతోత్సవ వేడుకలు



**ఇల్లంతకుంట, జూన్ 16,** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడుపులలో బడిబాట కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో సోమవారం నూతన విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు ఆకర్షితులైయ్యేందుకు విద్యార్థులకు వివిధ రకాల కృత్యాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వప్నరాణి, ఉపాధ్యాయులు సరిత, అంగన్వాడి ఉపాధ్యాయులు పద్మశ్రీ, విజయలక్ష్మీ పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## ఏరియా జీఎం కు సింగరేణి అధికారుల వినతి



**యైటింక్లయిన్ కాలని. :** కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సింగరేణి రామగుండం రెండవ ఏరియా అధికారుల సంఘం నాయకులు సోమవారం ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య కు వినతి పత్రం అందించారు. సాయంత్రం సంఘం ఏరియా అధ్యక్షులు ఎం. రాముడు నాయకత్వంలో జిఎం కార్యాలయానికి వచ్చిన అధికారులు ఏరియా జిఎం ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. వేతనాల్లో భాగమైన 2022-23 పి.ఆర్పి చెల్లింపు, కోల్ ఇండియాలో 2023-24 పి.ఆర్పి చెల్లింపుకు సంభందించి ఉత్తర్వులు వెలువరించడం, ఉచిత విద్యుత్తు, ఐ.ఐ.టి, ఐ.ఐ.ఎం కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, 2007-14 పి.ఆర్.పి, పారదర్శకమైన పదోన్నతి పాలసీ, బదిలీలు, ఇతర సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తుందని అసంతృప్తి చెందారు. ఈ నెల 23 లోగా సమస్యలు పరిష్కారం కాని యెడల, 24 నుండి నల్ల బ్యాడ్జీలు ధరించడం, రిలే నిరాహార దీక్షలు చేపట్టడం, రూల్స్ ప్రకారం విధులు నిర్వహించడం లాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని అల్టిమేటమిచ్చారు. ఇక వినతి పత్రం అందించిన వారిలో సంఘం కార్యదర్శి టి. సంజీవ్ కుమార్, ఉపాధ్యాక్షులు పాల నరేష్, జనార్దన్, రామకృష్ణ, నితిన్, భాస్కర్ రెడ్డి, ఏరియా అధికారులు ఉన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### - అదనపు కలెక్టర్ డి.వేణు



**పెద్దపల్లి ప్రతినిధి :** ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు ప్రజల అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామానికి చెందిన సెట్టు సురేష్ పెద్దపల్లి జిల్లా పరిధిలో ఎన్ని కబేరాలు ( గేదేలు, ఆవులు, ఎద్దులు) కోయడానికి ఎన్ని షాపులకు అనుమతులు ఉన్నాయో వివరాలు తెలుప గలరని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా కలెక్టరేట్ సి విభాగం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి మండలం పెద్ద కాల్వల గ్రామానికి చెందిన బోంగు రాజమ్మ భర్త: మల్లయ్య తనకు బోదకాలు ఉన్నందున దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం తోగ్రాయి గ్రామానికి చెందిన పాలకుర్తి లక్ష్మి గ్రామ శివారు సర్వే నెంబర్ 645 లో తమ కుటుంబానికి చెందిన భూములను తనకు తన కుమారునికి తెలియకుండా రెండవ కోడలు పాలకుర్తి రజిత తన పేరు మీద పహాణీలో పట్టాదారుగా నమోదు చేస్తుందని, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తమ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీఓ పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయండి



**రామగిరి జూన్ 16:** ముదిరాజుల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయాలని పెద్దపల్లి జిల్లా ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పిల్లి చంద్రశేఖర్ రాష్ట్ర మంత్రి వాకటి శ్రీహరి ముదిరాజును కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాదులో పిల్లి శేఖర్‌తో పాటు పలువురు మంత్రి వాకాటి శ్రీహరిని కలిసి పూల బోకే అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ముదిరాజులను గ్రూపు డి నుండి ఎ కలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రతి మత్స్య కార్మికునికి ఇన్సూరెన్స్ తో పాటు ఇందిరమ్మ గృహాలను ఇప్పించాలని మంత్రిని కోరారు. దారిద్ర రేఖకు దిగువనున్న ముదిరాజులను పలు ప్రభుత్వ పథకాలు అందజేయాలని కోరారు. ఆయన వెంట మన తెలంగాణ ఫిషరీస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు యావరాజు ముదిరాజ్, విసరి సొసైటీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఐతర వేణి కొమురయ్య ముదిరాజ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు భయపడం...

- తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నరు
- ప్రజల పక్షాన ప్రతిపక్ష హోదాలో ప్రశ్నిస్తాం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**రామగిరి, జూన్ 16:** తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కుటిల రాజకీయాలకు పాల్పడుతోందని, కాంగ్రెస్ కుట్రలు,బెదిరింపులకు భయపడేది లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. ఫార్మెలా ఈ రేస్ కేసులో ఏసీబీ ముందు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ హజరు కానున్న నేపథ్యంలో కేటీఆర్ కి మద్దతు గా మంథని నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో భీఆర్ఎస్ పార్టీ నాయకులు హైదరాబాద్ తెలంగాణ భవన్ కు తరలివెళ్లారు,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో పాటు పలువురు నాయకులతో కలిసి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మానీఫెస్టో, హమీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, హమీలను అమలుచేయాలని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ పార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. నోటీసులు, విచారణ పేరుతో భయభ్రాంతులకు గురి చేయాలని చూస్తున్నారని, ప్రతి అంశాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ప్రతిపక్ష హెూదాలో ప్రశ్నిస్తూనే ఉంటామని, ఎన్ని కేసులు పెట్టినా వెనుకడుగు వేయమని ఆయన ఈసందర్భంగా స్పష్టం చేశారు.

## స్పోర్ట్స్ స్కూల్లో విద్యార్థుల దరఖాస్తులకు ఆహ్వానం



**రామగిరి, జూన్ 16:** రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపిక పోటీలు నాలుగో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు కమాన్ పూర్ మండలం ఎంఈవో ఇల్లందుల విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక విధానం మూడు అంచెల్లో ఉంటుందని, ఈనెల18న జడ్పిహెచ్ఎస్ కమాన్ పూర్ పాఠశాల లో మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు 23 నుంచి 26వ తేదీ వరకు జిల్లాస్థాయిలో, అందులో ఎంపికైతే రాష్ట్రస్థాయిలో జూలై 1 నుంచి 5వరకు సెలెక్షన్ జరు గుతుందని పేర్కొన్నారు. హకీంపేటలో బాలురకు 20సీట్లు, బాలికలకు 20 సీట్లు, కరీం నగర్లో బాలురకు 20సీట్లు, బాలికలకు 20 సీట్లు, ఆదిలాబాద్లో బాలురకు 20 సీట్లు, బాలికలకు 20 సీట్లు.. మొత్తంగా 120 సీట్లు ఉన్నాయన్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్నింగ్, 6% 10 మీటర్ల షటిల్ రన్ మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు వంటి తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు వెబ్ సైట్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.. ఇందులో పాల్గొన్నవారు వయసు ధ్రువీకరణ పత్రం ,ఆధార కార్డు మూడవ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్ ,4వ తరగతి సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయవలెను.(1-9-2016 నుండి 31-08-2017) మధ్య జన్మించిన వారే ఉండాలి. గమనించగలరు,కావున అర్హత కలిగిన విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు .విద్యార్థులు వెబ్ సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.వివరాలకు o91 90148 26714 ఈ నెంబర్ కు కాల్ చేయండి.

## నిరుపేదల వైద్యానికి చేదోడుగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**తిమ్మాపూర్, జూన్ 16,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ..... ప్రభుత్వ ఆసుపత్రులు ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపరిచి పేద ప్రజల ఆరోగ్య సమస్యలు తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. వైద్యపరమైన సమస్యలతో బాధపడేవారు తనను సంప్రదిస్తే సలహా, సూచనలు ఇస్తానని,ప్రైవేటు ఆస్పత్రుల్లో బిల్లుల చెల్లించలేక సతమతయ్యే వారికి ఆర్థికంగా చేదోడుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచిఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకుంటున్నదని, పేదలు సకాలంలో దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలోనే సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు.15వ విడతల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు 15,07,500 రూపాయలు మంజూరు కాగా వాటిని చెక్కుల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావు నాయకులు గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, కొత్త తిరుపతి రెడ్డి, కుంట రాజేందర్ రెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, రాములు యాదవ్, బుదారపు శ్రీనివాస్, రెడ్డి గాని రాజు, ఎలుక పెల్లి సంపత్, ఎండి ఆశిక్ పాష, పోలు రాము, రమేష్, ఎండి రజాక్, నాయకులు కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ట్రస్టు ద్వారా పేదలకు సహాయం చేస్తాం



**రామగిరి జూన్ 16:** కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా పేదలకు సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ బాధ్యులు మహమ్మద్ ఫయాజ్ అన్నారు. సోమవారం రామగిరి మండలంలోని చందనాపూర్ లో కెవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ చైర్మన్ వినోద్ కుకునూరు పుట్టినరోజు సందర్భంగా చందనాపూర్ జిల్లా స్కూల్ బ్యాగులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ పేదవారికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే మరిన్ని ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు చేయూతనిచ్చే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అలాగే బడి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫయాజ్ తో పాటు రాహుల్ గఫూర్ సిద్దు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పంట మార్పిడి ద్వారా రైతులు అధిక లాభాలను సంపాదించాలి

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సంవత్సరన్నర కాలంలో రైతులు సంక్షేమానికి 70 వేల కోట్ల వ్యయం
- 9 రోజుల వ్యవధిలో రైతుల ఖాతాలో రైతు భరోసా డబ్బులు జమ
- రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు
- రైతుల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కు ప్రణాళికలు
- రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి కార్యక్రమానికి బ్రాహ్మణపల్లి రైతు వేదిక నుంచి హాజరైన జిల్లా కలెక్టర్





**పెద్దపల్లి ప్రతినిధి :** పంట మార్పిడి విధానం ద్వారా రైతులు అధిక లాభాలను సంపాదించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి కార్యక్రమానికి అంతర్గాం మండలం బ్రాహ్మణ పల్లి రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హాజరయ్యారు. ఆచార్య జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం నుంచి సీఎం రేవంత్ రెడ్డి 1034 రైతు వేదికలో నూతనంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, ఇతర మంత్రులు, సీఎస్ కె. రామ కృష్ణా రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతుల ఆశీర్వాదం లేకపోతే ప్రజా ప్రతినిధిగా రాణించ లేమని , గ్రామ వార్డు సభ్యుల నుంచి ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరికి రైతు చల్లని చూపులు అవసరమని అన్నారు. గత పాలకులు 4 విడతల్లో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తే రైతులకు మిత్తి మాత్రమే జరిగిందని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని విధ్వంసం చేసి మనకు అప్పగించారని , మనం అధికారంలో వచ్చే సమయానికి రైతుల ధాన్యం కొనలేని పరిస్థితి, విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించని దుస్థితిలో రాష్ట్రం ఉండేదని, గత పాలకులు వరి వేస్తే ఉరి అనే స్థితి తీసుకొని వచ్చారని అన్నారు. నేడు ప్రజా ప్రభుత్వంలో చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, సన్న రకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందించామని అన్నారు. పేదలకు సన్న బియ్యం రేషన్ ద్వారా పంపిణి చేస్తున్నామని అన్నారు. వరి పండించడంలో పంజాబ్ హర్యానా రాష్ట్రాలను తెలంగాణ దాటిందని అన్నారు.గత పాలకుల హయాంలో పెండింగ్ పెట్టిన బకాయిలను మెల్ల మెల్లగా చెల్లిస్తున్నామని అన్నారు. ఒక్కొక్క వ్యవస్థను ప్రభుత్వం బాగు చేస్తుందని అన్నారు. 9 రోజులలో రైతులకు 9 వేల కోట్ల ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, 70 లక్షల 11 వేల రైతులకు డబ్బులు బదిలీ చేస్తామని అన్నారు.రైతుల చేతిలో డబ్బులు ఉంటే పెట్టుబడి కోసం అప్పు చేయాల్సిన దుస్థితి రాదని అన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్తు, రైతు బీమా, పరిహారం, బోనస్ కలిపి మొత్తం 18 నెలలో లక్షా 1 వేయి 728 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు.గత పాలకులు చేసిన రుణమాఫీ మనం చేసిన రుణమాఫీ పై గ్రామాలలో చర్చ పెట్టాలని అన్నారు. గతంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని , మనం 8 వేల పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 48 గంటల్లో రైతులకు ఖాతాలో పంట డబ్బులు జమ అయ్యేలా చూశామని అన్నారు. దోపిడిదారులకు ధరణి చుట్టం ఐతే, భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం చేస్తున్నామని అన్నారు.ప్రజల చావుల మీద అధికారం రావాలని ప్రతిపక్షాలు కుటిల ఆలోచనలు చేస్తున్నాయని అన్నారు. గతంలో ఎప్పుడైనా సీఎం ఫాం హౌస్ దాటి వచ్చారా అని అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించామని, గతంలో దళితుల నుంచి ఒక మంత్రి ఉంటే తమ ప్రభుత్వ హయాంలో స్పీకర్ తో కలిసి 5 దళిత సామాజిక వర్గ సభ్యులు ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు.ప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సరంలో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని, గతంలో నోటిఫికేషన్ల కోసం ఉద్యమాలు చేసిన యువత, నేడు ఆలస్యంగా ఇవ్వమని కోరుతూ ధర్నా చేస్తుందని అన్నారు. సివిల్ సర్వీసెస్ చదువుకునే పిల్లలకు 2 లక్షల రూపాయల సహాయం అందించామని అన్నారు.రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు సబ్సిడీతో అందించేందుకు చర్యలు తీసుకోవాలని, లాభసాటి వ్యవసాయం సాధన దిశగా కృషి చేయాలని అన్నారు. రాబోయే 10 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఎదగాలని అన్నారు. రైతులకు సాంకేతికత బదిలీ చేయాల్సిన అవసరం ఉందని, ఏఐ ద్వారా ఎక్కడ సమస్య ఉందో తెలిస్తే అక్కడే ఎరువులు చల్లితే మనకు భూ సారం పెరుగుతుందని అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం 17 వేల కోట్ల రూపాయల చెల్లించిందని, మనం సోలార్ కు మారితే ఈ డబ్బులు ఆదా చేసుకోవచ్చని, మహిళలకు నెలకు రెండు నుంచి మూడు వేల రూపాయల వరకు అదనంగా ఆదాయం కూడా లభిస్తుందని, రైతుల భూములలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అంబానీ ఆదానీలతో వారు పోటీపడే విధంగా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు సోలార్ పంప్ సెట్ వల్ల ప్రయోజనం, లాభసాటి పంటల సాగుపై సీనియర్ రైతులతో రైతు వేదిక లలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు జరపాలని అన్నారు. పంట మార్పిడి వ్యవస్థ తప్పనిసరిగా రావాలని, జోన్న రొట్టె తింటే మన ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. వ్యవసాయ ఫీలింగ్ యాక్ట్ తీసుకుని వచ్చి పేదలకు గతంలో ఇందిరమ్మ భూములు పంచి పెట్టిందని, ఆదివాసి గిరిజనులకు పోడు పట్టాలు అందించిందని అన్నారు.

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క :** రైతు పక్షపాతిగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ఇందిరమ్మ ప్రభుత్వం 21 వేల కోట్ల రుణ మాఫీ, 13 వేల 88 కోట్ల రైతు భరోసా, క్వింటాళ్ల సన్న బియ్యం 500 బోనస్ క్రింద 1199 కోట్ల, రైతు బీమా క్రింద 2182 కోట్ల రూపాయల, 200 కోట్ల పంట నష్ట పరిహారం, 16, 691 కోట్లతో ఉచిత విద్యుత్ సరఫరా, 11 వేల కోట్లతో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం మొత్తం 70 వేల కోట్ల ఖర్చు చేశామని అన్నారు.రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యమైన కోటి 49 లక్షల 39 వేల 112 ఎకరాలకు పూర్తి స్థాయిలో రైతు భరోసా డబ్బులను జమ చేసే కార్యక్రమం రైతుల సమక్షంలో నేడు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. 9 రోజుల వ్యవధిలో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని అన్నారు. రైతు కూలీలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని అన్నారు.

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు :** ఒకటిన్నర సంవత్సర కాలంలో రైతు సంక్షేమానికి 70 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మాత్రమేనని అన్నారు. గతంలో మన్మోహన్ సింగ్, వైయస్సార్ హయాం లో దేశం మొత్తం మీద 70 వేల కోట్ల రుణమాఫీ చేస్తే, 10 నెలల కాలంలో 21 వేల కోట్ల రుణమాఫీ మన ప్రభుత్వం చేసిందని అన్నారు.గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన రైతు బంధు బకాయిలు 7625 కోట్ల రూపాయల రైతుల ఖాతాలో జమ చేశామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట సాగు చేస్తుంది తెలంగాణ రైతు అని అన్నారు. దేశం మొత్తం తెలంగాణ రాష్ట్ర పాలన కావాలని నేడు కోరుకుంటుందని అన్నారు.ఉచిత విద్యుత్తు ,నీటి పారుదల ప్రాజెక్టు, రుణమాఫీ వంటి అనేక రైతు సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వినూత్నంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. కృష్ణ, గోదావరి నదులలో రైతులకు అన్యాయం జరిగిందంటే కారణం గత పాలకులదని మంత్రి విమర్శించారు.

**సీఎస్ కె. రామ కృష్ణా రావు :** దేశంలో ప్రగతి శీల రైతులు ఉన్న రాష్ట్రం తెలంగాణ, మన రైతులు సంపన్నులు కావాలనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ దాదాపు 6 లక్షల మంది రైతులు నేటి కార్యక్రమంలో పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ తూము రవీందర్, ఎంపీడీవో వేణుమాధవ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అరాచకపు పి.ఏని పక్కన పెడితేనే నియోజకవర్గ ప్రజలకు, ఎమ్మెల్యేకు మంచిది

- కొత్తపల్లి మాజీ సర్పంచ్ ఇనుకొండ జితేందర్ రెడ్డి





**తిమ్మాపూర్, జూన్ 16,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో తమ ప్లాట్లలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దారిగా మార్చారన్న ఆరోపణలపై స్పందిస్తూ స్థానిక మాజీ సర్పంచ్ ఇనుకొండ జితేందర్ రెడ్డి సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జితేందర్ రెడ్డి మాట్లాడుతూ....ఎమ్మెల్యే కవ్వంపల్లికి మంత్రి పదవి రాకపోవడాని తన పి.ఏ అరాచకాలే ప్రదాన కారణమన్న విషయం నియోజకవర్గం మొత్తానికి తెలుసని అయినా పి.ఏ మురళీధర్ రెడ్డి సూచనల ప్రకారమే ఎమ్మెల్యే తన కార్యచరణను అవలంభిస్తున్నాడని ఆరోపించారు.ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కు వచ్చే ఫిర్యాదులపై క్షుణ్ణంగా పరిశీలించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలకు ఎటువంటి నష్టం జరుగదన్నారు. గతంలో కూడా పి.ఏలుగా ఉన్న అనుచరుల తప్పుడు సమాచారంతో ఇసుక క్వారీ విషయంలో వేబ్రిడ్జి టోకెన్ గదులను కూల్పించి ఆనందం పొంది ప్రజలకు ఎమ్మెల్యే నష్టమే చేశాడని,వెంచర్ దారి విషయంలో దాదాపు 70శాతం నక్షప్రకారమే సర్వేయర్ తో కొల్పించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా 30ఫీట్లతో రెండు దారులు ఏర్పాటు చేస్తే స్థానిక నాయకుల తప్పుడు సమాచారంతో ఆలోచించకుండా ఇప్పుడు కూడా ఎమ్మెల్యే గ్రామస్తులకు నష్టమే చేశాడని ఆరోపించారు.గ్రామానికి చెందిన నర్సింహ రెడ్డి, చంద్రారెడ్డి ప్రజల కోసం ఎదైనా చెసే ముందు ప్రజలను విచారించి చేయాలని గతంలో ఎమ్మెల్యేకు సూచించినప్పటికీ మళ్ళీ అదే విధంగా అనుచరుల మాట ప్రకారమే ఎమ్మెల్యే వ్యవహరిస్తున్నాడని నిజంగా ప్రజలకు మేలు చేసే ఉద్దేశమే ఉంటే ప్రజాభిప్రాయాన్ని సేకరించి మాత్రమే పనులు చేయాలని హితవు పలికారు.కొత్తపల్లిలో దారి విషయంలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా సర్వేయర్లపై ఒత్తిడి తెచ్చి ఎమ్మెల్యే తప్పుడు సర్వే చేయించారని ఆరోపిస్తూ దీనిపై న్యాయం జరిగే వరకు పై అధికారులకు చేరే విధంగా ప్రయత్నం చేస్తానని గ్రామస్తులు ఒక్కలిద్దరూ చెప్పిన విధంగా అనుసరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని ఎమ్మెల్యేను కోరారు.గతంలో ఇసుక క్వారీ ద్వారా రేణికుంటలో సుమారు 50ట్రాక్టర్లు నడిచి డ్రైవర్లు,కూలీలు జీవనొపాది పొందేవారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాంగ్రెస్ నాయకులే ట్రాక్టర్ ల ద్వారా అక్రమంగా ఇసుక దందా చేస్తుండగా పోలీసులు మాత్రం సాదారణ వ్యక్తుల ట్రాక్టర్లనే పట్టుకుంటున్నారని దీనిపై చర్యతీసుకుని సాండ్ టాక్స్ ను పునరుద్ధరించాలని కోరారు.1996లో సర్పంచ్ గా తాను చెసిన అభివృద్ధికి తనను గ్రామ ప్రజలు మూడు సార్లు సర్పంచ్ గా గెలిపించుకున్నారని ఇప్పుటి వరకు గ్రామస్తులందరం ఎలాంటి కక్షలు లేకుండా ఐక్యమత్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని జెడ్పీటీసీగా పనిచేసిన కూడా రాజకీయంగా ఎటువంటి కక్షలు చూపెట్టకుండా ఎంతో మందికి సహయ సహకారాలు అందించానన్నారు. అరాచకాలు చేసే పి.ఏ మురళీధర్ రెడ్డిని పక్కన పెడితేనే నియోజకవర్గ ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా ఎమ్మెల్యేకు చెడ్డపేరు రాకుండా ఉంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లిని జితేందర్ రెడ్డి సూచించారు.సమావేశంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు చెక్



**రామగిరి జూన్ 16:** భూ భారతి తో భూ సమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుంది అని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి అన్నారు. కమాన్ పూర్ మండలంలోని పే రా పల్లి గ్రామపంచాయతీ లోభూభారతి గ్రామసభను నిర్వహించారు. ఇందులో మొత్తం భూ సమస్యలపై 27 దరఖాస్తులు అందినట్లు తహసిల్దార్ వాసంతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణి స్థానంలో తెలంగాణ ప్రభుత్వం భూభారతి ప్రవేశపెట్టిందని దానికి అనుగుణంగానే దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న భూముల సమస్యను భూభారతి ద్వారా పరిష్కారం చేయడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గిదవార్ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ సతీష్, ఏఎస్ఐ ఖలీల్ ఖాన్, జూనియర్ అసిస్టెంట్ గోస్కుల రజిత, శ్రీనివాస్, రంజిత్, రాజేందర్, రికార్డర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కట్ట కుమార్, ధరణి ఆపరేటర్ ప్రదీప్, మీసేవ ఆపరేటర్ తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రేక్‌ఫాస్ట్‌లో మొలకెత్తిన పెసర్లు తింటే

# ఈ వ్యాధులన్నీ పరార్..!



పెసర పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అంతేకాదు వీటిలో ప్రోటీయోలైటిక్ ఎంజైమ్స్ కూడా ఉంటాయి. అలసటను పోగొట్టేందుకు, హాయిగా నిద్రపోయేందుకు పెసరపప్పు ఎంతగానో సహాయపడుతుంది. వీటితో పాటుగా మొలకెత్తిన పెసరపప్పును కూడా తినొచ్చు. ఉదయం బ్రేక్



ఫాస్ట్ లో మొలకెత్తిన పెసర్లను తినటం వల్ల ఆరోగ్యం బేషుగ్గా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన పెసర్లలో యాంటీ ఆక్సిడెంట్లు, క్లోరోఫిల్, విటమిన్-సి లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. మొలకెత్తిన పెసర్లను బ్రేక్‌ఫాస్ట్‌లో తినటం వల్ల మన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు ఇది మన శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి కూడా సహాయపడుతుంది. అలాగే, జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. మొలకెత్తిన పెసర్లలో ఐరన్ కూడా మెండుగా ఉంటుంది. శరీరంలో హిమోగ్లోబిన్ పరిమాణం పెరుగుతుంది. దీంతో రక్తహీనత సమస్య పోతుంది. మొలకెత్తిన పెసర్లలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. ఇది మన జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ఎసిడిటీ, కడుపు నొప్పి, పుల్లని త్రేన్పులు వంటి జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఇది జీవక్రియను కూడా పెంచుతుంది. అంతేకాదు, చర్మానికి కూడా మేలు చేస్తుంది. మొలకెత్తిన పెసర్లతో రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. రక్తం గడ్డకట్టే సమస్య తొలగిపోతుందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన పెసర్లు చర్మ సంరక్షణలో కూడా మేలు చేస్తాయి. ప్రతి రోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో మొలకెత్తిన పెసర్లను తింటే మన చర్మం కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మొలకెత్తిన పెసర్లను తినటం వల్ల వృద్ధాప్య ఛాయల్ని దూరం చేస్తుంది. మన చర్మాన్ని యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. మొలకెత్తిన పెసరలో విటమిన్ ఎ ఉంటుంది. ఇది మన కళ్లకు మేలు చేస్తుంది. దీన్ని మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే కంటిచూపు పెరుగుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు మొలకెత్తిన పెసర్లు చాలా మంచిది. రక్తంలో చక్కెర స్థాయిని సమతుల్యం చేయగల సామర్థ్యం వీటికి ఉంది. ప్రతిరోజు గుప్పెడు తింటే గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. మొలకెత్తిన పెసర్లను తింటే సంతానోత్పత్తికి ఉపయోగపడుతుంది. శరీర లోపలి భాగాలను శక్తివంతం చేస్తుంది. మొలకెత్తిన పెసర్లు గర్భిణీలకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అధిక బరువుతో ఇబ్బంది పడేవారికి మొలకెత్తిన పెసర్లు బరువు తగ్గడానికి తోడ్పడుతాయి. శరీరంలో కొవ్వు పెరగకుండా చేస్తుంది.

## మీకు డయాబెటిస్ ఉందా..?

### రోజుకు రెండుసార్లు ఇలాంటి టీ తాగండి చాలు..!



పాలు, చక్కెర కలిపి తయారు చేసిన టీ తాగటం మానేస్తే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్న మాట. కానీ, డయాబెటిక్ పేషెంట్లు టీ ఎలా తాగాలో ప్రత్యేకించి చెబుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ డైట్ విషయంలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. షుగర్ లెవల్స్ మెయింటెయిన్ చేయడం తప్పనిసరి అంటున్నారు. షుగర్ బాధితులు దూరంగా ఉండాల్సిన ఆహారాల్లో టీ కూడా ఒకటి. ఇందులో పాలు, పంచదార ఉన్నందున దీనిని నివారించడం మంచిదని చెబుతున్నారు.. కానీ, డయాబెటిక్ పేషెంట్లు ఎలాంటి టీ తాగితే మేలు చేస్తుందో ఇక్కడ తెలుసుకుందాం.. 1. గ్రీన్ టీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు అత్యంత ఆరోగ్యకరమైన టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీలోనిపాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతే కాదు, గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. 2.దాల్చిన చెక్క టీ దాల్చిన చెక్క టీ మధుమేహాన్ని నియంత్రించడంలో ఉత్తమమైనది. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్క టీ చేయడానికి, ఒక కప్పు నీటిలో దాల్చిన చెక్క చిన్న ముక్క వేసి కాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత టీకి బదులుగా తాగేయాలి. 3. మెంతి టీ డయాబెటిక్ బాధితులకు మెంతి టీ మరొక గొప్ప ఎంపిక. మెంతులలో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. మెంతి టీ చేయడానికి, ఒక కప్పు వేడి నీటిలో ఒక చెంచా మెంతులు వేసి 10 నిమిషాలు అలాగే పక్కన పెట్టి తాగేయండి. రుచి కోసం కావాలంటే మీరు నిమ్మరసం కూడా యాడ్ చేసుకోవచ్చు. 4. వాముతో తయారు చేసిన టీ వాము జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వాము టీ తయారు చేయడానికి ఒక గ్లాస్ నీటిలో పావు చెంచా వాము వేసి 5 నిమిషాలు మరిగించండి. కాస్త ఆ తర్వాత వడకట్టి తాగాలి. 5. తులసి టీ తులసి టీలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని కోసం, ఒక కప్పు వేడి నీటిలో కొన్ని తులసి ఆకులను వేసి 5 నిమిషాలు మూత పెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత రుచి కోసం కొంచెం తేనె కలుపుకుని తాగేయొచ్చు. చివరగా, మధుమేహులు ఇలాంటి టీ తాగుతున్నప్పుడు దానికి చక్కెర, లేదా తేనె కలుపుకోవడం మంచిదికాదు. రుచి కోసం కావాలంటే మీరు దాల్చినచెక్క పొడి లేదా ఏలకుల పొడి వేసుకుని తాగొచ్చు. మరీ ముఖ్యంగా ఇలాంటి ఇంటి చిట్కాలు, ఆయుర్వేద మందులు వాడే ముందు..మీరు మీ వైద్యుడిని సంప్రదించండి. దీనితో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్యుల సలహాలను అనుసరించడం చాలా ముఖ్యం.

### గుండె సమస్యలకు దానిమ్మ రసం దివ్యౌషధం..

## రోజుకి గ్లాసుడు తాగితే చాలు!



ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో నిండిన దానిమ్మ పండు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున్న శరీర కణాలను రక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో, టైప్-2 మధుమేహం వంటి వ్యాధులను నివారించడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వ్యతిరేకంగా ప్రతిఘటించే సామర్థ్యం దానిమ్మపండులోని కొన్ని భాగాల్లో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దానిమ్మపండులో పాలీఫెనోలిక్ అనే ప్రయోజనకరమైన సమ్మేళనం ఉంటుంది. ఈ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దానిమ్మ రసం తాగితే ఛాతీ నొప్పి తీవ్రత తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా దానిమ్మ రసం నివారిస్తుంది. అందుకే ఈ జ్యూస్‌ని రెగ్యులర్‌గా తాగితే కిడ్నీలు బాగుంటాయని నిపుణులు సూచిస్తుంటారు. దానిమ్మ రసం నోటి దుర్వాసనను తగ్గిస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించడం ద్వారా దంత క్షయాన్ని నివారిస్తుంది. క్రమం తప్పకుండా దానిమ్మ రసాన్ని తింటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దానితో పాటు ప్రేగులలో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా సంఖ్య కూడా పెరుగుతుంది. ఫలితంగా గ్యాస్-గుండె మంట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దానిమ్మలో ఉండే ఎల్లాగిటానిన్ అనే యాంటీఆక్సిడెంట్ అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను నివారించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తుంది.



## నిత్యం యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలి

- యోగా చేయండి - ఆరోగ్యంగా ఉండండి

- రామగుండం -త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు






**రామగిరి, జూన్ 16:-** నిత్యం యోగా చేసి ఆరోగ్యంగా ఉండాలని రామగుండం -త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి వ్యాప్తంగా జూన్ 16 నుండి 21 వరకు, వారం రోజులపాటు అన్ని గనులు, విభాగాల్లో నిర్వహించనున్న యోగాభ్యాస కార్యక్రమాన్ని సోమవారం జి.ఎం. కార్యాలయం నందు రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జి.ఎం. కార్యాలయంలోని వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులతో యోగా శిక్షకురాలు సూదుల మల్లేశ్వరి యోగాభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి.యం. మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా, ఒత్తిడిని నివారిస్తుందని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ యోగా విశిష్టతను గురించి తెలియజేయడమే కాకుండా, యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఉద్యోగులందరూ యోగా కోసం రోజు కొంత సమయాన్ని కేటాయించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ప్రతినిధి సంతోష్ కుమార్, అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్.వెంకటరమణ, ఫైనాన్స్ ఎజియం పి.శ్రీనివాసులు, ఎస్వోటుజిఎం బి.వి.సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


## ఇళ్ల నిర్మాణాలకు ఇసుక టోకెన్ల జారీ

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**మానకొండూర్, జూన్ 16 :** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ...... లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపడితే నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేయడమే కాకుండా ఇసుక టోకెన్లు అందజేస్తుందని ఈ టోకెన్లను లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. 15వ విడతలో మానకొండూరు మండలంలోని 60 మంది లబ్ధిదారులకు రూ. 12,93,00 మంజూరు కాగా వాటిని చెక్కుల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి. వరలక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, డైరెక్టర్లు దాసరి శ్రీనివాస్ యాదవ్ మాతంగి సహదేవ్, నాయకులు తాళ్ళపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, గుడాల మహేందర్, రేమిడి శ్రీనివాసరెడ్డి రేమిడి తిరుపతిరెడ్డి, బండి మల్లేశం గౌడ్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, కొండ సురేష్, ఎండి ఇర్ఫాన్ , కనకం కుమార్, సాయిరి దేవయ్య, మడుపు ప్రేమ్ కుమార్, బాకారపు రమేష్, సంతోష్, గొల్లెన కొమురయ్య, నాగిశెట్టి రాజయ్య, తిరుపతి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిందితుల వివరాలు వెల్లడించిన సిఐ సదన్ కుమార్



**తిమ్మాపూర్, జూన్ 16,:** గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సిఐ సదన్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సిఐ వెల్లడించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కొత్తపల్లి ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నాగయ్యపల్లికి చెందిన గొంటి నగేష్ (19),కోనరావుపేట మండలం మట్టిమల్లకు చెందిన చెప్యాల సాత్విక్ (19), వేములవాడ అర్బన్ కాలనికి చెందిన కుత్తడి భరత్(19) అనే ముగ్గురు గంజాయికి అలవాటు పడి గంజాయి అమ్ముతూ డబ్బు సంపాదించాలని దురుద్దేశంతో ఓ ద్విచక్ర వాహనంపై నాలుగు రోజుల క్రితం ఒడిస్సా వెళ్ళి గంజాయి కొనుక్కుని తిరిగి వస్తున్న క్రమంలో కొత్తపల్లి ఎక్స్ రోడ్ వద్ద పట్టుకుని నిందితుల నుండి 5కేజిల గంజాయి,కెడిఎం ద్విచక్ర వాహనం,ఒక చరవాణిని స్వాధీనం చేసుకుని ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు సిఐ సదన్ కుమార్ తెలిపారు.

# అక్టోబర్ 5న భారత్, పాకిస్తాన్ మ్యాచ్

మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 షెడ్యూల్ విడుదల మహిళల క్రికెట్ వన్డే ప్రపంచ కప్ 2025 షెడ్యూల్ వచ్చేసింది. ఆపరేషన్ సిందూర్ తరువాత భారత్, పాక్ తొలిసారిగా తలపడనున్నాయి. కొలంబో వేదికగా భారత్, పాకిస్తాన్ మ్యాచ్ షెడ్యూల్ చేశారు. సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 2 వరకు భారతదేశం, శ్రీలంక వేదికలలో మహిళల వన్డే వరల్డ్ కప్ జరగనుంది. 8 జట్లు పాల్గొనే ఈ టోర్నమెంట్ లో మొత్తం 31 మ్యాచ్‌లు ఆడతారు. వన్డే వరల్డ్ కప్ పూర్తి షెడ్యూల్ వివరాలు వెల్లడించారు. భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ ఎప్పుడు జరుగుతుందో పూర్తి వివరాలు ఇక్కడ అందిస్తున్నాం. ప్రతి మ్యాచ్ వేదిక మరియు సమయం వివరాలు ఇక్కడ ఉన్నాయి.మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 మొదటి మ్యాచ్ మంగళవారం, సెప్టెంబర్ 30న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగనుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య భారత్, శ్రీలంక జట్లు తలపడనున్నాయి. హైబ్రిడ్ మోడల్‌లో జరిగే ఈ ఐసీసీ మెగా టోర్నమెంట్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు తమ అన్ని మ్యాచ్‌లను కొలంబోలోని %=% ప్రేమదాస స్టేడియంలో ఆడేలా ప్లాన్ చేశారు నిర్వాహకులు. ప్రపంచ కప్‌లో ఆతిథ్య భారత జట్టుతో పాటు ఆస్ట్రేలియా, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లు పాల్గొంటాయి. ఫార్మాట్ గురించి చెప్పాలంటే ఇది రౌండ్-రాబిన్ మెథడ్‌లో జరుగుతుంది. తర్వాత 2 సెమీ-ఫైనల్స్ ఉంటాయి. సెమీఫైనల్ విజేతలు ఫైనల్లో వరల్డ్ కప్ కోసం తలపడతారు.భారత్, పాకిస్తాన్ జట్ల మధ్య మహిళల ప్రపంచ కప్ మ్యాచ్ అక్టోబర్ 5న జరగనుంది. శ్రీలంకలోని కొలంబోలోని %=%. ప్రేమదాస స్టేడియంలో ఈ మ్యాచ్ జరుగుతుంది.



ప్రపంచ కప్‌లో భారత జట్టు షెడ్యూల్
సెప్టెంబర్ 30: భారత్ - శ్రీలంక - బెంగళూరు - మధ్యాహ్నం 3 గంటలకు
అక్టోబర్ 5: భారత్ - పాకిస్తాన్ - కొలంబో - మధ్యాహ్నం 3 గంటలకు
అక్టోబర్ 9: భారత్ - దక్షిణాఫ్రికా - వైజాగ్ - మధ్యాహ్నం 3 గంటలకు
అక్టోబర్ 12: భారత్ - ఆస్ట్రేలియా - వైజాగ్ - మధ్యాహ్నం 3 గంటలకు
అక్టోబర్ 19: భారత్ - ఇంగ్లాండ్ - ఇండోర్ - మధ్యాహ్నం 3 గంటలకు
అక్టోబర్ 23: భారత్ - న్యూజిలాండ్ - గౌహతి - మధ్యాహ్నం 3 గంటలకు
అక్టోబర్ 26: భారత్ - బంగ్లాదేశ్ - బెంగళూరు - మధ్యాహ్నం 3 గంటలకు

పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరితే అక్టోబర్ 29న జరిగే మొదటి సెమీఫైనల్ మ్యాచ్ కొలంబోలో జరుగుతుంది. సెమీస్ గెలిచి పాక్ ఫైనల్ కనుక చేరితే ఫైనల్ కూడా అక్కడే జరుగుతుంది. పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరకపోతే మొదటి సెమీఫైనల్ గౌహతిలో, ఫైనల్ మ్యాచ్ బెంగళూరులో నిర్వహించేలా ప్లాన్ చేశారు.

# స్పోర్ట్స్



## క్రికెట్ నుంచి రిటైర్ అవమని విమర్శించారు

### నా లక్ష్యం తిరిగి భారత జట్టులో ఆడటమే

### భారత క్రికెటర్ కరుణ్ నాయర్

భారత క్రికెటర్ కరుణ్ నాయర్ ఎని.మిదేళ్ల తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ జట్టులో ఆడే అవకాశం పొందాడు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ఇంటర్వ్యూలో రెండు సంవత్సరాల క్రితం జరిగిన ఓ ?సంఘటనను అతడు పంచుకున్నాడు. తనను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అవమని ఓ ప్రముఖ క్రికెటర్ సూచించాడని అందులో చెప్పాడు. ఆర్థికంగా నమ్మకాన్నిచ్చే ఫ్రాంఛైజీ టీ20 లీగ్‌లు ఆడుకోమని తనకు సూచించాడని అందులో వివరించాడు. నాయర్? మాత్రం దేశవాళీల్లో రాణించి జాతీయజట్టులోకి తిరిగి ప్రవేశించాడు. ఈ నెల 20 నుంచి ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు భారత జట్టు తరపున ఎంపికయ్యాడు. టీమ్‌ఇండియా ప్రకటించిన 18 మంది సభ్యుల బృందంలో ఒకడిగా చోటు దక్కించుకున్నాడు.నాకు ఇప్పటికీ గుర్తుంది. ఓ ప్రముఖ భారత క్రికెటర్ రెండు సంవత్సరాల క్రితం నాకు ఫోన్ చేశాడు. నన్ను అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోమన్నాడు. ఆర్థికంగా నమ్మకం కోసం విదేశీ టీ20 లీగుల్లో ఆడమని సూచించాడు. అతడు చెప్పినట్లు చేయడం సులువే. కానీ నా లక్ష్యం తిరిగి భారత జట్టులో ఆడటమే. ఈ సంఘటన రెండేళ్ల క్రితం జరిగింది. కానీ ఇప్పుడు నేను టీమ్ ఇండియాలో చోటు దక్కించుకున్నాను" అని ఇంటర్వ్యూలో కరుణ్ నాయర్ అన్నాడు. అతడు ప్రస్తుతం మంచి ఫామ్‌లో కనిపిస్తున్నాడు. తాజాగా ఇంగ్లాండ్ లయన్స్‌తో ఇండియా ఏ జట్టుతో తలపడినా అనధికారిక టెస్ట్ మ్యాచ్?లో అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేసి డబుల్ సెంచరీ సాధించాడు.ప్రస్తుత భారత జట్టు కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కరుణ్ నాయర్‌కు మద్దతుగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా గంభీర్?, నాయర్?ను ఉద్దేశించి కొన్ని మాటలు మాట్లాడారు. 'మీరు ఎన్ని పరుగులు చేసినా అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎప్పటికీ వదులుకోని మనస్తత్వం. అదే మిమ్మల్ని తిరిగి జట్టులోకి తీసుకువచ్చింది. ఇది మొత్తం ప్రపంచానికి స్ఫూర్తినిచ్చే విషయం' అని అన్నాడు. అలాగే కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం ఉన్న కరుణ్ టీమ్‌ఇండియాకు ఎంతో మేలు చేస్తాడని గౌతమ్ గంభీర్ తన అభిప్రాయం వ్యక్తంచేశాడు.కరుణ్? నాయర్ 2023-2024 కౌంటీ ఛాంపియన్‌షిప్ సీజన్లలో నార్తాంప్టన్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 10 మ్యాచ్‌ల్లో 736 పరుగులు చేశాడు. ఇందులో చిరస్మరణీయమైన ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. అలాగే 2024-2025 రంజీ ట్రోఫీలో విదర్భకు ప్రాతినిధ్యం వహించిన అతడు 16 ఇన్నింగ్స్‌ల్లో 863 పరుగులు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు, రెండు అర్ధ సెంచరీలున్నాయి. విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్‌లో ఏకంగా 779 పరుగులు చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2024, 2025లో (టీ20) ఆరు ఇన్నింగ్స్‌ల్లో 255 పరుగులు చేశాడు.

## ఊహించని ఆటతీరుతో రాణిస్తున్న శార్దూల్ ఠాకూర్

భారత టెస్ట్ జట్టు ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఎవరూ ఊహించని ఆటతీరుతో శార్దూల్ ఠాకూర్ అందరినీ ఆశ్చర్యపరిచారు. శార్దూల్ ఠాకూర్ మొదట బౌలింగ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. ప్రముఖ బౌలర్లు అయిన జస్‌ప్రీత్ బుమ్రా ఒక్క వికెట్ కూడా తీయలేదు. ఇతర బౌలర్లు అయిన మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలా రెండు వికెట్లు మాత్రమే తీశారు. ఈ పరిస్థితుల్లో శార్దూల్ ఠాకూర్ 4 వికెట్లు తీసి అదరగొట్టాడు. అదే కాకుండా తర్వాత బ్యాటింగ్‌లోనూ తన సత్తా చాటాడు. ప్రాక్టీస్ మ్యాచ్ మూడో రోజు ఆటలో బ్యాటింగ్‌లో శార్దూల్ ఠాకూర్ 68 బంతుల్లో 122 పరుగులు చేసి అదరగొట్టాడు. దీని ద్వారా నితీష్ కుమార్ రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. దీనికి ముందు జరిగిన ఇంగ్లాండ్ లయన్స్ జట్టుతో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో నితీష్ కుమార్ రెడ్డి ఒకే ఒక్క అర్ధ సెంచరీ మాత్రమే సాధించాడు. అతని బౌలింగ్ కూడా పేలవంగానే ఉంది. నితీష్ స్థానంలో శార్దూల్ ఠాకూర్‌ను జట్టులోకి తీసుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టుతో 5 టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు భారత జట్టు ఇంగ్లాండ్‌లో క్యాంప్ వేసింది. అక్కడ ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడుతోంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్ అద్భుతంగా రాణించాడు. నాలుగు వికెట్లు తీయడంతో పాటు ధాటిగా 122 పరుగులు చేసి అదరగొట్టాడు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూరే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు కావడం గమనార్హం.దీని కొనసాగింపుగా శార్దూల్ ఠాకూర్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చాల్సిన అవసరం ఏర్పడింది. శార్దూల్‌ను చేర్చాలంటే మరొక ఫాస్ట్ బౌలర్‌ను తొలగించాలి లేదా ఆల్‌రౌండర్‌గా ఉన్న నితీష్ కుమార్ రెడ్డిని తొలగించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో నితీష్ కుమార్ రెడ్డిని తొలగిస్తారని అంచనా వేస్తున్నారు. నితీష్ కుమార్ రెడ్డి ఆస్ట్రేలియాలో చేసిన ఒక సెంచరీ తప్ప, మరే ఇతర గొప్ప ప్రదర్శన చేయలేదు. ముఖ్యంగా బౌలింగ్‌లో నితీష్ కుమార్ రెడ్డి రోజురోజుకు పేలవంగా మారుతున్నాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ సిరీస్‌లో కూడా అతని బౌలింగ్, బ్యాటింగ్ రెండూ పేలవంగానే ఉన్నాయి.అయినప్పటికీ టెస్ట్ మ్యాచ్‌లలో నితీష్ బాగా ఆడతాడని ఆశించినప్పటికీ, బ్యాటింగ్ లో ఒక అర్ధ సెంచరీ చేసినప్పటికీ.. అతను ప్రతి మ్యాచ్‌లో నిలకడగా పరుగులు చేయలేకపోయాడు. అంతే కాకుండా బౌలింగ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అదే నితీష్ కుమార్ రెడ్డికి ప్రతికూలంగా మారింది. ఇది శార్దూల్ ఠాకూర్‌కు అనుకూలమైన విషయంగానూ మారింది.





## ఐర్లాండ్ బౌలర్లపై ఇవిన్ లూయిస్ విధ్వంసం

ఐర్లాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో వెస్టిండీస్ జట్టు 1-0 తేడాతో విజయం సాధించడంలో స్టార్ ఓపెనర్ ఇవిన్ లూయిస్ కీలక పాత్ర పోషించాడు. వర్షం కారణంగా మొదటి రెండు మ్యాచ్‌లు రద్దవగా, నిర్ణయాత్మక మూడో టీ20లో లూయిస్ బ్యాట్ ఝుళిపించి వెస్టిండీస్‌కు భారీ విజయాన్ని అందించాడు. జూన్ 15, 2025న బ్రెడీలో జరిగిన మూడో టీ20లో ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఈ నిర్ణయం వెస్టిండీస్‌కు కలిసొచ్చింది. ఓపెనర్లు ఇవిన్ లూయిస్, కెప్టెన్ షాయ్ హోప్ ఐర్లాండ్ బౌలర్లను ఉతికారేశారు. వీరిద్దరూ కేవలం 10.3 ఓవర్లలోనే 122 పరుగుల భారీ ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.ఇవిన్ లూయిస్ కేవలం 44 బంతుల్లోనే 91 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 8 భారీ సిక్సర్లు ఉన్నాయి. షాయ్ హోప్ కూడా 27 బంతుల్లో 51 పరుగులతో రాణించాడు. వీరిద్దరి వీరోచిత బ్యాటింగ్ ప్రదర్శనతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 256 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇది టీ20ఐ చరిత్రలో వెస్టిండీస్ చేసిన రెండవ అత్యధిక స్కోరు కావడం విశేషం. కేసీ కార్టీ కూడా 22 బంతుల్లో అజేయంగా 49 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు తోడ్పడ్డాడు.అనంతరం 257 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్, వెస్టిండీస్ బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. ఐర్లాండ్ బ్యాటర్లు రోస్ అడైర్ (48), హ్యారీ టెక్టర్ (38) ఓ మోస్తరుగా రాణించినా, మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం లభించలేదు. ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 194 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో వెస్టిండీస్ 62 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 1-0తో కైవసం చేసుకుంది.వెస్టిండీస్ తరపున అకేల్ హుస్సేన్ 3 వికెట్లు, జాసన్ హోల్డర్ 2 వికెట్లు తీసి ఐర్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను కుప్పకూల్చారు. ఈ మ్యాచ్‌లో ఇవిన్ లూయిస్ ప్రదర్శన అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును తెచ్చిపెట్టింది. గత ఇంగ్లాండ్ సిరీస్‌లో నిరాశపరిచిన వెస్టిండీస్ జట్టుకు ఈ సిరీస్ విజయం, ముఖ్యంగా లూయిస్ ప్రదర్శన ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ గెలుపు కరీబియన్లకు ఎంతో అవసరమని కెప్టెన్ షాయ్ హోప్ పేర్కొన్నాడు. రాబోయే ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు ఇది మంచి సన్నాహంగా మారింది.ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను వెస్టిండీస్ గెలవడానికి ఎవిన్ లూయిస్ సహాయం చేశాడు. గత ఏడాది అక్టోబర్‌లో 1188 రోజుల తర్వాత అతను వన్డే క్రికెట్‌లోకి తిరిగి వచ్చాడు. సెంచరీ సాధించాడు, అలాగే సిరీస్ గెలిచేలా చేశాడు. అంతకు ముందు దాదాపు 3 సంవత్సరాలు లూయిస్ వన్డే జట్టుకు దూరంగా ఉన్నాడు. ఆనాడు పల్లెకెలెలో వర్షంతో ప్రభావితమైన ఆ మ్యాచ్‌లో ఆడటానికి అవకాశం వచ్చింది. వెస్టిండీస్ 22వ ఓవర్‌లోనే 195 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. ఆ వన్డేలో ఎవిన్ లూయిస్ 61 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేశాడు.

# భారత్, ఇంగ్లండ్ ట్రోఫీకి నా పేరు పెట్టకండి

### దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్

భారత్, ఇంగ్లాండ్ మధ్య 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ జూన్ 20 నుండి ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్‌లో జరగనున్న ఈ సిరీస్ కోసం టీం ఇండియా పూర్తి స్థాయిలో కసరత్తు చేస్తోంది. ఇంతలో, ఇండియా-ఇంగ్లాండ్ సిరీస్‌ను కొత్త పేరుతో తెరపైకి తీసుకురావడానికి బీసీసీఐ, ఈసీబీ సన్నాహాలు చేస్తున్నాయి. దీనిలో భాగంగా, ఇండో-ఇంగ్లాండ్ సిరీస్‌కు 'టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ' అని పేరు పెట్టాలని నిర్ణయించారు.గతంలో, ఇంగ్లాండ్‌లో జరగనున్న ఈ ఇండియా-ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌ను 'పటౌడీ ట్రోఫీ' అని పిలిచేవారు. పటౌడీ ట్రోఫీని మొదటిసారి 2007లో ఆడారు. భారత క్రికెట్ దిగ్గజాలు ఇఫ్తికార్ అలీ ఖాన్ పటౌడీ, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీల గౌరవార్థం ఇండో-ఇంగ్లాండ్ సిరీస్ కోసం ట్రోఫీకి పటౌడీ అని పేరు పెట్టారు.ఇండియా-ఇంగ్లాండ్ సిరీస్ కోసం పటౌడీ పేరును సచిన్ టెండూల్కర్, జేమ్స్ ఆండర్సన్ పేరును ఉంచాలని %దీజజ×-జుజదీ% ఇప్పుడు నిర్ణయించింది. ఈ నిర్ణయం తర్వాత, సచిన్ టెండూల్కర్ దిగ్గజ క్రికెటర్ వారసత్వాన్ని కొనసాగించాలని %దీజజ×%కి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, సచిన్ టెండూల్కర్ బీసీసీఐ, ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు అధికారులతో మాట్లాడి, ఇండియా-ఇంగ్లాండ్ సిరీస్‌కు తన పేరు పెట్టవద్దని అభ్యర్థించారు. అలాగే, మునుపటి పటౌడీ ట్రోఫీని ఇండో-ఇంగ్లాండ్ సిరీస్‌లో కొనసాగించాలని కూడా ఆయన అభ్యర్థించారు.
ఇదిలా ఉండగా, గతంలో బీసీసీఐ కార్యదర్శిగా, ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడిగా ఉన్న జై షాకు సచిన్ టెండూల్కర్



కూడా భారత్-ఇంగ్లాండ్ సిరీస్‌లో పటౌడీ వారసత్వాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జే షా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుతో చర్చించారని, తదనుగుణంగా, ఇండో-ఇంగ్లాండ్ సిరీస్‌లో ఇచ్చే అవార్డుకు పటౌడీ పేరు పెట్టే అవకాశం ఉందని తెలిసింది. అంటే, ఇక్కడ టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీతో పాటు, ఒక అవార్డుకు పటౌడీ పేరు పెట్టనున్నారు. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే టెస్ట్ సిరీస్ కోసం కొత్త ట్రోఫీని జూన్ 14న ఆవిష్కరించాల్సి ఉంది. అయితే, అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం తర్వాత ఈ కార్యక్రమం వాయిదా పడింది. ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం జూన్ 20కి ముందే జరిగే అవకాశం ఉంది.

## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా నెంబర్ వన్

### ర్యాంకింగ్స్‌లో నాల్గో స్థానంలో భారత్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 విజేత దక్షిణాఫ్రికా, 27 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత %×జజ% ట్రోఫీని గెలుచుకుంది. ఫైనల్‌లో గత ఛాంపియన్ ఆస్ట్రేలియాను దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. ఇప్పుడు త్వరలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది, దీనికి ముందు టెస్ట్ ఫార్మాట్‌లో తాజా ర్యాంకింగ్‌లను చూడవచ్చు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రన్నరప్ ఆస్ట్రేలియా ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్‌లలో మొదటి స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆ జట్టుకు 123 పాయింట్లు ఉన్నాయి. %ఔజ% 2025 ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ర్యాంకింగ్‌లలో ప్రయోజనం చేకూరింది, ఇది రెండో స్థానానికి చేరుకుంది, ఇప్పుడు ఆ జట్టు 114 పాయింట్లతో ఉంది. ఇంగ్లాండ్ 113 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. కొన్ని నెలల క్రితం వరకు భారత జట్టు టెస్ట్ ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో ఉంది, అయితే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుస సిరీస్‌లలో ఓడిపోవడంతో నాల్గో స్థానానికి పడిపోయింది, ప్రస్తుతం 105 పాయింట్లు ఉన్నాయి. %ఔజ% 2021 విజేత న్యూజిలాండ్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. పాకిస్తాన్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, బంగ్లాదేశ్ తొమ్మిదో, ఐర్లాండ్ పదో స్థానంలో ఉన్నాయి. భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో ప్రారంభం కానుంది.

# విశ్వేజ



## బరువు తగ్గడానికి నీటి ఉపవాసం సులువైన మార్గమా? ప్రాణాలకే ప్రమాదమా?

బరువు తగ్గాలనే కోరికతో నేటి యువత ఏం చేయడానికి అయినా సిద్ధపడుతున్నారు. తమ అందం, ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగింది. బరువు తగ్గడానికి ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అయితే, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని ట్రెండ్స్ యువత ప్రాణాలకే ప్రమాదంగా మారుతున్నాయి. అలాంటి ఘటనే కేరళలో జరిగింది. 18 ఏళ్ల అమ్మాయి ఆన్‌లైన్‌లో చూసిన వీడియోను నమ్మి, కొన్ని నెలల పాటు నీళ్లు మాత్రమే తాగి ప్రాణాలు కోల్పోయింది. నీటి ఉపవాసం- నిజమెంత? నీటి ఉపవాసం అంటే, కొన్ని రోజుల పాటు ఆహారం మానేసి కేవలం నీళ్లు మాత్రమే తాగడం. ఈ విధానం ద్వారా వేగంగా బరువు తగ్గవచ్చని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే, ఇది ఎంత ప్రమాదకరమో చాలా మందికి తెలియదు. కొన్ని పరిశోధనల ప్రకారం, నీటి ఉపవాసం చేయడం వల్ల శరీరంలోని కణాలు తమను తాము శుద్ధి చేసుకుంటాయి. దీన్నే 'ఆటోఫాగి' అంటారు. అయితే, ఈ ప్రయోజనాలు చాలా తక్కువ కాలం మాత్రమే ఉంటాయి. %ూశ్రీంశీ =ఝు% గ్రీన్ కార్డు ఉన్నా తరిమేస్తాం- తేల్చేసిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్..! 72 గంటలు దాటితే ప్రమాదమే! సాధారణంగా, నీటి ఉపవాసం 24 నుంచి 72 గంటల వరకు మాత్రమే చేయాలి. అంతకంటే ఎక్కువ రోజులు చేస్తే, అది ప్రాణాంతకం కావచ్చు. ఎక్కువ కాలం చేస్తే ప్రమాదకరం అని నిపుణులు చెబుతున్నారు. వాటర్ తాగడం 72 గంటలు దాటితే ఆరోగ్యానికి ప్రమాదం. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ (సోడియం, పొటాషియం) స్థాయిలు పడిపోతాయి. డీహైడ్రేషన్ (శరీరంలో నీటి శాతం తగ్గడం) వస్తుంది. రక్తపోటు, చక్కెర స్థాయిలు పడిపోతాయి. గుండె పనితీరు మందగిస్తుంది. కండరాలు బలహీనపడతాయి. కిడ్నీలు దెబ్బతింటాయి. చివరికి ప్రాణాలు కూడా పోవచ్చు. మొదటిసారి నీటి ఉపవాసం ప్రయత్నించే వారికి, బలహీనత, మైకము మరియు తక్కువ రక్తపోటు సాధారణ దుష్ప్రభావాలు తలెత్తుతాయి. ఎవరికి ప్రమాదం? నీటి ఉపవాసం 72 గంటల మించితే ఆరోగ్యానికి ప్రమాదమే. గర్భిణీ స్త్రీలు, పిల్లలు అనారోగ్యాలకు గురైయ్యే అవకాశం ఉంది. గుండె, కిడ్నీ సమస్యలు ఉన్నవారు నీటి ఉపవాసానికి దూరంగా ఉండటం మంచిది. నీటి ఉపవాసం చేయాలనుకుంటే, ముందుగా డాక్టర్‌ను సంప్రదించాలి. క్రమంగా ఆహారం తగ్గించాలి, ఒకేసారి మానేయకూడదు. పుష్కలంగా నీళ్లు తాగాలి. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఉపవాసం ఆపేయాలి.

## రోజూ రాగి జావ తాగుతున్నారా
# అయితే, ఇవీ తెలుసుకోవాల్సిందే..!!



రాగిజావ. ప్రాచుర్యం పొందిన పోషక పదార్థం. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆహారం. శరీరానికి కావాల్సిన పోషకాలను అందించటం లో సహకరిస్తుంది. ఇందులో ఉండే కార్బోహైడ్రేట్లు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఉదయం వేళ ఖాళీ కడుపుతో తీసుకుంటే మరింత శక్తివంతగా పని చేస్తుంది. అదే విధంగా జీర్ణ వ్యవస్థ పని తీరు ను మెరుగు పరుస్తుంది. కడుపులో సహజంగా వచ్చే సమస్యలను నియంత్రిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండుగా ఉండటంతో పాటుగా బరువు తగ్గించటంలోనూ సహాయ కారిగా నిలుస్తుంది. అయితే, ఈ రాగి జావ ఎంత మంచిదో... అతిగా తీసుకుంటే సమస్యలు ఉన్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. రాగిజావ సహజ సిద్దంగా శరీరానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే కాల్షియం.. పోషకాలు ఎంత గానో ఉపకరిస్తాయి. చర్మానికి కావాల్సిన తేమను అందించి..ఆరోగ్యంగా ఉంచేందుకు సహకరి స్తుంది. మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఈ జావ మేలు చేస్తుంది. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ మోతాదు తక్కువగా ఉంటుంది. దీని కారణంగా చెక్కెర స్థాయి నియంత్రణలో ఉంచుతూ.. శరీరానికి శక్తిని అందిస్తుంది. ఉదయం వేళలో తీసుకోవటం ద్వారా శరీరానికి తక్షణ శక్తిని ఇస్తూనే.. ఎముకలకు బలాన్నిస్తుంది. ఇందులో ఉండే ప్రొటీన్ కణాల పునరుద్దరణకు సహకరిస్తుంది. ఇక, ఇదే సమయంలో రాగిజావ కు ప్రతీ రోజు ఒక సమయం కేటాయించి.. ఆ టైమ్ లో తీసుకోవటం ద్వారా ఆరోగ్య పరంగా ప్రయోజనం ఉంటుందని నిపుణులు సూచిసు ్నారు. రాగిజావ వినియోగంలోనూ కొన్ని సూచనలు చేస్తున్నారు. రాగి జావ ఉదయం వేళ తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయి. రాత్రి సమయంలో కొందరికి ఇబ్బందులకు కారణం అవుతుందని చెబుతున్నారు. అదే విధంగా మూత్రాయశయ సమస్యలు... కిడ్నీల్లో రాళ్లు ఉన్న వారు రాగిజావ తీసుకోకపోవటం మంచిదని సూచిస్తున్నారు. బరువు పెరగాల నుకొనే వారికి రాగిజావ వలన ప్రయోజనం ఉండదు. అదే విధంగా మోతాదు మేరకు వినియోగిస్తే సమస్యల ఉండవని.. అంతకు మించి తీసుకుంటే కడుపులో ఉబ్బరం తో పాటుగా డయేరియాకు అవకాశం ఉంటుందని అలర్ట్ చేస్తున్నారు. థైరాయిడ్ సమస్యలు ఉన్న వారు వైద్యుల సూచనల మేరకే రాగిజావను తీసుకోవటం మంచిది. ప్రస్తుతం ఇన్ స్టంట్ గా వస్తున్న రాగిజావ కంటే ఇంట్లో తయారు చేసుకునే రాగిజావ ఆరోగ్య రీత్యా మంచిది.

## నిద్ర పట్టట్లేదా? హాయైన నిద్ర కోసం
# ఈ హెర్బల్ టీలను తాగండి!



ప్రస్తుత సమాజంలో చాలామంది నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. అయితే ఎవరైతే నిద్ర సరిగ్గా పోరో వారి ఆరోగ్యం పాడవుతుంది. వారు చురుగ్గా పనిచేసుకోలేరు. ఎక్కువకాలం నిద్రలేమి సమస్య కొనసాగితే ఆరోగ్యానికి చేటు జరుగుతుంది. కాబట్టి ఇటువంటి వారికి నిద్ర పట్టడం కోసం కొన్ని హెర్బల్ టీ లు ఎంతగానో సహకరిస్తున్నాయి. మరి వాటిని గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఈ టీ తాగితే హాయిగా నిద్ర పడుతుంది సాధారణంగా నిద్రపోకుండా ఉండాలంటే టీ తాగుతారు. అయితే మంచి నిద్ర పోవడానికి కూడా కొన్ని రకాల టీలు ఉపయోగపడతాయి. ఇవి మన మానసిక ఆందోళనను తగ్గించి, ఒత్తిడిని తగ్గించి మనకు బాగా నిద్ర పట్టేందుకు దోహదం చేస్తాయి. ప్రశాంతతను కలిగించి నిద్రను మెరుగుపరుస్తాయి. ఇక అటువంటి టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీతో హాయిగా నిద్ర గ్రీన్ టీ లో ఎల్ థియనైన్ అనే అమైనో యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. గ్రీన్ టీ తాగినప్పుడు చాలా హాయిగా అనిపించి నిద్ర పడుతుంది. అయితే కెఫీన్ తక్కువగా ఉండే గ్రీన్ టీ రకాన్ని ఎంచుకొని తాగడం ఎంతో మంచిది. ఇక మనకు నిద్ర బాగా పట్టడానికి ఉపయోగపడే టీ లలో చామంతి టీ ఒకటి. చమోమైల్ టీ, లావెండర్ టీ తో హాయిగా నిద్ర ఈ చామంతి టీ ని తాగడం వల్ల కూడా ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. చమోమైల్ టీలో ఉండే ఫ్లేవర్స్ శరీరానికి హాయిని ఇస్తాయి ఇది నాణ్యమైన నిద్ర పట్టడానికి ప్రతి ఒక్కరికి సహకరిస్తుంది. ఇక ప్రశాంతమైన నిద్రపోవడానికి లావెండర్ టీ కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివల్ల మన నిద్రలో నాణ్యత పెరుగుతుంది. ఈ టీ తాగినట్లయితే మన శరీరం చాలా రిలాక్స్ అవుతుంది. ఆందోళన తగ్గుతుంది. గిన్ సెంగ్ టీ గిన్ సెంగ్ టీ.. ఈ టీలో అడాప్టేజన్ కాంపౌండ్స్ ఎక్కువగా ఉంటాయి.. ఇవి మన శరీరంలో హార్మోన్ల అసమతుల్యతను తగ్గిస్తాయి. ఇవి మనం ప్రశాంతంగా నిద్రపోవడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ గిన్ సెంగ్ టీ బ్యాగులు మార్కెట్లో బాగానే లభ్యమవుతున్నాయి. త్వరలో నక్కతోక తొక్కి సంపన్నులయ్యే రాశులు వీరే.. రాసి పెట్టుకోమన్న రాహువు! వలెరియన్ మొక్క వేరుతో చేసిన టీ ఇక మనకు ప్రశాంతంగా నిద్ర పట్టించే టీ లలో వలేరియన్ మొక్క వేరుతో చేసే టీ ఒకటి. వలేరియన్ మొక్క వేరులో చాలా ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి నిద్రలేమి సమస్యను తగ్గిస్తాయి. ఈ టీ తాగడం వల్ల నిద్ర మెరుగుగా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి నాణ్యమైన నిద్రకు ఈ టీ ఎంతగానో సహకరిస్తుంది.

## మందార పూల టీ తాగితే మీ ఆరోగ్యంలో జరిగేవి అద్భుతాలే.. ట్రై చెయ్యండి!

ఇటీవల కాలంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. ముఖ్యంగా ఉదయం పూట టీ తాగే విషయంలో చాలామంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తేయాకుతో తయారుచేసిన టీ కి బదులు శంఖు పూల టీ, మందార పూల టీ, తులసి ఆకుల తో టీ, గ్రీన్ టీ, బ్లూ టీ, లెమన్ టీ ఇలా రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. మందార పువ్వులలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ప్రస్తుతం మనం మందార పూలతో తయారుచేసే టీ లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలను గురించి తెలుసుకుందాం. మందార చెట్టు రకరకాల రంగులతో రకరకాల సైజులలో పూస్తుంది. మందార పువ్వులలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. మందార పువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంవల్ల ఇది మన శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. %ూశ్రీంశీ =ఝు% రేపటినుండి ఈ రాశులవారికి జాక్ పాట్.. వెలిగిపోతారన్న సూర్యుడు మందార పూల టీతో యవ్వనంగా మందార పూల టీ తాగితే మన చర్మం వృద్ధాప్య సంకేతాలను ఇది తగ్గిస్తుంది. శరీరాన్ని డిహైడ్రేడ్ కాకుండా మందార పూల టీ కాపాడుతుంది. మందార పూల టీ ని తాగడం వల్ల మన శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బరువు కూడా తగ్గుతారు. ఇక మందార పూల టీని తయారు చేసే విధానానికి వచ్చినట్లయితే మందార పువ్వులను బాగా ఎండబెట్టి ఆ ఎండిన పూలను పక్కన పెట్టుకోవాలి. మందార పూల టీ తో బరువుకు చెక్ నీటిని బాగా మరగపెట్టి అందులో ఎండిన మందార పూలను వేసి మరిగించాలి. ఇక మందార పువ్వుల టీ ని తయారు చేయడానికి ఎండిన పువ్వులనైనా, తాజాగా ఉన్న పువ్వులనైనా వాడవచ్చు. ఈ పూల టీని తాగితే బరువు కూడా తగ్గుతారని ఎన్నో అధ్యాయాలు ఇప్పటికే వెల్లడించాయి. దీనిని ఒక హెర్బల్ టీ గా చెప్తారు. ఈ టీతో అధిక రక్తపోటు సమస్య తగ్గుతుంది. మందార పూల టీ తో డయాబెటిస్, బీపీ కంట్రోల్ మందార పూల టీతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది.

# మార్కెట్


## బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!




న్యూఢిల్లీ : బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమి యం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయి లో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబో తున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రా యంగా వెల్లడించాయి. ప్రీమి యం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్‌డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

## పశ్చిమాసియా సంక్షోభంతో
# పెరుగుతున్న ముడి చమురు ధరలు..

### భారత కంపెనీలపై ఒత్తిడి..!



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం భారత చమురు మార్కెట్‌తో పాటు గ్యాస్ కంపెనీలపై ఆర్థికంగా ఒత్తిడి పడే అవకాశం ఉన్నది. ఐసీఐసీఐ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం.. ముడి చమురు ధర ప్రస్తుతం బ్యారెల్‌కు 73 డాలర్ల నుంచి 74 డాలర్ల వరకు ఉన్నది. అయినప్పటికీ.. చమురు మార్కెట్ కంపెనీల (%ూవీజం%) ఆదాయంపై ప్రభావితమవుతున్నది. అదే సమయంలో అప్‌స్ట్రీమ్ కంపెనీల ఆదాయం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నది. అప్‌స్ట్రీమ్ కంపెనీలు చమురు, గ్యాస్ పరిశ్రమ ప్రారంభ భాగంలో పని చేస్తుంటాయి. భూమి నుంచి చమురు, గ్యాస్‌ను వెలికితీసే ప్రక్రియ. ఇది గ్యాస్ కంపెనీలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశాలున్నాయి. ఎల్‌ఎన్‌జీ ముడి చమురుకు సంబంధించింది. ముడి చమురు ధర పెరిగితే.. ఎల్‌ఎన్‌జీ ధర సైతం పెరుగుతుంది. చమురు ధరల్లో ఈ పెరుగుదల ఇప్పటికీ 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పెరుగుదల కంటే తక్కువగా ఉందని పేర్కొంది. ప్రస్తుత పెరుగుదల గత నాలుగు సంవత్సరాల సగటు కంటే చాలా తక్కువగా ఉన్నది. ప్రస్తుతం, బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు దాదాపు 75 డాలర్లుగా ఉన్నది. ఇది 2026 ఆర్థిక సంవత్సరానికి విశ్లేషకుల అంచనా 68 డాలర్ల కంటే కంటే దాదాపు 6-7 డాలర్లు ఎక్కువ. అయినప్పటికీ, ముడి చమురు ధరలు 2022-25 సగటు కంటే 9డాలర్లు తక్కువగా.. 25 ఆర్థిక సంవత్సరం సగటు కంటే 4డాలర్లు తక్కువగా ఉన్నది. డిమాండ్ లేకపోవడం మార్కెట్‌ను ఆధిపత్యం చేస్తుంది.అయితే, ఇంధన కంపెనీ స్టాక్స్ హెచ్చుతగ్గులను చూస్తున్నాయి. ఇది ప్రపంచ అనిశ్చితుల మధ్య మార్కెట్ ఆందోళనలను ప్రతిబింబిస్తున్నది. దీని వెనుక కారణం హొర్ముజ్ జలసంధిలో తీవ్రమవుతున్న సంక్షోభం కారణం. హొర్ముజ్ జలసంధి ప్రపంచంలోని కీలకమైన సముద్ర మార్గాల్లో ఒకటి. ఎందుకంటే ఇది పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్‌ను కలుపుతుంది. ప్రపంచంలోని చమురు రవాణాలో ఎక్కువ భాగం ఈ మార్గం గుండా వెళుతుంది. భారతదేశం చమురు దిగుమతుల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ, ఎల్‌ఎన్‌జీ దిగుమతుల్లో సగానికిపైగా హొర్ముజ్ జలసంధి గుండా వెళతాయి. ఈ మార్గంలో ఏదైనా ఆటంకాలు ఎదురైతే.. భారతదేశం ఇతర వనరులు, మార్గాల కోసం వెతకాల్సిన అవసరం ఏర్పడుతుంది.

# పులివెందుల రాజకీయం చేస్తే.. తోక కట్ చేస్తా

**విశాఖపట్నంలో వైసీపీ నేతల భూములు కబ్జా**
**ముంబాయికి ధీటుగా విశాఖను అభివృద్ధి చేస్తాం**
**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



విశాఖపట్నం,జూన్16 : వైసీపీ నేతలు పులివెందుల రాజకీయం చేస్తే.. తోక కట్ చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. విశాఖపట్నంలో వైసీపీ నేతలు భూములు కొట్టేశారని ఆరోపించారు. ఎవరైనా భూముల జోలికి వస్తే...వెన్నులో భయం వచ్చేలా చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. గతజగన్ ప్రభుత్వంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశామని గుర్తుచేశారు.వైసీపీ నేతల మాటలను విశాఖ వాసులు నమ్మలేదని..మొన్నటి ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీనిని ఘోరంగా ఓడించారని చెప్పారు. విశాఖకు కూటమి ప్రభుత్వం రుణపడి ఉందని...ఎంత చేసిన తక్కువే అనిపిస్తోందని అన్నారు. ముంబాయికి ధీటుగా విశాఖను అభివృద్ధి చేస్తామని ఉద్ఘాటించారు. సోమవారం విశాఖపట్నంలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశంచేశారు. రాష్ట్రం అంతా ఒక ఎత్తు...విశాఖ ఒక ఎత్తు అని తెలిపారు. తాను మెచ్చిన నగరం విశాఖ...మంచి వాళ్లు ఎక్కువగా ఉన్న నగరం విశాఖ అని అభివర్ణించారు. ఒక కోటి సభ్యత్వాలు ఉన్న ఏకైక పార్టీ టీడీపీనేనని ఉద్ఘాటించారు. ఎత్తిన జెండా దించకుండా..ఎంతోమంది కార్యకర్తలు మనకు ఉన్నారని ప్రశంసించారు. మనది రాజకీయ బంధం కాదు.. కుటుంబ బంధం..కార్యకర్తల గౌరవాన్ని పెంపొందిస్తానని అన్నారు. టీడీపీ కార్యకర్తలు చాలా పవర్ ఫుల్‌గా ఉంటారని చెప్పారు. కార్యకర్తలకు అలక వస్తే.. కాడి వదిలేస్తారు..కానీ ఏ పార్టీలోకి వెళ్లరని కొనియాడారు. ఇక పార్టీ కార్యకర్తలు అలిగే పరిస్థితిని తాను ఎప్పుడూ రానివ్వనని మాటిచ్చారు. ఎన్నికల ముందు మనం ఎన్నో హామీలు ఇచ్చాం..మనం మీద నమ్మకంతో భారీ మెజార్టీ ఇచ్చారని.. దీంతో ఢిల్లీలో కూడా మన పరపతి పెరిగిందని చెప్పారు. ఉమ్మడి జిల్లా టీడీపీ కార్యకర్తలు అందరూ సమీక్షకు వచ్చారని అన్నారు. తెలంగాణలో తలసరి ఆదాయం ఎక్కువగా రావడానికి కారణం టీడీపీనేనని తెలిపారు.భోగాపురం ఎయిర్‌పోర్టు రెడీ అవుతోందని..త్వరలోనే విశాఖలో మెట్రో వస్తుందని ప్రకటించారు. గూగుల్ డేటా హబ్‌గా విశాఖ కానుందని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్ ఎ÷–లాంటు వస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్లను కాపాడింది ఎన్డీయే ప్రభుత్వమేనని... ఇటీవల ఆర్థిక ప్యాకేజీ కూడా వచ్చిందని పేర్కొన్నారు. 'విశాఖపై అభిమానంతో ఎన్నో చేస్తున్నాం...అభివృద్ధిలో రాజీ పడను. రైల్వేజోన్‌కి భూమి కేటాయించాం.. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అసెంబ్లీలో అమరావతికి మద్దతు ఇచ్చి...మూడు రాజధానులు అన్నారు. అమరావతిని స్మశానంతో పోల్చారు. విశాఖను టూరిజం హబ్‌గా చేస్తాం...ఆకాశమే హద్దుగా విశాఖను అభివృద్ధి చేస్తాం. పాఠశాలలు తెరిచే లోపు...తల్లికి వందనం ఇస్తామని చెప్పాం, మాట నిలబెట్టుకున్నాం. ఎంతమంది పిల్లలు ఉన్నా..తల్లికి వందనం ఇచ్చాం. ఈ విషయాన్ని కాలర్ ఎత్తుకొని కార్యకర్తలు చెప్పాలి.అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో కూడా ఏపీ లాంటి సంక్షేమ అభివృద్ధి పథకాలు లేవు. డీఎస్సీ నోటిఫికేష్ ఇచ్చాం. వైసీపీ హయాంలో ఒక టీచర్ ఉద్యోగం ఇవ్వలేదు. దీపం పథకాన్ని నేనే ప్రారంభించాను..ఇప్పుడు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్‌లు ఇస్తున్నాం. రోడ్డు మీద గుంత లేకుండా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలి. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తాం. రైతులకు మాట ఇచ్చిన ప్రకారం రూ.21 వేలు ఇస్తాం. రాష్ట్రంలో ఉన్న భూతాన్ని రాజకీయ సమాధి చేశాం. 2019 ఎన్నికల ముందు నన్ను మోసం చేశారు' అని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జగన్ మీడియాలో బాబాయ్‌కి గుండెపోటు అని అసత్య ప్రచారం చేశారు. ఆ రోజు నేను దోషులను జైల్లో పెట్టి ఉంటే...మనం అప్పుడు ఓడిపోయే వాళ్లం కాదు. బాబాయ్ హత్యపై... నాటకాల రాయుడు నాటకాలు ఆడాడు. నారాసుర రక్త చరిత్ర అని అన్నాడు. కోడి కత్తి, గులక రాయి డ్రామాలు ఆడారు..మొన్నే ఆయన ఇంటి దగ్గర అగ్నిప్రమాదం డ్రామా ఆడారు. పొదలిలోకి వెళ్లాడు.. అక్కడ రైతులను రెచ్చగొట్టారు..ఎదురొస్తే...తొక్కిస్తామని ప్లకార్డ్స్ ప్రదర్శించారు. నా వద్ద...మీ రౌడీయిజం చెల్లదు.. నేను ప్రజాస్వామ్య బద్దంగా వెళ్తాను. గంజాయి , డ్రగ్స్‌కి రాష్ట్రంలో చోటు లేదు. రౌడీలకు వత్తాసు పలికితే కఠిన చర్యలు. నేను రాజకీయ పోరాటం చేశాను..నాకు ఎవరి మీద కక్ష లేదు, రాష్ట్ర అభివృద్ధి ముఖ్యం..ఎవరు తప్పు చేసినా వదిలే ప్రసక్తి లేదు. వాట్సాప్ గవర్నెన్స్‌కి శ్రీకారం చుట్టాం. ఏపీ రోడ్లను బ్రహ్మాండంగా తయారు చేసే బాధ్యత నాది..పోర్టు, ఎయిర్ పోర్టులను అభివృద్ధి చేస్తాం. ఈ నెల 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి. ఇంకా టైమ్ ఉంది..యోగా ప్రాక్టీస్ చేయండి..5 లక్షల మందికి టీ షర్ట్స్ ఇస్తున్నాం. మొన్నటి ఎన్నికల్లో 94 శాతం రేటు సాధించాం. 2029 ఎన్నికల్లో మళ్లీ మనం ఘన విజయం సాధించాలి' అని సీఎం చంద్రబాబు కోరుకున్నారు.

# 30 లక్షల మంది తల్లులకు వందనం ఎగవేత

**సంక్షేమ పతకాలకు కూటమి సర్కార్ తూట్లు**
**జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం**
**పుస్తకావిష్కరిణలో మల్లాది విష్ణు విమర్శలు**

విజయవాడ,జూన్16 : చంద్రబాబు అధికారం కోసం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల పేర్లు మార్చారని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ విచ్ఛిన్నం అయిపోయింది. 30 లక్షల మందికి తల్లులకు తల్లికి వందనం ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారని ఘాటు విమర్శలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ శైలజ రెడ్డి, వైఎస్సార్ కార్పొరేటర్ విజయవాడలో జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. ఏపీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాలనుఈ పుస్తకంలో వివరించాము. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు తూట్లు పొడిచారు. చంద్రబాబు అధికారం కోసం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల పేర్లు మార్చారు. 30 లక్షల మందికి తల్లులకు తల్లికి వందనం ఎగ్గొట్టారు. వైజాగ్ ప్రభుత్వ పాఠశాలలో టీచర్స్ లేరని విద్యార్థులు ధర్నా చేసిన సందర్భాలు ఉన్నాయి. చంద్రబాబు 17 వందల కోట్లు పెట్టిన బకాయిలను వైఎస్ జగన్ తీర్చారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం దారుణం. జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని అందరు చదవాలి. కరెంటు చార్జీల పేరుతో చంద్రబాబు రూ.15 వేల కోట్లు వసూలు చేస్తున్నారు. బుడమేరుతో ముంపు గురైన ప్రజలకు న్యాయం చేసిన పరిస్థితి లేదు. శాతవాహన కళాశాల ను కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హిందూ దేవాలయాల మీద తెలుగుదేశం పార్టీకి సంబంధించి వారు దాడి చేస్తున్నారు. సంవత్సరం కాలంలోనే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకత వచ్చింది. లోకేష్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. తల్లికి వందనంలో 87 లక్షల మంది తల్లులకు ఇవ్వాలని లెక్కలు ఉన్నాయి. లోకేష్ తనకు తానే సవాల్ విసురుకుంటున్నాడు' అని అన్నారు. డిప్యూటీ మేయర్ శైలజ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో వైఎస్ జగన్ బటన్ నొక్కితే హేళనగా మాట్లాడారు. మీరెందుకు బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లో నగలు జమ చేయడం లేదు. చంద్రబాబు ఎవరికీ మంచి చేసిన విధానం లేదు. చంద్రబాబు మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. వైఎస్ జగన్ స్కూల్ డెవలప్మెంట్ కోసం డబ్బులు కేటాయిస్తే హేళన చేశారు. మీరు.. 13 వేలు తల్లులు ఖాతాలో వేసి మోసం చేశారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టండి. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. చదువుకునే విద్యార్థులు, రైతులు, మహిళలను చంద్రబాబు మోసం చేశాడు' అని తెలిపారు.

# జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు చిత్రవిచిత్రమైన ఆంక్షలు

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి అంబటి రాంబాబు**

గుంటూరు,జూన్16 : జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు పోలీసులు చిత్రవిచిత్రమైన ఆంక్షలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పోలీసుల వేధింపులకు ఆత్మహత్యకు పాల్పడ్డ వైసీపీ కార్యకర్త నాగ మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించ నున్నారు. ఆయన పర్యటనకు అనుమతి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు.. జగన్ ఇంట్లో నుంచి బయటకు వస్తే ఊరుకోం అనేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పొదిలి పర్యటనలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్ళారు.. అక్కడ నలుగురు మహిళల్ని పెట్టి నల్ల బెలూన్లతో జగన్ కి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు.. వాళ్ళే రాళ్ళు వేసి మావాళ్ళ మీద కేసులు పెట్టారు అని అంబటి రాంబాబు ÷ర్ అయ్యారు.అయితే,పోలీసుల వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పేందుకు జగన్ వస్తున్నారని మాజీమంత్రి అంబటి రాంబాబు తెలిపారు. జగన్ వెళ్తున్నారంటే అనేక మంది అనుసరిస్తారు.. వైఎస్సార్ బిడ్డగా జగన్ కోసం జనం వస్తారు.. పార్టీ కార్యకర్త మృతి చెందారు.. కాబట్టే వాళ్ళ కుటుంబ సభ్యులను పరామర్శకు వెళ్తున్నారు.. ఇక, జగన్ బయటకు వస్తున్నాడంటే చంద్రబాబు, లోకేష్ భయపడుతున్నారు అని ఎద్దేవా చేశారు. మేం ఇన్ని పర్యటనలకు వెళ్ళాం.. ఎక్కడైనా లా అండ్ ఆర్డర్ సమస్య వచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ పర్యటనలు భగ్నం చేయాలనే కుట్రలు చేస్తున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. మిస్టర్ లోకేష్, మిస్టర్ చంద్రబాబు అధికారం ఉంది కదా అని మీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారు అని అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఓ పక్క కేసులు పెడతారు.. మాపైనే దాడులు చేస్తారు.. ప్రజాస్వామ్యంలో ఎన్నాళ్లు సాగుతుందో మేము చూస్తామని అన్నారు. మీరు చేసిన వాగ్దాన భంగాలు ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం.. మీరు ఎన్నాళ్లు అనిచి వేస్తారో మేము చూస్తామని తెలిపారు. జగన్ కు ప్రజల్లో జనాదరణ పెరుగుతుంది.. ఇప్పటి వరకు చంద్రబాబు వెన్నుపోటు మంచితనాలు చాలా చూశాం.. భయపడితే రాజకీయాలు చేయలేం అని మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పుకొచ్చారు.



# హామీలను నెరవేర్చని కూటమి ప్రభుత్వం

**సూపపర్ సిక్స్ హామీలకు చెల్లుచీటి**
**మాజీమంత్రి రోజా ఘాటు విమర్శలు**

తిరుపతి,జూన్16 : ఇచ్చిన హామీలను ఏడాదైనా నెరవేర్చ లేకపోయారని కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి ఆర్కే రోజా హాట్ కామెంట్స్ చేశారు. ఇది మంచి ప్రభుత్వం కాదని.. ముంచే ప్రభుత్వం అని విమర్శించారు. 143 హామీలతో పాటు సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి.. ఒక పథకంను కూడా అమలు చేయడానికి వారికి మనసు రాలేదని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు సూపర్ అమలు చేశామని చెప్పడంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉలిక్కిపడ్డారన్నారు. ఒక్క పథకంను అమలు చేయకుండా, ఒక్క అభివృద్ధి పని చేయకుండా.. అన్ని చేశామని చంద్రబాబు చెప్పడంపై ప్రజలు తమను తాము గిల్లి మరీ చూసుకుంటున్నారన్నారు. 30 లక్షల మంది తల్లులకు 'తల్లికి వందనం' ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందని రోజా మండిపడ్డారు. సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి ఆర్కే రోజా మీడియాతో మాట్లాడారు. '143 హామీలతో పాటు సూపర్ సిక్స్ ఇస్తామని చెప్పి ఒక పథకంను అమలు చేయడానికి వారికి మనసు రాలేదు. సీఎం చంద్రబాబు సూపర్ అమలు చేశామని చెప్పడంపై ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఒక్క పథకంను అమలు చేయకుండా, ఒక్క అభివృద్ధి పని చేయకుండా.. అన్ని చేశామని చంద్రబాబు చెప్పడంపై ప్రజలు తమను తాము గిల్లి మరీ చూసుకుంటున్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు, అమ్మ ఒడి ఇవ్వలేదు, విద్యాదీవెన ఇవ్వలేదు.. ఇలా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. వైఎస్ జగన్ పొదలి పర్యటనకు వచ్చిన ప్రజలను చూసి భయపడి రాత్రి 'తల్లికి వందనం' జీవో విడుదల చేశారు. 30 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసింది. తల్లికి వందనం పథకం కాదు తల్లికి కోతల పథకం అది' అని ఆర్కే రోజా విమర్శించారు. 'ఒకే అకౌంట్లో, ఒకే ఆధార్ నెంబర్తో 80–100 మంది పిల్లలకు ఎలా డబ్బులు పడ్డాయి?.. ఈ డబ్బులు ఎక్కడికి వెలుతున్నాయి. కెమెరాల ముందు సవాలు చేయడం, తొడలు కొట్టడం కరెక్ట్ కాదు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉండటంతో ఎంతో మంది పిల్లల జీవితాలు నాశనమయ్యాయి. సవాల్ చేయడానికి లోకేష్ గారికి ఏ అర్హత ఉంది?. కేవలం పబ్లిసిటీ కోసమే పథకాలు ఇస్తూ అన్నిటిలో కోతలు విదిస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు బాగా అర్థమైంది. వైఎస్ జగన్ రెడ్డిపై నోరు పారేసుకోవడం మానుకొని.. ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చిత్తశుద్ధి చూపించాలి. రెడ్ బుక్ రాజ్యాంగం పక్కనపెట్టి.. ఎల్లో బుక్ హామీలు అమలు చేయాలి. రాష్ట్రంలోకి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా తీసుకొచ్చి జీవితాలను నాశనం చేస్తున్నారు. ఆడపిల్లల పైన అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోలేదు. వైసీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. అన్నింటికీ సమాధానం చెప్పాల్సిన రోజు తొందరలోనే ఉంది. వెన్నుపోటు పుస్తకాన్ని ప్రతి ఓటర్కు అందించి.. కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరిస్తాం, మీ మెడలు వంచి శిక్ష వేస్తాం' అని స్పష్టం చేశారు.

# అరకొర ఫీజు రియంబర్స్‌మెంట్

**విద్యార్థుల జీవితాలతో చెలగాటం**
**మండిపడ్డ వైకాపా విద్యార్థి నేత రవిచంద్ర**

అమరావతి,జూన్16 : గత ఏడాది పూర్తిగా ఎగ్గొట్టి, ఈ ఏడాది కూడా అరకొర నిధులు ప్రకటించిన టీడీపీ కూటమి ప్రభుత్వం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకుండా, వారి జీవితాలతో ఆడుకుంటోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర ఆక్షేపించారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని, పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఎ.రవిచంద్ర హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు: విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుకుంటోంది. ఈ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ చేయలేదు. ఫీజు చెల్లించకపోవడంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు టీసీ ఇవ్వకుండా వేధిస్తున్నాయి. మరోవైపు దీనిపై ఇప్పటికే సమావేశమైన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు, ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశాయి. ఇందులో అధికార పార్టీ నాయకులకు చెందిన కాలేజీలు కూడా ఉన్నాయి. విద్యార్థుల తరఫున చెల్లించాల్సిన ఫీజుకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేష్, ఆ మాట నిలబెట్టుకోకుండా.. ఏడాది పాలన ఘనతలంటూ డప్పుకొట్టుకోవడం దారుణం. వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్ల కాలంలో అమలు చేసిన విద్యా సంస్కరణలను ఏడాదిలోనే నాశనం చేశారు. విద్యార్థులకు విద్యాదీవెన కిట్లు కూడా సకాలంలో అందని పరిస్థితి నెలకొంది. పరీక్షలు కూడా విజయవంతంగా నిర్వహించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. ప్రైవేటు ఎయిడెడ్ కాలేజీల భూములపై కన్నేసి కాజేయడానికి టీడీపీ నాయకులు పోటీ పడుతున్నారు. పిల్లల చదువులను ఈ ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవడం లేదు. విద్యార్థుల బకాయిలు రూ.6,400 కోట్లు: 2024 ఏప్రిల్ నుంచి 2025 జూన్ 16 నాటికి ఆరు త్రైమాసికాలకు సంబంధించి విద్యార్థులకు ప్రభుత్వం రూ.6,400 కోట్లు బకాయి పడింది. అందులో రూ.4,200 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కాగా, రూ.2,200 కోట్లు స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయి. కొందరు విద్యార్థులు ఫీజులు కట్టుకోవడం కోసం కూలీ పనులకు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక క్వార్టర్లీ ఫీజు చెల్లింపు విధానాన్ని రద్దు చేసి హాఫ్ ఇయర్లీ విధానం తీసుకొచ్చారు. రెండుసార్లు గడువు పూర్తయినా విద్యార్థుల తరఫున ప్రభుత్వం ఫీజులు జమ చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయి. పరీక్షలప్పుడు హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో అంగీకార పత్రాలు రాయించుకుని వారిని పరీక్షలకు పంపించిన దుస్థితికి రాష్ట్ర విద్యావ్యవస్థను తీసుకెళ్లారు. అబద్ధాలు చెబుతున్న ప్రభుత్వం: రెండు క్వార్టర్ల ఫీజు చెల్లించామని ఈ ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది. వాస్తవానికి ఏడాది కాలంలో కేవలం ఒకటిన్నర క్వార్టర్ ఫీజును మాత్రమే జమ చేసింది. ఒక క్వార్టర్ పూర్తిగా ఇచ్చి ఇంకో క్వార్టర్ సగం మాత్రమే చెల్లించి రూ.300 కోట్లు పెండింగ్ పెట్టారు.

# విజయవాడలో 72 అడుగుల మట్టి మహాగణపతి

**పూజా కార్యక్రమంలో పాల్గొన్న నటుడు సుమన్**

విజయవాడ,జూన్16 : విజయవాడలో 72 అడుగుల మట్టి మహాగణపతిని ఏర్పాటుకు పూనుకున్నారు. విజయవాడ లేబరు కాలనీ మైదానంలో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి మహాగణపతి విగ్రహ ఏర్పాటు కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. ఇంతపెద్ద విగ్రహం మట్టితో చేయడం అభినందనీయమని సీనియర్ నటుడు సుమన్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నటుడు సుమన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా మట్టితో మహాగణపతిని తయారు చేయడం స్ఫూర్తినీయమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ఎటువంటి విఘ్నాలు తలెత్తకుండా గణేశుని ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. ఎంపీ కేశినేని శివనాథ్ తనయుడు వెంకట్ మాట్లాడుతూ వినాయక చవితికి అందరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మట్టి ప్రతిమలకు పూజ చేయాలన్న స్ఫూర్తిని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో డూండీ గణేష్ సేవా సమితి కలిగించిందన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా 72 అడుగుల మట్టి మహాగణపతిని ఏర్పాటు చేసి భక్తుల మన్ననను పొందామన్నారు. ఈ కార్యక్రమంలో డూండీ గణేష్ సేవా సమితి కమిటీ సభ్యులు గద్దం రవి, ముక్తేశ్వరరావు, సుబ్బారావు, కూటమి నాయకులు శివశర్మ లక్ష్మణరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం

**తప్పడు వాగ్దానాలను తెలిపేందుకే పుస్తకం**
**మాజీమంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్**

విజయవాడ,జూన్16 : జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్న ప్రభుత్వం చేసిన తప్పుడు వాగ్దానాలు ప్రజలకు తెలిసే విధంగా పుస్తకాన్ని ఏర్పాటు చేశాం అన్నారు. కూటమి సర్కార్ కేవలం వైసీపీ పార్టీని ఇబ్బంది పెట్టడం, వైసీపీ కార్యకర్తలని అరెస్టు చేసే పనిలోనే బిజీగా ఉన్నారని వెల్లంపల్లి అన్నారు. ఇక, కూటమి ప్రభుత్వాన్ని దేని గురించి అయినా ప్రశ్నిస్తే అరెస్టు చేస్తున్నారు అని మాజీ మంత్రి వెల్లంపల్లి పేర్కొన్నారు. ఇక, తల్లికి వందనం అనే పేరుతో రూ. 13 వేల రూపాయలు వేస్తానని చెప్పిన చంద్రబాబు.. ఎంతమంది విద్యార్థులకు తల్లికి వందనం ఇచ్చాడో చెప్పాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని, ఇప్పుడు అదే ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు.. గతంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన చేసినప్పుడు.. ఈ రాష్ట్రం శ్రీలంక అయిపోతుంది, అప్పుల్లో కూరుకుపోయిందని తప్పుడు ప్రచారం చేశారు చంద్రబాబు.. మరి ఇప్పుడు ఈ సంవత్సర కాలంలో చంద్రబాబు ఎంత అప్పు చేసాడో ప్రజలు చెప్పాలి వెల్లంపల్లి శ్రీనివాస్ అడిగారు. అయితే, 40 ఏళ్ల ఎక్స్ పీరియన్స్ ఉందని చెప్పుకొని తిరిగే చంద్రబాబు, దేశంలో మోడీ కంట నేనే సీనియర్ అని చెప్పుకునే ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి తెలియదా అని వైసీపీ నేత వెల్లంపల్లి పేర్కొన్నారు. చంద్రబాబు అంటే పథకాలు అమలు చేయని వ్యక్తి.. ప్రజలు ఎవరికీ పథకాలు కూడా పథకాలు రావు.. ఎంతసేపు రెడ్ బుక్ అని భయపెట్టేలని తిరుగుతున్నారు.. ఎవరు భయపడడానికి సిద్ధంగా లేరు అన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ఈ పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరికీ చేరే విధంగా కృషి చేస్తామని వెల్లంపల్లి శ్రీనివాస్ చెప్పుకొచ్చారు.

# యువతిపై చేయి చేసుకున్న ర్యాపిడో రైడర్

బెంగళూరు, జూన్16 : ర్యాపిడో బైక్ డ్రైవర్ ఓ యువతిపై చేయి చేసుకున్న సంఘటన సోమవారం కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో చోటుచేసుకుంది. ర్యాపిడో బైక్ రైడర్ ఓ అమ్మాయిపై చేయి చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో రైడ్ బుక్ చేసుకుని ఈజీగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా వీటిపైనే ఆధారపడి ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరులో ఓ యువతి ర్యాపిడో బైక్ రైడ్ బుక్ చేసుకుంది. ఈ క్రమంలో ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. ర్యాపిడో బైక్ డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ చేశాడు. దీంతో ఆమె రైడ్‌ను మధ్యలోనే ఆపి కిందకు దిగింది. ర్యాష్ డ్రైవింగ్‌పై అతడిని ప్రశ్నించింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన బైక్ డ్రైవర్.. ఆ యువతిపై చేయి చేసుకున్నాడు. రోడ్డుపైనే యువతి చెంప ఛెళ్లుమనిపించాడు. దీంతో ఆమె ఒక్కసారిగా కింద పడిపోయింది. అక్కడున్న స్థానికులు ఈ తతంగాన్నంతా చూస్తున్నారు తప్పితే ఆపే ప్రయత్నం చేయలేదు. ఈ నెల జూన్ 14న జయనగర్ ప్రాంతంలో చోటు చేసుకున్న ఈ ఘటన తాజాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సంఘటన పై బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జాయినింగ్ ఆర్డర్ కోసం 20వేలు డిమాండ్

**ఎసిబికి చిక్కిన ములుగు డిఇవో**

ములుగు,జూన్16 : జిల్లాలో అవినీతి నిరోధక శాఖ దాడు చేసింది. ములుగు జిల్లా డిస్టిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కన్నాయిగూడెం మండలం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ ఉద్యోగి జాయినింగ్ ఆర్డర్ కోసం డీఈఓ కార్యాలయంలో 20 వేల రూపాయలు లంచంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ముందస్తు సమాచారం మేరకు ఏసీబీ అధికారులు రైడ్ నిర్వహించారు. ఈ సమయంలో డీఈఓ పాణిని, జూనియర్ అసిస్టెంట్ దిలీప్ లు బాధితుడి నుండి 20 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.



# అందాలు ఆరబోస్తున్న కన్నప్ప హీరోయిన్

టాలీవుడ్‌ను కొత్త అందాలు పలకరిస్తున్నాయి. కొత్త హీరోయిన్స్ చాలా మంది తన అందంతో నటనతో ఆకట్టుకుంటున్నారు. అలా టాలీవుడ్ కు పరిచయమైన భామే ప్రీతి ముకుందన్. ఈ చిన్నది ఇటీవలే టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలో నటిస్తుంది. ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలతో తన కెరీర్ ను ప్రారంభించింది. అందాల భామ ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది. ఆతర్వాత ఈ చిన్నదానికి సినిమా ఆఫర్స్ వచ్చాయి. శ్రీవిష్ణు సరసన 'ఓం భీమ్ బుష్' సినిమాతో హీరోయిన్ గా మారింది.'ఓం భీమ్ బుష్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమాలో ప్రీతి ముకుందన్ అందంతో పాటు అభినయంతోనూ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు కన్నప్ప సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. మంచు విష్ణు తెరకెక్కిస్తున్న కన్నప్ప సినిమాతో మరోసారి ప్రేక్షకులను కవ్వించనుంది ప్రీతి ముకుందన్మంచు. కన్నప్ప సినిమా పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొన్నామధ్య కన్నప్ప సినిమాలో నెమలి పాత్రలో ప్రీతి ముకుందన్ నటిస్తుందని అనౌన్స్ చేస్తూ ఓ అందమైన పోస్టర్ వదిలారు. సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు చుస్తే నోరెళ్లబెట్టాల్సిందే.. ఈ ఫొటోలకు కుర్రాళ్ళు రొమాంటిక్ కామెంట్స్ చేస్తున్నారు.



# లుక్స్‌పై కాకుండా.. పనితనంపై దృష్టిపెట్టండి..

## మిల్కీబ్యూటీ కామెంట్‌పై తమన్నా రియాక్షన్

తమన్నా తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. శ్రీ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ చిన్నది.. హ్యాపీడేస్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా తర్వాత తెలుగులో బిజీగా మారిపోయింది. ఇటీవల స్పెషల్ సాంగ్స్ లోనూ నటిస్తూ ఆకట్టుకుంటుందో. రీసెంట్ గా విడుదలైన 'స్త్రీ 2' చిత్రంలో స్పెషల్ సాంగ్ చేసింది. ఈ అమ్మడు విజయ్ వర్మతో డేటింగ్ చేస్తోంది. అయితే గతంలో తమన్నా తనను మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్ తో పిలవొద్దు అని చెప్పింది. తనకు మిల్కీ బ్యూటీ అనే ట్యాగ్ ఇవ్వొద్దు అని తెలిపింది. తాజాగా మరోసారి మిల్కీ బ్యూటీ ట్యాగ్ గురించి ప్రస్తావించింది. తమన్నా భాటియాను "మిల్కీ బ్యూటీ" అని పిలవడం గురించి ఆమె ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది. ఓదెల 2' సినిమా ప్రమోషన్ సందర్భంగా తమన్నాను ఓ రిపోర్టర్ ఇలా అడిగారు: "ఒక మిల్కీ బ్యూటీలో శివశక్తి ని చూడాలని ఎలా అనిపించింది.?" దీనికి తమన్నా స్పందిస్తూ, తనను "మిల్కీ బ్యూటీ" అని పిలవడం తనకు సమస్య కాదని, అయితే తన పాత్రల ద్వారా తన సామర్థ్యాన్ని చూపించడంపైనే ఎక్కువ దృష్టి పెడతానని చెప్పింది. ఆమె మాటల్లో, "నన్ను మిల్కీ బ్యూటీ అని పిలవడం గురించి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ నేను ఈ సినిమాలో శివశక్తి పాత్రను పోషిస్తున్నాను, ఇది ఒక ఆధ్యాత్మిక శక్తితో కూడిన పాత్ర. నా పాత్రల ద్వారా నా నటనా సామర్థ్యాన్ని, వైవిధ్యాన్ని చూపించడమే నా లక్ష్యం." అని తెలిపింది. ఆమె తన లుక్స్‌పై కాకుండా తన పనితనంపై దృష్టి పెట్టాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేసింది తమన్నా.

# లండన్‌లో జాన్వీ అందాల విందు

ఇండస్ట్రీలో కొత్త అందాలు ప్రేక్షకులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. కొత్త కొత్త హీరోయిన్ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ పరిచయం అవుతూ దూసుకుపోతున్నారు. ఇక చాలా మంది హీరోయిన్స్ కు అవకాశాలు చాలా చిత్ర విచిత్రంగా వస్తుంటాయి. కొంతమంది ఎంతో కష్టపడి అవకాశాలను అందుకుంటున్నారు. మరికొంతమందికి ఈ మధ్య సోషల్ మీడియా పుణ్యమా అని హీరోయిన్ అవకాశాలు అందుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ అలా వచ్చిన వారే.. అయితే ఇప్పుడు మనం చూస్తున్న హీరోయిన్ కూడా విచిత్రంగా హీరోయిన్ గా మారిపోయింది. హీరోయిన్ పాత్ర కోసం ఆడిషన్ కు వెళ్తే అనుకోకుండా హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఇప్పటికే చాలా మంది హీరోయిన్ తెలుగులో రాణిస్తున్నారు వారిలో శివాని నాగరం ఒకరు. ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా. శివాని నాగరం నటనా జీవితాన్ని ఆడిషన్‌ల ద్వారా ప్రారంభించింది. ఈ అమ్మడి మొదటి సినిమా అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు (2024), ఈ చిత్రంలో సుహాస్ సరసన హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఆమె లక్ష్మి అనే పాత్రలో కనిపించింది. ఈ సినిమాలో తన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇక ఈ చిన్నది సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇన్ స్టాగ్రామ్ ద్వారా మెసేజ్ పంపారు, నేను హీరోయిన్ ఫ్రెండ్ రోల్ కోసం ఆడిషన్ అని వెళ్లాను. అయితే ఆడిషన్ తీసుకున్న తర్వాత హీరోయిన్ గానే తీసుకుంటున్నారు అని చెప్పారు. అయితే మొదటి రోజు షూటింగ్ జరిగే వరకు నేనే హీరోయిన్ అనేది నమ్మలేకపోయా.. అని తెలిపింది. ఇక సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది.





# మంచులక్ష్మి ఎకిపారేస్తున్న నెటిజన్లు

మోహన్ బాబు ముద్దులు కూతరు మంచు లక్ష్మి గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. హొస్ట్‌గా కెరీర్ తొలినాళ్లలో అదరగొట్టిన మంచు లక్ష్మి ఆ తర్వాత నటిగా మారింది. వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులని మెప్పిస్తుంది. ఇదే క్రమంలో హనీరోజ్ మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ తో కలిసి ఓ సినిమా చేసింది మంచు లక్ష్మి. ఆ సినిమా పేరు మాన్‌స్టర్. ఈ సినిమా సస్పెన్స్ థిల్లర్ గా తెరకెక్కింది. ఈ సినిమాలో మంచు లక్ష్మి కీలక పాత్ర పోషించింది. అలాగే ఈ సినిమాలో మంచు లక్ష్మి,హనీరోజ్ లెస్బియన్స్ గా నటించారు. అంతే కాదు ఈ సినిమాలో లక్ష్మి మంచు, హనీ రోజ్ డీప్ లిప్ కిస్ కూడా ఉంది. ఈ మూవీ క్లైమాక్స్ సీన్ లో లక్ష్మి మంచు, హనీ రోజ్ లిప్ లాక్ సీన్ ఉండగా, ఇంటిమేట్ సీన్స్ లో ఈ ఇద్దరు రెచ్చిపోయి నటించారు. సినిమా వచ్చి చాలా రోజులే అయినా మరోసారి యూట్యూబ్‌లో ఈ మూవీ సీన్స్ వైరల్ అవుతున్నాయి. ఇక ఇదిలా ఉంటే కరణ్ జోహార్ హొస్ట్ చేస్తూ నిర్మిస్తున్న ఇండియన్ వర్షెన్ ది ట్రైటర్స్ లో మంచు లక్ష్మి కీలక పాత్రలో కనిపిస్తుంది. ఉల్లు ఫ్లాట్ ఫామ్ బోల్డ్ స్టార్స్ కూడా ఇందులో పాల్గొంటున్నారు. అయితే తాజాగా మంచు లక్ష్మి ఎంట్రీకి సంబంధించిన ఎపిసోడ్ స్ట్రీమ్ కాగా, అందులో ఓ కంటెస్టెంట్‌తో మంచు లక్ష్మి గొడవపడింది. రామాయణంలో రాముడు నీటిలో చూస్తూ పైన ఉన్న చేపని విల్లుతో కొట్టాడని వాదనకి దిగింది. దీంతో ఎవరు ఈమె? ఏం మాట్లాడుతుంది అంటూ నార్త్ ఇండియన్స్ మంచు లక్ష్మికి సంబంధించిన క్లిప్పింగ్‌ని సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ చేస్తున్నారు. ఈవిడ మహాభారత కథని రామాయణంగా మార్చిందని ట్రోల్ చేస్తున్నారు. ఈ వీడియోలో మంచు లక్ష్మిని చూసిన తెలుగోళ్లు కూడా తెగ తిట్టేస్తున్నారు. ఆ అవతారం ఏంది? ఆ కథేంది? పరువు తీస్తున్నావు కదా అంటూ తిట్టిపోస్తున్నారు.

# డబుల్ డోస్

## వెకేషన్‌లో ఫొటోలు షేర్ చేసిన సురేఖావాణి. సుప్రీత

ప్రముఖ క్యారెక్టర్ యాక్టర్ సురేఖా వాణి, అమె ముద్దుల తనయ సుప్రీత మరోమారు సోషల్ మీడియా దుమ్ము దులిపేస్తున్నారు. రీసెంట్‌గా.. ఇద్దరు కలిసి వెకేషన్ వెళ్లిన వారు అక్కడ సరదాగా గడుపుతూ, ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. ఈ క్రమంలో తమ డ్రెస్సింగ్ స్టైల్‌లో హాట్ నెస్ పెంచి వీక్షకులకు అదిరే ట్రీట్ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు తమ ఇన్ స్టాలో షేర్ చేయడంతో చూసిన వారంతా వారి గ్లామర్‌కు ఫిదా అవుతున్నారు. ఈ దృశ్యాలు తిలకించిన ఫాలోవర్లంతా సరిపోయారు ఇద్దరు.. సాగుతుంది మీకలాగా అంటూ సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలోని బామ డైలాగును వీరిద్దరికి అన్వయిస్తూ కామెంట్లు చేస్తునే ఒకటికి రెండు మార్లు ఆ చిత్రాలు చూసేస్తున్నారు. ప్రస్తుతం వీరి వీడియో, ఫొటోలు సామజిక మాధ్యమాల్లో బాగా ట్రెండ్ అవుతున్నాయి. వయస్సుకు సంధం లేకుండా చాలా మంది వారి ఫొటోలకు లైక్‌లు కొడుతూ మీరిలాగే కలకాలం హ్యాపీగా ఉండాలని కోరుకుంటున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com